అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

సోమవారం 24-02-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 54 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

## కోహ్లి శతకం..
## పాక్ ఖేల్ ఖతం



6 వికెట్లతో పాక్‌పై భారత్ ఘన విజయం

ఛేదనలో విరాట్ కోహ్లి అజేయ సెంచరీ

రాణించిన శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్

వివరాలు 14లో

## రాష్ట్రంలో కొత్త లిక్కర్ బ్రాండ్లకు గ్రీన్ సిగ్నల్

మార్చి 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

విధివిధానాలు ప్రకటించిన టీజీబీసీఎల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మద్యం బ్రాండ్ల కొత్త విధానానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. రాష్ట్రంలో రిజిస్టర్ కాని కొత్త సరఫరా దారుల నుంచి దరఖాస్తులను మార్చి 15 వరకు స్వీకరిస్తున్నట్టు...13లో



## టన్నెల్‌లో టెన్షన్

### ఆ ఎనిమిది మంది కోసం

### కొనసాగుతున్న సహాయక చర్యలు





ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో ధ్వంసమైన ఆక్సిజన్ పైపులు

సంఘటనా స్థలంలో పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు

ఎన్డీఆర్ఎఫ్, సైనిక, హైడ్రా బృందంతో కలిసి సొరంగంలోకి వెళ్లిన మంత్రి జూపల్లి

కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం చెప్పిన అధికారులు

నవ తెలంగాణ - మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సొరంగంలో మట్టి, నీరు భారీగా చేరడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. కృష్ణానది నుంచి మన్నెవారి పల్లి వరకు ఏర్పాటు చేస్తున్న ఈ సొరంగం పనుల్లో టన్నెల్ కూలిన సంగతి తెలిసిందే. ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు టన్నెల్‌లో చిక్కుకుపోయారు. ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి రెస్క్యూ టీమ్, హైడ్రా ...6లో

**కార్మికులను రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలి**

**సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం** 13లో

### బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి 6లో..



# కేంద్రం కరుణిస్తేనే రిజర్వేషన్లు

**మోడీ కోర్టులో బంతి** | **శాసనసభ ఆమోదం నామమాత్రమే** | **పార్లమెంట్‌లో బిల్లు పాసయితేనే చట్టం**


**కేంద్ర ప్రభుత్వం కరుణిస్తేనే రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలు ప్రక్రియ ముందుకు సాగనుంది. తెలంగాణ ప్రభుత్వం కులగణన ఆధారంగా ప్రతిపాదించిన రిజర్వేషన్ల భవితవ్యం మోడీ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కులగణనను చేపట్టి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను నిర్ణయించింది. అయితే ఇవి సుప్రీంకోర్టు తీర్పులకు భిన్నంగా ఉన్న నేపథ్యంలో పార్లమెంట్‌లో చట్టం చేస్తే గాని పట్టాలెక్కే పరిస్థితి లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్, దేశంలో బీజేపీ సర్కార్ అధికారంలో ఉన్న నేపథ్యంలో... ఇది ఎప్పటికి చట్ట రూపం దాలుస్తుందనేది వేచిచూడాలి.**

ఊరగొండ మల్లేశం

దేశంలోని ఏ రాష్ట్రమైనా రిజర్వేషన్లను 50 శాతం కంటే ఎక్కువ అమలు చేయరాదంటూ సుప్రీంకోర్టు 1992లో స్పష్టం చేసింది. ఆయా రాష్ట్రాల్లో ఉండే సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఎవరైనా అంతకు మించి అమలు చేయాలనుకుంటే పార్లమెంట్ ఆమోదం తప్పనిసరని పేర్కొంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అమలుకు ప్రతిపాదించిన రిజర్వేషన్ల శాతం సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా ఉంది. రాష్ట్ర జనాభాలో బీసీలకు 42 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7 శాతం అమలు చేయాలని సర్కార్ నిర్ణయించింది. ఈ గణాంకాలు పట్టాలెక్కాలంటే పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిందే. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కార్ అందుకు సహకరిస్తుందా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రతి పదేండ్లకొకసారి దేశంలో జనగణన నిర్వహిస్తారు. 2011 తర్వాత 2021లో నిర్వహించాల్సిన జనాభా లెక్కలను కేంద్రం చేపట్టలేదు. జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని కొన్నేండ్లుగా దేశంలోని పలు రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కొన్ని బలమైన సామాజిక వర్గాలు కులగణనను వ్యతిరేకిస్తున్నాయి. ఈ తేనే తుట్టెను కదిపితే తమకు తీవ్రంగా నష్టం జరుగుతుందని బీజేపీ సైతం భావిస్తోంది. కులగణనకు భయపడి గత నాలుగేండ్లుగా కేంద్రం జనగణనను సైతం తాత్సారం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రతిపాదించిన రిజర్వేషన్ల చట్టబద్ధతకు కేంద్రం సహకరిస్తుందా? అనే సందేహం వ్యక్తం అవుతోంది.

**శాసనసభ ఆమోదం తర్వాత... ఢిల్లీకి అఖిల పక్షం**

కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని విపక్షాలంటున్నాయి. ఎన్నికల ముందు బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో అమలు చేయాలని అవి డిమాండ్ చేస్తున్నాయి. శాసన సభలో అమోదించి, రిజర్వేషన్ల లెక్క కేంద్రం పరిధిలో ఉందని చేతులు దులుపుకుంటే ఊరుకోమని హెచ్చరిస్తున్నాయి. మార్చిలో నిర్వహించబోయే శాసనసభ బడ్జెట్ సమవేశాల్లో దీన్ని ఆమోదింపజేసిన ...13లో




## యాదగిరిగుట్టలో స్వర్ణ విమాన గోపురం

### ఆవిష్కరించిన సీఎం, ప్రత్యేక పూజలు.. దేశంలోనే ఎత్తయిన గోపురంగా రికార్డు

నవతెలంగాణ-యాదగిరిగుట్ట, నల్లగొండ ప్రాంతీయప్రతినిధి

రాష్ట్రంలోని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ప్రధాన ఆలయంలో స్వర్ణ విమాన గోపురాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం 11.54 గంటలకు ప్రారంభించారు. మూలా నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన శ్రీసుదర్శన లక్ష్మీనరసింహ స్వామి వారికి గోపురాన్ని అంకితం చేశారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతులు రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. సీఎం కుటుంబసమేతంగా మొదట యాగశాలలో, అనంతరం గర్భగుడిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా వారికి దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. కాగా, ఈ స్వర్ణ విమానగోపురం దేశంలోనే ఎత్తైనదిగా రికార్డు నెలకొంది. 50.5 అడుగుల ఎత్తు, 10,759 చదరపు అడుగుల వైశాల్యంతో నిర్మించిన ఈ గోపురానికి 68 కిలోల బంగారాన్ని ఉపయోగించారు. ఈ గోపురానికి రూ.3.90 కోట్లు ఖర్చు చేశారు. భక్తులు, దాతలు సమర్పించిన విరాళాలను వినియోగించి ఈ గోపురాన్ని తీర్చిదిద్దినట్టు సమాచారం. ఆగమశాస్త్ర ప్రకారం జరిగిన ఈ స్వర్ణతాపడం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మఠాధిపతులు, యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కరరావుతో సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



**రోడ్డు మార్గంలో ముఖ్యమంత్రి**

సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం గుండా ప్రత్యేక వాహనంలో యాదగిరిగుట్టకు చేరుకున్నారు. ముందుగా ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో...13లో

## మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలి

### శాసనమండలిలో ఉపాధ్యాయుల వాణి వినిపిస్తా

వారి హక్కుల కోసం పోరాడుతా : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

ఈ నెల 27న జరిగే వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు తనకు మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించారని.. అప్పటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయులు, అధ్యాపకుల గొంతుకగా సమస్యలన్నింటిపై శాసనమండలిలో, బయట స్పందిస్తున్నానని తెలిపారు. ఆ క్రమంలోనే రాష్ట్రంలో మొదటి పీఆర్సీ ఆలస్యమవుతున్న సందర్భంలో 2020 మార్చి 5న ఇందిరాపార్కు వద్ద నిరాహారదీక్ష చేసినట్టు గుర్తు చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 30శాతం ఫిట్‌మెంట్ సాధనలో తన కృషి ఉన్నదన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికి పీఆర్సీ ప్రకారం 30శాతం వేతనాలు పెంచడానికి ప్రత్యేకంగా కషి చేశానని తెలిపారు.ప్రమోషన్స్, టెట్ సమస్య ప్రధాన అడ్డంకిగా ఉన్న స్థితిలో ఢిల్లీకి వెళ్లి ఎన్‌సీటీఈ చైర్మెన్, సెక్రెటరీతో మాట్లాడి ...13లో

### కారులో తీసుకొచ్చి మత్తు ఇచ్చి...

ఇద్దరు మహిళలపై సామూహిక లైంగికదాడి

ఒక మహిళ మత్తులో పడిపోగా, మరొకరు పారిపోతూ కేకలు వేయడంతో వెలుగులోకి

పోలీసుల అదుపులో నలుగురు దుండగులు

వివరాలు 13లో



### బర్డ్‌ఫ్లూ అంటే భయం..!
### ఉచితమైతే ఓకే..!!

చికెన్, గుడ్లు, బిర్యానీ, ఫ్రై ఉచిత పంపిణీ కేంద్రాల వద్ద బారులు

బేరాలు లేక వెలవెలబోతున్న చికెన్ షాపులు 13లో



### కేంద్ర మంత్రులతో రైతుల చర్చలు విఫలం

మార్చి 19న తదుపరి చర్చలు 5లో..

హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో కొనసాగుతున్న రైతుల ఆందోళన

## ట్రంప్ ఫైర్

అమెరికా సాయాన్ని అవకాశంగా భారత్‌పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు




13లో

# అప్పుల కుప్పలు!

### కేంద్ర రాష్ట్రాలది అదే దారి

- పాతవి తీర్చడానికి కొత్త రుణాలు
- సామాజిక, ఆర్థిక సేవలకు నిధుల కొరత
- ప్రభుత్వ సంస్థలను అడ్డం పెట్టుకొని మరిన్ని అప్పులు


**అప్పులు పెరిగితే ఎదురయ్యే సమస్యలపై రిజర్వ్‌బ్యాంక్ తరచుగా హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. ద్రవ్య లోటును, రుణ భారాన్ని తగ్గించుకోవాల్సిన అవసరాన్ని కేంద్ర బడ్జెట్ కూడా నొక్కి చెప్పింది. కానీ ఆర్థిక స్థిరత్వం లేని రాష్ట్రాలు అత్యవసర హామీలు నెరవేర్చడానికి లేదా అభివృద్ధి చర్యలు చేపట్టడానికి అప్పులు చేసుకుంటూ పోతున్నాయి. ఈ విషయంలో ఆయా రాష్ట్రాలను ఆదుకోవడంలో లేదా వాటికి మార్గనిర్దేశం చేయడంలో కేంద్రం విఫలమవుతోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వమే అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. కానీ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతోంది. రుణ పరిస్థితిని కేంద్రం గోప్యంగా ఉంచడం వల్ల దేశ సామాజిక, ఆర్థిక ప్రాధాన్యతల అమలుపై ప్రభావం పడుతోంది. అధిక వడ్డీ చెల్లింపుల కారణంగా కీలక పథకాలకు సంక్షేమ వ్యయ కేటాయింపులు, ఆర్థిక వృద్ధి, సామాజిక-సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. ప్రభుత్వ ఆదాయంలో సుమారు 42 శాతం వడ్డీ చెల్లింపులకే పోతోంది. ఉద్యోగ భద్రత, విద్య, ఆరోగ్య పరిరక్షణ కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకాలకు ఇక నిధులెలా వస్తాయి?**




న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ అప్పులు ప్రస్తుతం జీడీపీలో 83 శాతంగా ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అంచనా ప్రకారం 2027-28 వరకూ అవి అదే స్థాయిలో ఉండవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం తరతమ స్థాయిలో తీవ్రమైన అప్పుల భారాల్లో ఉన్నాయి. అయితే ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతోంది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న రాష్ట్రాలు రుణాలు తీసుకోకుండా ఎలా అభివృద్ధి చెందుతాయి? కొన్ని రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా తలకు మించిన అప్పులు చేస్తూ మరింత ఊబిలోకి కూరుకుపోతుంటే మరికొన్ని రాష్ట్రాలు మెరుగైన ద్రవ్య వివేచనతో వృద్ధిని సాధిస్తున్నాయని ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనం తెలిపింది. మోడీ ప్రభుత్వ పాలనలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు అంత సజావుగా లేవు. బీజేపీ యేతర పార్టీల ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలు కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు పొందలేకపోతున్నాయి. అందుకే పంజాబ్, రాజస్థాన్, కేరళ వంటి రాష్ట్రాలు అధిక రుణ భారంతో ఇబ్బందులు పడుతున్నాయి. దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్ అప్పులు జీఎస్డీపీలో 27.6 శాతం. ఆ రాష్ట్రం తగినంత ఆదాయాన్ని పొందలేక కేంద్రం నుండి నిధుల బదిలీపై ఆధారపడుతోంది. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు నడుస్తున్న రాష్ట్రాలకు, బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలకు నిధుల కేటాయింపు విషయంలో తీవ్రమైన వివక్ష కొనసాగుతోంది. ఈ రాజకీయ పక్షపాత ధోరణి కారణంగా పంజాబ్ బాగా ఇబ్బంది పడుతోంది.

**పీఎస్‌యూల ద్వారా రుణ సేకరణ**

గోప్యంగా చేస్తున్న అప్పులు, ద్రవ్య నిర్వహణలో నిర్లక్ష్యం వంటి కీలక అంశాలు బడ్జెట్‌పై చట్టసభల చర్చలో కన్పించడం లేదు. కేవలం కాగితాలపై కన్పించే ద్రవ్య లోటు, రుణాలపై మాత్రమే సభ్యులు చర్చిస్తున్నారు. పోనీ ఈ రహస్య అప్పులు సమస్యల్ని పరిష్కరించి ద్రవ్య సుస్థిరతకు బాటలు వేస్తున్నాయా అంటే అదీ లేదు. కేంద్రం నుంచి తగిన సహాయ సహకారాలు లభించకపోవడంతో రాష్ట్రాలు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు తీసుకోవడానికి సిద్ధపడుతున్నాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాలు ఆర్థిక వనరుల సమీకరణ కోసం ప్రభుత్వ విద్యుత్ సంస్థలు, నీటి పారుదల ఏజెన్సీలు, రవాణా కార్పొరేషన్ల ద్వారా రుణాలు ...13లో



## 'భద్రాద్రి'లో స్థానికులకే నాన్ టెక్నికల్ ఉద్యోగాలు

- ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ద్వారా నియామకం
- పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయండి : బీటీపీఎస్ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో నాన్ టెక్నికల్ ఉద్యోగాల్లో స్థానికులనే నియమిస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ద్వారా ఈ నియామకాలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సిఫార్సులతోనే ఉత్పత్తి జరుగుతుందని వివరించారు. బీటీపీఎస్ పెండింగ్ పనుల్ని త్వరగా పూర్తిచేయాలని జెన్‌కో అధికారుల్ని ఆదేశించారు. దానికోసం నిర్దిష్ట గడువులతో వర్క్ క్యాలెండర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. థర్మల్ కేంద్రం నుంచి వచ్చే బూడిదతో ఇటుకలు తయారు చేయడానికి యువతకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పించాలని ఆదేశించారు. ఆదివారంనాడిక్కడి ప్రజాభవన్‌లో బీటీపీఎస్ పనుల పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బీహెచ్‌ఈఎల్ కంపెనీ అగ్రిమెంట్ ప్రకారం చేయాల్సిన ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్ పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. యూనిట్-1లో కాలిపోయిన జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో బొగ్గు నిల్వ చేయడానికి కావలసిన షెడ్డు నిర్మాణ పనులు, సింగరేణి మైనింగ్ నుంచి భద్రాద్రి పవర్ ప్లాంట్ వరకు బొగ్గు రవాణా చేయడానికి ఏర్పాటు చేస్తున్న రైల్వేలైన్ పనులు, సిబ్బంది వసతి గృహ నిర్మాణ పనులపై ఆరా తీసారు. అన్ని పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈ ప్లాంట్‌లో ఏ చిన్న సంఘటన జరిగినా చీఫ్ ఇంజనీర్ పూర్తి బాధ్యత వహించాలని చెప్పారు. సమావేశంలో ఇంధనశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, చీఫ్ ఇంజనీర్ పీవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్టీలను వేధించకండి-టీఎస్‌యూటీఎఫ్

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్ల (సీఆర్టీ)నుంచి బలవంతంగా హామీ పత్రాలను రాయించుకోవడాన్ని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. వచ్చే నెలలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించకుంటే ఉద్యోగాల నుంచి తొలగించేందుకు అంగీకరిస్తూ సీఆర్టీలతో ఒప్పంద హామీ పత్రాలు రాయించుకుంటున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఏ వెంకట్ ఆదివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. టెన్త్ కామన్ పరీక్షలు జరిగే ముందు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్టీలను మానసికంగా వేధిస్తే ఫలితాలు హెచ్చరించారు. గిరిజన సంక్షేమ శాఖలో 22 ఏండ్లుగా నామ మాత్రపు వేతనాలతో పనిచేస్తున్న సీఆర్టిలకు కనీస వేతనాలు ఇవ్వడం లేదనీ, సర్వీసులు రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు సరైంది కాదనీ, ఈకారణంతో సీఆర్టిలను టెర్మినేట్ చేయాలని అధికారులు కుట్ర చేస్తే తమ సంఘం చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు.

## నేడు సీఎం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- ఒకేరోజు మూడు జిల్లాల్లో పర్యటన

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సోమవారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రచార సభల్లో ఆయన పాల్గొంటారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పట్టభద్రులు, కార్యకర్తలతో ఈ సభలు ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నిజామాబాద్ చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు మంచిర్యాల, సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి పోటీచేస్తున్న విషయం తెలిసిందే.

# పుస్తకాలు జీవితంలో ఎంతో కీలకం



బాలచెలిమి ఎడిటర్ మణికొండ వేదకుమార్

### ఎస్‌వీకేలో పిల్లల లైబ్రరీ ప్రారంభం

**నవతెలంగాణ-ముషీరాబాద్**

పుస్తకాలు జీవితంలో ఎంతో కీలకమని బాలచెలిమి ఎడిటర్ మణికొండ వేదకుమార్ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లల లైబ్రరీని ఆదివారం ఆయన ప్రారంభించారు. తెలంగాణ బాలోత్సవం నాయకులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఎన్నో లైబ్రరీలు చూశాను కానీ ఈ పిల్లల లైబ్రరీ చూడగానే గొప్ప ఆనందం కలిగిందన్నారు. బాలోత్సవం ఆధ్వర్యంలో లైబ్రరీని ప్రారంభించడం గొప్ప విశేషమన్నారు. ప్రతి విద్యార్థీ అకడమిక్ సబ్జెక్టులతో పాటు అదనంగా చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రయివేట్ స్కూల్స్‌లో స్వాతంత్ర్య విద్యా విధానం ఉన్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నపిల్లలకు సరైన వసతులు, పోషకాహారం, మంచి విద్య అందించాల్సిన బాధ్యత అందరిదని తెలిపారు. ఈ లైబ్రరీకి ప్రధాన స్తంభాలు పిల్లలే అని, వారి తల్లిదండ్రుల్ని అభినందిస్తూ, బాలోత్సవం ద్వారా గ్రామాల స్థాయికి కూడా లైబ్రరీలు తీసుకెళ్లే శక్తి ఉందని చెప్పారు. ఈ లైబ్రరీ సెలవు రోజుల్లో కూడా నిర్వహిస్తారు కనుక బాలోత్సవానికి ఒక బస్సుని పూర్తిగా అందజేస్తామని తెలిపారు. డాక్టర్ నళిని మాట్లాడుతూ.. నేటి తల్లిదండ్రులు పిల్లలపై తగిన శ్రద్ధ వహించట్లేదని, తల్లిదండ్రులే పిల్లలకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ప్రతి రోజూ పిల్లలతో సమయాన్ని గడిపి, వారికి మంచి పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. చిన్నారుల కోసం మరిన్ని పుస్తకాలు బహూకరిస్తానని చెప్పారు. ఎస్‌వీకే కార్యదర్శి ఎస్. వినయకుమార్ మాట్లాడుతూ.. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లైబ్రరీ ప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. సుందరయ్య దగ్గర 65,000 పుస్తకాలు ఉన్నాయని, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో 4 లక్షల పుస్తకాలు ఈ లైబ్రరీలో అందుబాటులో ఉండేవని తెలిపారు. 2000లో వచ్చిన వరదల కారణంగా, ఈ లైబ్రరీని గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి మార్చినట్టు చెప్పారు. చదువుతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు, క్యారమ్స్, గేమ్స్ కూడా ఇందులో భాగం చేయాలన్నారు. పిల్లలకు నాటకాలు రాయడం, ప్రదర్శించడం అలవాటు చేయాలని సూచించారు. ఎల్‌ఐసీ జనరల్ సెక్రటరీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతోపాటు, మంచి పౌరులుగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్‌లో బాలోత్సవం కోసం, పిల్లల కోసం ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మూడేండ్లుగా పిల్లల లైబ్రరీ ఏర్పాటు చేయాలని కలలు కన్నామని, అది ఈ రోజు నెరవేరడం ఆనందదాయకమని అన్నారు. పాలమూరు పిల్లలు ఒక లఘునాటికలో "దేశాలకు హద్దులుంటాయి, ప్రపంచ ప్రజల మధ్య అసమానతలు ఉన్నాయి. కానీ, ఇంటర్నెట్‌కు హద్దులేవి? సెల్‌ఫోన్‌కి హద్దులేవి?" అనే ప్రశ్నను సమర్పించారు. ఇకపై సెల్‌ఫోన్‌కు 'బై బై', పుస్తకాలకు 'హాయ్ హాయ్' అంటూ, పేద పిల్లల కోసమే చదువు ఒక ఆయుధమని బాలోత్సవ నినాదాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి ఎస్. సోమయ్య, కోశాధికారి జి. బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులు కె. సుజావతి, మెడికల్ పీఆర్‌ఓ శ్రీలత, రచయిత రాము, ప్రొఫెసర్ విజయలక్ష్మి, బాలోత్సవ కమిటీ మెంబర్ అంకమ్మ, నవీన్, బ్రహ్మణి, జాహ్నవి, సుచరిత, భవాని, సాత్విక తదితరులు పాల్గొన్నారు.



## నీరా కేఫ్ ఎత్తేసే కుట్ర

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపణ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లోగల నీరా కేఫ్‌ను ఎత్తేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన కేఫ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేఫ్ రూపురేఖలు మార్చారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న కులవృత్తులను పునరుద్ధరణ చేసేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. నీరాను అందుబాటులోకి తెచ్చి గౌడన్నలకు ఆసరాగా నిలబడిందన్నారు. కల్లు, నీరాలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని చెప్పారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.20 కోట్లతో దేశంలో ఎక్కడా లేనివిధంగా నీరా విధానాన్ని తీసుకొచ్చామని గుర్తు చేశారు. నీరాను గౌడ కులస్తులే అమ్మాలని నిర్ణయించామనీ, వైన్ షాపుల్లో కూడా రిజర్వేషన్లు ఇచ్చామని తెలిపారు. ఆయా కేంద్రాలను ఇప్పుడు ప్రయివేట్ పరం చేస్తున్నారనీ, శంకర్ రెడ్డి అనే వ్యక్తికి ఇచ్చినట్టు తెలుస్తుందన్నారు. గౌడన్నల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న కేఫ్‌ను ప్రయివేట్ పరం చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేదంటే అసెంబ్లీ, సచివాలయంతో పాటు హైదరాబాద్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.







# గురుకుల పనివేళల మార్పుకు సీఎం అంగీకారం

### పీఆర్‌టీయూటీఎస్ వెల్లడి

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో గత ఏడాది మాదిరే ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యేలా టైంటేబుల్ మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈ విషయంపై ముఖ్యమంత్రి నివాసంలో తమ సంఘం నేతలు సీఎంను కలిసి, విద్యార్థుల సమస్యల్ని వివరించామన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత హెల్త్‌కార్డులు అందించాలనీ, మోడల్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనం అందించాలని కోరగా, ఆ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపచేయాలని కోరగా, బడ్జెట్ సమీక్షించి, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేస్తామన్నారని చెప్పారు. విద్యారంగ సమస్యల పట్ల సీఎం సానుకూలంగా స్పందిస్తున్నారనీ, అందువల్ల కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కే నరేందర్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. సీఎంతో భేటీలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర సంఘం మాజీ బాధ్యులు వెంకట్‌రెడ్డి, గుండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**SECTION XII-A**
**IN THE SUPREME COURT OF INDIA**
**CIVIL APPELLATE JURISDICTION**
**SPECIAL LEAVE PETITION (CIVIL) No. 11527 OF 2020**
**WITH PRAYER FOR INTERIM RELIEF**
**WITH 89103/2020- APPLICATION FOR PERMISSION TO FILE LENGTHY LIST OF DATES**

M/S. JAI HANUMAN ESTATES AND OTHERS ... Petitioner(s)

VERSUS

GOVT. OF ANDHRA PRADESH (ERSTWHILE) TELANGANA AND OTHERS ... Respondent(s)

To,

1. Mohd. Ameer Ali Khan S/o Late Ameer Ali Khan
2. Mohd. Hyder Ali Khan S/o Late Ameer Ali Khan
3. Mohd. Mustafa Ali Khan S/o Late Ameer Ali Khan
4. Mohd. Farooq Ali Khan S/o Late Ameer Ali Khan
5. Aziz A Khatoon D/o Late Ameer Ali Khan
6. Zahara Khatoon D/o Late Ameer Ali Khan
7. Smt. Rahmath Khatoon W/o Late Ameer Ali Khan
8. Surayya Sahara Khatoon D/o Late Ameer Ali Khan
9. Dr. Sultana Jeevan Khatoon D/o Late Ameer Ali Khan
10. Smt. Habeeba Khatoon D/o Ameer Ali Khan
11. Rabiya Khatoon W/o Late Ameer Ali Khan

All Respondents 1 to 11 are R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowki, Hyderabad.

12. Najmuddin Islam Khan S/o Nizamuddin Islam Khan
13. Habeeb Islam Khan S/o Late Qutubuddin Islam Khan, Landlord,
14. Ifftekar Islam Khan S/o Khaleeluddin Islam Khan, Landlord All Respondents 12 to 14 are R/o H.No. 14-2-327, Goshmahal, Hyderabad.
15. Shakeel Islam Khan S/o Late Iqbal Islam Khan, 7-2-581 And 582, Burgushetty Bazar, Badi Masjid, Ashok Nagar, Secunderabad.

WHEREAS the Petition for Special Leave (Civil) to Appeal above mentioned alongwith connected matters and an application for substituted service filed in the Registry by **Mr. VENKITA SUBRAMONIAM T.R,** Advocate on behalf of the Petitioner(s) above named was listed for hearing before the **Ld. Registrar's Court** on **08th August, 2023,** When the following order was passed:-

**" All the matters. Applications for substituted service through publication in respect of all the respondents are allowed. Proof of publication be filed within four weeks of such publication. List again on 18.9.2023."**

NOW, THEREFORE, TAKE NOTICE that the above petition will be posted for hearing before Ld. Registrar's Court on **18th September, 2023** at 10.30 O' Clock in the forenoon or so soon thereafter as may be convenient to the Court when you may appear before the Court either in person or through Counsel and show cause to the Court as to why Special Leave Petition and interim relief as prayed be not granted and the resultant appeal be not allowed.

Take Further Notice that the prayer for interim relief after notice will also be listed before the Court in due course.

You may file your affidavit in opposition to the petition as provided under Rule 14(1) of Order XXI, S.C.R.2013 within 30 days from the date of receipt of notice or not later than 2 weeks before the date appointed for hearing, whichever be earlier, but shall do so only by setting out the grounds in opposition to the questions of law or grounds set

out in the SLPs and may produce such pleadings and documents filed before the Court/Tribunal against whose order the SLP is filed and shall also set out the grounds for not granting interim order or for vacating interim order if already granted.

TAKE FURTHER NOTICE that if you fail to enter appearance as aforesaid, no further notice shall be given to you even after the grant of special eave for special leave for hearing of the resultant appeal and the matter above mentioned shall be disposed of in your of in your absence.

Date : 13th August, 2023

**ASSISTANT REGISTRAR**

**SECTION XII-A**
**IN THE SUPREME COURT OF INDIA**
**CIVIL APPELLATE JURISDICTION**
**SPECIAL LEAVE PETITION (CIVIL) No. 11528 OF 2020**
**WITH PRAYER FOR INTERIM RELIEF**
**WITH 89515/2020- APPLICATION FOR PERMISSION TO FILE LENGTHY LIST OF DATES**

M/S. JAI HANUMAN ESTATES AND OTHERS ...Petitioner(s)

VERSUS

GOVT. OF ANDHRA PRADESH (ERSTWHILE) TELANGANA AND OTHERS ... Respondent(s)

To,

1. Mohd. Ameer Ali Khan S/o Late Ameer Ali Khan
2. Mohd. Hyder Ali Khan S/o Late Ameer Ali Khan
3. Mohd. Mustafa Ali Khan S/o Late Ameer Ali Khan
4. Mohd. Farooq Ali Khan S/o Late Ameer Ali Khan
5. Aziz A Khatoon D/o Late Ameer Ali Khan
6. Zahara Khatoon D/o Late Ameer Ali Khan
7. Smt. Rahmath Khatoon W/o Late Ameer Ali Khan
8. Surayya Sahaba Khatoon D/o Late Ameer Ali Khan
9. Dr. Sultana Jeevan Khatoon D/o Late Ameer Ali Khan
10. Smt. Habeeba Khatoon D/o Ameer Ali Khan
11. Rabiya Khatoon W/0 Late Ameer Ali Khan

All Respondents 1 to 11 are R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowki, Hyderabad.

12. Najmuddin Islam Khan S/o Nizamuddin Islam Khan Landlord
13. Habeeb Islam Khan S/o Late Qutubuddin Islam Khan, Landlord
14. Ifftekar Islam Khan S/o Khaleeluddin Islam Khan, Landlord Respondent No 12 to 14 are R/o H.No. 14-2-327, Goshamahal, Hyderabad.
15. Shakeel Islam Khan S/o Late Iqbal Islam Khan, 7-2-581 And 582, Burgushetty Bazar, Badi Masjid, Ashok Nagar, Secunderabad.

WHEREAS the Petition for Special Leave (Civil) to Appeal above mentioned alongwith connected matters and an application for substituted service filed in the Registry by **Mr. VENKITA SUBRAMONIAM T.R,** Advocate on behalf of the Petitioner(s) above named was listed for hearing before the **Ld. Registrar's Court** on **08th August, 2023**, When the following order was passed:-

**'All the matters. Applications for substituted service through publication in respect of all the respondents are allowed. Proof of publication be filed within four weeks of such publication. List again on 18.9.2023.'**

NOW, THEREFORE, TAKE NOTICE that the above petition will be posted for hearing before Ld. Registrar's Court on **18th September, 2023** at 10.30 O' Clock in the forenoon or so soon thereafter as may be convenient to the Court when you may appear before the Court either in person or through Counsel and show cause to the Court as to why Special Leave Petition and interim relief as prayed be not granted and the resultant appeal b e not allowed.

TAKE FURTHER NOTICE that the prayer for interim relief after notice will also be listed before the court in due courses.

You may file your affidavit in opposition to the petition as provided under Rule 14(1) of Order XXI, S.C.R.2013 within 30 days from the date of receipt of notice or not later than 2 weeks before the date appointed for hearing, whichever be earlier, but shall do so only by setting out the grounds in opposition to the questions of law or grounds set

out in the SLPs and may produce such pleadings and documents filed before the Court/Tribunal against whose order the SLP is filed and shall also set out the grounds for not granting interim order or for vacating interim order if already granted.

TAKE FURTHER NOTICE that if you fail to enter appearance as aforesaid, no further notice shall be given to you even after the grant of special leave for hearing of the resultant appeal and the matter above mentioned shall be disposed of in your absence.

Dated :13th August, 2023

**ASSISTANT REGISTRAR**

## రేపటి నుంచి హైదరాబాద్‌లో "బయో ఏషియా 2025" సదస్సు

### కొత్త ఆలోచనలు.. ఆవిష్కరణలకు వేదిక

### హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ఫోకస్

### 50 దేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధుల హాజరు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మంగళవారం నుంచి జరగనున్న బయో ఏషియా సదస్సుకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ వేదిక కానుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆసియాలోనే అతిపెద్ద గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ సదస్సుగా గుర్తింపు పొందిన ఈ సమావేశానికి ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాల నుంచి 3వేల మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్‌లో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సంబంధిత నిపుణులు, ఆవిష్కర్తలు ఈ రంగంలో వస్తున్న అధునాతన మార్పులు, శాస్త్ర పురోగతిపై చర్చిస్తారు. 'క్యాటలిస్ట్ ఆఫ్ ఛేంజ్.. ఎక్స్‌పాండింగ్ గ్లోబల్ హెల్త్ కేర్ ఫ్రాంటియర్స్' అనే థీమ్‌తో దీన్ని ఏర్పాటు చేశారు. ఆయా రంగాల్లో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ఔత్సాహిక సంస్థలు, నిపుణులను ప్రోత్సహిస్తుంది. వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో జరుగనున్న ఈ సదస్సు హెల్త్ కేర్ రంగంలో మరో మైలురాయిగా నిలువనుంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, క్వీన్స్ ల్యాండ్ గవర్నర్ డాక్టర్ జీనెట్ యంగ్, జీ20 షెర్పా అమితాబ్ కాంత్, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బయో ఏషియా ప్రారంభోత్సవ వేదికపై ప్రసంగిస్తారు.

#### ఇన్నోవేషన్ జోన్ ఏర్పాటు

కొత్త ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలతో రూపొందించిన దాదాపు 700 స్టార్టప్‌లు దీనికి దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో ఎంపిక చేసిన 80 స్టార్టప్‌లను ఈ సదస్సులో ఏర్పాటు చేసిన 'ఇన్నోవేషన్ జోన్'లో ప్రదర్శిస్తారు. హెల్త్ కేర్ రంగంలో మెడికల్ టెక్నా లజీ, బయో టెక్నాలజీ, డిజి టల్ హెల్త్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే లక్ష్యానికి అనుగుణంగా వీటిని ఎంపిక చేశారు. కొత్త స్టార్ట ప్లకు ప్రపంచ స్థాయి గుర్తిం పుతో పాటు, అదుతమైన అవకాశాలను ఈ సదస్సు అందించనుంది.

**SECTION XII-A**
**IN THE SUPREME COURT OF INDIA**
**CIVIL APPELLATE JURISDICTION**
**SPECIAL LEAVE PETITION (CIVIL) No. 11526 OF 2020**
**WITH PRAYER FOR INTERIM RELIEF**
**WITH 91657/2020- APPLICATION FOR PERMISSION TO FILE LENGTHY LIST OF DATES**

M/S. JAI HANUMAN ESTATES AND OTHERS ... Petitioner(s)

VERSUS

GOVT. OF ANDHRA PRADESH (ERSTWHILE) TELANGANA AND OTHERS ... Respondent(s)

To,

1. Mohd. Ameer Ali Khan S/o Ameer Ali Khan
2. Mohd. Hyder Ali Khan S/o Late Ameer Ali Khan
3. Mohd. Mustafa Ali Khan S/o Late Ameer Ali Khan
4. Mohd. Farooq Ali Khan S/o Late Ameer Ali Khan
5. Aziz A Khatoon D/o Late Ameer Ali Khan
6. Zahara Khatoon D/o Late Ameer Ali Khan
7. Surayya Sahaba Khatoon
8. Dr. Sultana Jeevan Khatoon D/o Ameer Ali Khan
9. Smt. Rahmath Khatoon D/o Ameer Ali Khan
10. Smt. Habeeba Khatoon D/o Late Ameer Ali Khan
11. Rabiya Kfiatoon W/o Late Ameer Ali Khan

R/o All Respondents 1 to 11 are R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowki, District- Hyderabad, Telangana

12. Najmuddin Islam Khan S/o Nizamuddin Islam Khan
13. Habeeb Islam Khan S/o Late Qutubuddin Islam Khan
14. Ifftekar Islam Khan S/o Khaleeluddin Islam Khan, Respondents 11 to 13 are R/o H. No. 14-2-327, Goshamahal, District- Hyderabad, Telangana
15. Shakeel Islam Khan S/o Late Iqbal Islam Khan, R/o 7-2-581 And 582, Burgushethy Bazar, Badi Masjid, Ashoknagar, District- Secunderabad, Telangana

WHEREAS the Petition for Special Leave (Civil) to Appeal above mentioned alongwith connected matters and an application for substituted service filed in the Registry by Mr. VENKITA SUBRAMONIAM T.R, Advocate on behalf of the Petitioner(s) above named was listed for hearing before the Ld. Registrar's Court on 08th August, 2023, When the following order was passed:-

**'All the matters. Applications for substituted service through publication in respect of all the respondents are allowed. Proof of publication be filed within four weeks of such publication. List again on 18.9.2023.'**

NOW, THEREFORE, TAKE NOTICE that the above petition will be posted for hearing before Ld. Registrar's Court on 18th September, 2023 at 10.30 O' Clock in the forenoon or so soon thereafter as may be convenient to the Court when you may appear before the Court either in person or through Counsel and show cause to the Court as to why Special Leave Petition and interim relief as prayed be not granted and the resultant appeal be not allowed.

Take Further Notice that the prayer for interim relief after notice will also be listed before the Court in due course. You may file your affidavit in opposition to the petition as provided under Rule 14(1) of Order XXI, S.C.R.2013 within 30 days from the date of receipt of notice or not later than 2 weeks before the date appointed for hearing, whichever be earlier, but shall do so only by setting out the grounds in opposition to the questions of law or grounds set out in the SLPs and may produce such pleadings and documents filed before the Court/Tribunal against whose order the SLP is filed and shall also set out the grounds for not granting interim order or for vacating interim order if already granted.

TAKE FURTHER NOTICE that if you fail to enter appearance as aforesaid, no further notice shall be given to you even after the grant of special leave for hearing of the resultant appeal and the matter above mentioned shall be disposed of in your absence

Daled :13th August, 2023

**ASSISTANT REGISTRAR**

## ఎనిమిది మంది ఐపీఎస్‌ల బదిలీ

### ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**




రాష్ట్రంలో ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ పి. విశ్వప్రసాద్‌ను నగర క్రైమ్స్ విభాగం అదనపు కమిషనర్‌గా బదిలీ చేశారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్‌ను నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా నియమించి.. డీజీపీ కార్యాలయంలో కోఆర్డినేషన్ డీఐజీగా ఉన్న డాక్టర్ గజారావు భూపాల్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఎస్పీలు డాక్టర్ బి. నవీన్ కుమార్‌ను సీఐడీలో ఎస్పీగా, సిరిశెట్టి సంకీర్త్‌ను గవర్నర్ ఏడీసీగా, బి.రాంరెడ్డిని సీఐడీ ఎస్పీగా, సీహెచ్ శ్రీధర్‌ను ఇంటెలిజెన్స్ ఎస్పీగా, ఎస్. చైతన్య కుమార్‌ను హైదరాబాద్ నగర స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### మార్చి 8న పరేడ్ గ్రౌండ్‌లో భారీ సభ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఈ నెల 8న అంతర్జాతీయం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భిన్న రంగాలకు చెందిన మహిళలతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో భారీ మహిళా సభ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు సంబంధించి అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. సరస్ మేళాలు, మహిళా స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు. మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మంత్రి సీతక్క నేతృత్వంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు అనితా రామచంద్రన్, శైలజా రామయ్యార్, దివ్యా దేవరాజన్ ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది.

**SECTION XII-A**
**IN THE SUPREME COURT OF INDIA**
**CIVIL APPELLATE JURISDICTION**
**SPECIAL LEAVE PETITION (CIVIL) No. 11976 OF 2020**
**WITH PRAYER FOR INTERIM RELIEF**
**WITH 93116/2020- APPLICATION FOR PERMISSION TO FILE LENGTHY LIST OF DATES**

M/S. JAI HANUMAN ESTATES AND OTHERS ...Petitioner(s)

VERSUS

GOVT. OF ANDHRA PRADESH (ERSTWHILE) TELANGANA AND OTHERS ... Respondent(s)

To,

1. Mohd. Ameer Ali Khan S/o Late Ameer Ali Khan
2 Mohd. Hyder Ali Khan S/o Late Ameer Ali Khan
3 Mohd. Mustafa Ali Khan S/o Late Ameer Ali Khan
4 Mohd. Farooq Ali Khan S/o Late Ameer Ali Khan

Respondent No. 1 to 4 are R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowki, District- Hyderabad, Telangana

12. Mohd. Naseer Ahmed S/o Late Tajuddin, Pre. No. 12-2-7901M/39, In Plot No 39
13. Dr. Amena Akhtari D/o Late Ahmed Khan, Pre. No. 12-2-7901M/48, In Plot No 48
14. Sri Ali Mohammed S/o Ali Mirza Qudrathullah Baig, Pre. No. 12-2-7901M/20, In Plot No 20
15. Sri Mirza Raza Mohammed S/o Late Mirza Qudratulla Baig, Pre. No. 12-2-7901M/20, In Plot No 20
16. Mrs. Fathima Rukhsari W/O Abdul Muqee, Pre. No. 12-2-7901m/70, In Plot No 70,
22. Kum Aasia Nayeem Khan D/O M.A. Nayeem Khan, Pre. No. 12-2-790/M/34/A, In Plot No 34 Part
23. Md. Ahmed Farooqui S/O Ayoob Farooqui, Pre. No. 12-2-790/M/59-5
24. Smt. Siraj Fathima D/O Yakoob Farooqui, Pre. No. 12-2-790/M/59-6
25. Afshan Farooqui W/O Yousuf Farooqui, Pre. No. 12-2-790/M/115
31. Md. Abdul Majid Ansari S/o Md. Abdullah Ansari, Pre. No. 12-2-790/M/114
32. Mohd. Osman Khan Khurum S/o Ibrahim Khan, Pre. No. 12-2-790/M/67, In Plot No 39,
33. Md. Ismail Khan Parwez S/o Ibrahim Khan, Pre. No. 12-2-790/M/68
34. Md. Omar Khan Shariyar S/o Ibrahim Khan, Pre. No. 12-2-790/M/66
40. Shamshad Sultana W/o Talat Yar Khan, Pre. No. 12-2-790/M156/1
41. Mr. Iqbal Ahmed S/0 Faqueer Mohammed, Pre. No. 12-2-790/M/138
42. Smt. Zakera Sultana W/o Syed Kazim Hussain, Pre. No. 12-2-790/M/55

Respondents No.12 to 16, 22 to 25,31 to 34,40 to 42 are R/o in Sy.No. 294/1, 297/1, 297/2/1, 297/3/1, Etc, T.S. No. 17, Ward No 21, Block N, Situated In Mustafa Hills, Gudimalkapur Vg., Asifnagar Mandal, District- Hyderabad, Telangana

43. Sub Registar Officer, Sub Registar Officer Golconda Mehdipatnam Ring Road, District- Hyderabad, Telangana
44. Najmuddin Islam Khan S/o Nizamuddin Islam Khan, R/o H. No. 14-2-327, Goshamahal, District- Hyderabad, Telangana

WHEREAS the Petition for Special Leave (Civil) to Appeal above mentioned alongwith connected matters and an application for substituted service filed in the Registry by **Mr. VENKITA SUBRAMONIAM T.R**, Advocate on behalf of the Petitioner(s) above named was listed for hearing before the **Ld. Registrar's Court** on **08th August, 2023,** When the following order was passed:-

**" All the matters. Applications for substituted service through publication in respect of all the respondents are allowed. Proof of publication be filed within four weeks of such publication. List again on 18.9.2023."**

NOW, THEREFORE, TAKE NOTICE that the above petition will be posted for hearing before Ld. Registrar's Court on **18th September, 2023** at 10.30 O' Clock in the forenoon or so soon thereafter as may be convenient to the Court when you may appear before the Court either in person or through Counsel and show cause to the Court as to why Special Leave Petition and interim relief as prayed be not granted and the resultant appeal be not allowed.

Take Further Notice that the prayer for interim relief after notice will also be listed before the Court in due course.

You may file your affidavit in opposition to the petition as provided under Rule 14(1) of Order XXI, S.C.R.2013 within 30 days from the date of receipt of notice or not later than 2 weeks before the date appointed for hearing, whichever be earlier, but shall do so only by setting out the grounds in opposition to the questions of law or grounds set

out in the SLPs and may produce such pleadings and documents filed before the Court/Tribunal against whose order the SLP is filed and shall also set out the grounds for not granting interim order or for vacating interim order if already granted.

TAKE FURTHER NOTICE that if you fail to enter appearance as aforesaid, no further notice shall be given to you even after the grant of special eave for special leave for hearing of the resultant appeal and the matter above mentioned shall be disposed of in your of in your absence.

Date : 13th August, 2023

**ASSISTANT REGISTRAR**

**SECTION XII-A**
**IN THE SUPREME COURT OF INDIA**
**CIVIL APPELLATE JURISDICTION**
**SPECIAL LEAVE PETITION (CIVIL) No. 11529 OF 2020**
**WITH PRAYER FOR INTERIM RELIEF**
**WITH 91676/2020- APPLICATION FOR PERMISSION TO FILE LENGTHY LIST OF DATES**

M/S. JAI HANUMAN ESTATES AND OTHERS ...Petitioner(s)

VERSUS

GOVT. OF ANDHRA PRADESH (ERSTWHILE) TELANGANA AND OTHERS ... Respondent(s)

To

1. Mohd. Ameer Ali Khan S/o Late Ameer Ali Khan, R/o 9-4-4D11, Nfc Colony, Tolichowki, Hyderabad.
2. Mohd. Hyder Ali Khan S/o Late Ameer Ali Khan, R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowki, Hyderabad.
3. Mohd. Mustafa Ali Khan S/o Late Ameer Ali Khan, R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowiu, Hyderabad.
4. Mohd. Farooq Ali Khan S/o Late Ameer Ali Khan, R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowki, Hyderabad.
5. Aziz A Khatoon D/o Late Ameer Ali Khan, R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowki, Hyderabad.
6. Zahara Khatoon D/o Late Ameer Ali Khan, R/o 9-4-4D/1, Nfc Colony, Tolichowki, Hyderabad.
7. Surayya Sahaba Khatoon,
8. Dr. Sultana Jeevan Khatoon D/o Ameer Ali Khan,
9. Smt. Rahmath Khatoon D/o Ameer Ali Khan,
10. Smt. Habeeba Khatoon Late Ameer Ali Khan,
11. Rabiya Khatoon W/o Late Ameer Ali Khan, All Respondents No. 1 to 11 are R/o 9-4-4d11, Nfc Colony, Tolichowki, Hyderabad.
12. Mohd. Naseer Ahmed S/o Late Tajuddin, Pre. No. 12-2-790/M139, In Plot No 39
13. Dr. Amena Akhtari D/o Late Ahmed Khan, Pre. No. 12-2-790/M/48, In Plot No 48,
14. Sri Ali Mohammed S/o Ali Mirza Qudrathullah Baig, Pre. No. 12- 2-790/M120, In Plot No 20
15. Sri Mirza Raza Mohammed S/o Late Mirza Qudratulla Baig, Pre. No. 12-2-790/M/20, In Plot No 20,.
16. Mrs. Fathima Rukhsari W/o Abdul Mugee, Pre. No. 12-2-790/M/70, In Plot No 70,
17. Mujahid Syed S/o S.A. Gani, Pre. No. 12-2-790/M/44, In Plot No 44
18. Sri Javeed Syed S/o S.A. Ghani, Pre. No. 12-2-790/M/43, In Plot No 43,
19. Smt. Zarina Begum D/o S.A. Ghani, Pre. No. 12-2-790/M/41, In Plot No 41,
20. Miss Rubia Farheen Khan D/o M.A. Nayeem Khan, Pre. No. 12-2-790/M/34/P, In Plot No 34 Part,
21. Miss Uzma Nasreen Khan D/o M.A. Nayeem Khan, Pre. No. 12-2-7901m/34/A, In Plot No 34 Part,
22. Kum Aasia Nayeem Khan D/o M.A. Nayeem Khan, Pre. No. 12-2-790/M/34/A, In Plot No 34 Part,
23. Md. Ahmed Farooqui S/o Ayoob Farooqui, Pre. No. 12-2-790/M/59-5,
24. Smt. Siraj Fathima D/o Yakoob Farooqui, Pre. No. 12-2-790/M/59-6,
25. Afshan Farooqui W/o Yousuf Farooqui, Pre. No. 12-2-790/M/115,
26. Laiq Fathima W/o Nazar Ahmed, Pre. No. 12-2-790/M/59,
27. Sr. Mohd. Hameed Farooqui S/o Yakub Farooqui, Pre. No. 12-2-790/M/59/2
28. Sri Mohd. Shafi Farooqui S/o Yakoob Qureshi, Pre. No. 12-2-7901m159/3,
29. Md. Abdul Gani Ansari S/o Abdullah Ansari, Pre. No. 12-2-790/M/114
30. Md. Abdul Quddus Ansari S/0 Abdullah Ansari, Pre. No. 12-2-790/M/114,
31. Md. Abdul Majid Ansari S/o Abdullah Ansari, Pre. No. 12-2-790/M/114,
32. Mohd. Osman Khan Khurrum S/o Ibrahim Khan, Pre. No. 12-2-790/M/67
33. Mohd. Ismail Khan Parwez S/o Ibrahim Khan, Pre. No. 12-2-790/M/68,
34. Md. Omar Khan Shariyar S/o Ibrahim Khan, Pre. No. 12-2-790/M/66,
35. Sri Syed Habib Ali S/o Khaja Mushtaq Ali, Pre. No. 12-2-790/M159/A,
36. Sri Syed Aftab Ali S/o Syed Khaja Mushtaq Ali, Pre. No. 12-2-790/M/59/B,
37. Sri Syed Abdul Kareem S/o Syed Abdul Jabbar, Pre. No. 12-2-790/M/17,
38. Sri Tahseen Abdul Talib S/o M.A. Basith, Pre. No. 12-2-790/M191,
39. Sri Yousuf Ali Khan S/o Late Sardar Ali Khan, Pre. No. 12-2-790/M/10,
40. Shamshad Sultana W/o Talat Yar Khan, Pre. No. 12-2-790/M/56/1,
41. Mr. Iqbal Ahmed S/o Faqueer Mohammed, Pre. No. 12-2-790/M/138,
42. Smt. Zakera Sultana W/o Syed Kazim Hussain, Pre. No. 12-2-790/M/55,

All Respondents No. 12 to 42 are R/o of Sy No. 294/1, 297/1, 297/2/1, 297/3/1, Etc, T.S. No. 17, Ward No 21, Block N, Situated In Mustafa Hills, Guddimalkapur Vg., Asifnagar Mandal, Hyderabad.

43. Najmuddin Islam Khan S/o Nizamuddin Islam Khan,
44. Habeeb Islam Khan S/o Qutubddin Islam Khan,
45. Ifftekar Islam Khan S/o Khaleeluddin Islam Khan, All Respondent No. 43 to 45 are R/o H. No. 14-2-327, Goshamahal, Hyderabad.
46. Shakeel Islam Khan S/o Late Iqbal Khan, R/o 7-2-581 And 582, Burgushetty Bazar, Badi Masjid, Ashoknagar, Hyderabad.

WHEREAS the Petition for Special Leave (Civil) to Appeal above mentioned alongwith connected matters and an application for substituted service filed in the Registry by **Mr. VENKITA SUBRAMONIAM T.R,** Advocate on behalf of the Petitioner(s) above named was listed for hearing before the **Ld, Registrar's Court** on **08th August, 2023,** When the following order was passed:-

**'All the matters. Applications for substituted service through publication in respect of all the respondents are allowed. Proof of publication be filed within four weeks of such publication. List again on 18.9.2023.'**

NOW, THEREFORE, TAKE NOTICE that the above petition will be posted for hearing before Ld. Registrar's Court on **18th September, 2023** at 10.30 O' Clock in theforenoon or so soon thereafter as may be convenient to the Court when you may appear before the Court either in person or through Counsel and show cause to the Court as to why Special Leave Petition and interim relief as prayed be not granted and the resultant appeal be not allowed.

Take Further Notice that the prayer for interim relief after notice will also be listed before the Court in due course.

You may file your affidavit in opposition to the petition as provided under Rule 14(1) of Order XXI, S.C.R.2013 within 30 days from the date of receipt of notice or not later than 2 weeks before the date appointed for hearing, whichever be earlier, but shall do so only by setting out the grounds in opposition to the questions of law or grounds set out in the SLPs and may produce such pleadings and documents filed before the Court/Tribunal against whose order the SLP is filed and shall also set out the grounds for not granting interim order or for vacating interim order if already granted.

TAKE FURTHER NOTICE that if you fail to enter appearance as aforesaid, no further notice shall be given to you even after the grant of special leave for hearing of the resultant appeal and the matter above mentioned shall be disposer in your absence.

Dated :13th August, 2023

**ASSISTANT REGISTRAR**

# ఏఐ సవాల్

- కార్మికుల హక్కులను రక్షించాలి
- ఇందుకు కొత్త లేబర్ పాలసీలు అవసరం
- పెట్టుబడిదారీ వ్యవస్థపై నియంత్రణ ఉండాలి



ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) గురించి ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తున్నది. అనేక దేశాలలో దీనిపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ విషయంలో కొత్త మార్పులను తీసుకొస్తున్నాయి. సమాజానికి ఏఐ ఎంత ఉపయోగపడుతుందో.. అంతే స్థాయిలో ప్రమాదమని కూడా చాలా మంది మేధావులు, నిపుణులు అంటున్నారు. యంత్రాలు భౌతిక శ్రమను ప్రభావితం చేసి కార్మికుల ఉపాధిని దెబ్బతీసిన విధంగానే.. మెషిన్ లెర్నింగ్ (యంత్ర అభ్యాసం) మనిషి మేధో శ్రమను ప్రభావితం చేస్తుంది. అంటే, ఈ ప్రభావం సానుకూలంగా, ప్రతికూలంగా.. రెండు విధాలుగా ఉంటుంది.

**ప్రభుత్వాలు అటువైపుగా నిర్ణయాలు తీసుకోవాలి : మేధావులు, నిపుణుల సూచనలు**

**న్యూఢిల్లీ :** యంత్రాల రాకతో కార్మికుల ఉపాధి కోల్పోయిన విధంగానే.. ఏఐ రాకతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. ఈ కారణంతో ప్రత్యక్ష, పరోక్ష కార్మికుల హక్కులను కాపాడటానికి కొత్త కార్మిక విధానాలు అవసరమని నొక్కి చెప్తున్నారు. ప్రభుత్వాలు అటువైపుగా ఆలోచించాలని సూచిస్తున్నారు.

### కార్మిక ఖర్చులను తగ్గించుకునే చర్యలు

పెట్టుబడిదారీ విధానం కార్మికులను దోపిడీ చేస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త కార్ల్‌మార్క్స్ వివరించారు. ఇది పెట్టుబడిదారీ విధానం వలసవాద దశకు సంబంధించినది అయినప్పటికీ.. దీనిని కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత పెట్టుబడిదారీ విధానం కొత్త యుగానికి కూడా అన్వయించుకోవచ్చని మేధావులు చెప్తున్నారు. చాట్‌జీపీటీ, ఎల్‌ఎల్‌ఎంలు (పెద్ద భాషా నమూనాలు)తో ఏఐలో వచ్చిన మార్పులు కారణంగా తక్కువ స్థాయి మేధో శ్రమ పనులతో కార్మిక ఖర్చులను తగ్గించే కొత్త ఉత్పత్తి వ్యవస్థలకు దారి తీశాయి. దానిని సాధ్యమైనంత సమర్థ వంతంగా ఉపయోగించుకోవటానికి అన్ని రంగాలలో తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏఐని విస్తృతంగా వినియోగించుకునే విషయంలో అమితమైన ఆసక్తిని కనబరుస్తున్న కంపెనీలు.. దాని కోసం పెద్ద మొత్తంలోనే వెచ్చిస్తున్నాయి.

### 'ప్రభుత్వ నిధులతో ఏఐ పరిశోధనలు ప్రారంభించాలి'

ప్రస్తుతానికి కృత్రిమ మేధలో మరిన్ని మార్పులు అవసరం. ఇలాంటి తరుణంలోనే మానవ మేధస్సు అవసరాన్ని మేధావులు నొక్కి చెప్తున్నారు. ఈ మార్పుల కోసం మరిన్ని ప్రయోగాలు, ప్రయత్నాలు చాలానే జరుగుతోన్నాయి. కార్మిక ఖర్చులను తగ్గించుకోవాలనే తమ స్వార్థపూరిత ప్రయోజనాల కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ విషయంలో చాలా వేగంగానే పని చేస్తోంది. ఇలాంటి తరుణంలో కార్మికుల హక్కులకు సంబంధించి ఐఐటీ బొంబాయికి చెందిన ప్రొఫెసర్ అనుపమ్ గుహ.. ఏఐని ప్రజా ప్రయోజనంగా గుర్తించాలని చెప్పారు. "స్వేచ్ఛా-మార్కెట్ ఫండమెంటలిజాన్ని సవాలు చేయాల్సిన అవసరం ఉన్నది. ఏఐ విధానంపై అంతర్జాతీయ సహకారాన్ని ప్రారంభించాలి. ప్రభుత్వ నిధులతో ఏఐ పరిశోధన, ఏఐ-వర్క్స్, ఏఐ కేంద్రీకృత విద్యను ప్రారంభించాలి" అని ఆయన సూచించారు.



### కొత్త కార్మిక ఒప్పందాలు అవసరం

ఏఐ వేగంగా వృద్ధి చెందుతున్న తరుణంలో కొత్త కార్మిక ఒప్పందాలు అవసరమని మేధావులు సూచిస్తున్నారు. ప్రభుత్వాలు విస్తృత చర్చలు జరిపి కార్మికుల హక్కులు కాపాడేలా విధానాలు రూపొందించాలని చెప్తున్నారు. కంపెనీలపై ఆంక్షల విధింపు పైనా సమాలోచనలు చేయాలని వారు అంటున్నారు. ఇప్పటికే ఉన్న జాతీయ కార్మిక సంస్థల కింద మేధో కార్మిక బ్యూరోను సృష్టించాలనే ప్రతిపాదనా ఉన్నది. ఈ బ్యూరో.. ఉల్లంఘనకు తగిన జరిమానాలు, కంపెనీలపై చర్యలు వంటివి తీసుకునే అవకాశం ఉంటుంది.

> ఏఐ విధానాలకు సంబంధించి ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే.. అన్ని ప్రధాన యంత్ర అభ్యాస నమూనాలలో, ముఖ్యంగా ఎల్‌ఎల్‌ఎంలలో ఒక నమూనా సరైనదా లేదా తప్పు అని సూచించే ఫీడ్‌బ్యాక్ లూప్ ఉంటుంది. ఇక్కడే మానవ శ్రమ అవసరం తప్పనిసరవుతుందని నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతానికి ఏఐ పూర్తిగా మానవుడిని రీప్లేస్ చేయలేదన్న విషయాన్ని వివరిస్తున్నారు. ఇలాంటి సమయంలో పెట్టుబడిదారీ వర్గం 'పని తగ్గింపు' పేరుతో కార్మికులను దోపిడీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, ప్రభుత్వాలు తమ బాధ్యతను గుర్తించి కార్మికుల హక్కుల రక్షణ కోసం హామీనివ్వాలని మేధావులు సూచిస్తున్నారు.

ప్రత్యక్ష కార్మికులు చేసే వాస్తవ పనిని కూడా ఇది అంచనా వేస్తుంది. ఉదాహరణకు.. అనువాద పనులకు సంబంధించి కంపెనీలు అనువాదకులను ఏఐలు చేసిన తప్పులను సరిదిద్దే "స్పెల్-చెకర్స్"గా తగ్గించాయి. ఫలితంగా కార్మికుడికి వేతన రేటు చాలా తగ్గింది. అయితే, చాలా సందర్భాలలో ఏఐ ఇచ్చిన వాక్యాలను పూర్తిగా తిరిగి రాయటానికి అనువాదకుడు సమయం వెచ్చించాల్సి వస్తున్నది. కాబట్టి.. ఇది కార్మికుడు తాను గతంలో చేసిన పనికి సమానంగానే ఉంటున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. ఇలాంటి సందర్భాలలో బ్యూరో అవసరాన్ని వారు నొక్కి చెప్తున్నారు.

### 'ప్రభుత్వ నిర్ణయాలే కీలకం'

ఏఐ రాకతో ప్రజలు దాని మీద ఎక్కువగా ఆధారపడతారు. ఫలితంగా.. వారు తమ సహజ మేధోశక్తిని కోల్పోయే అవకాశం ఉంటుంది. కాబట్టి.. ప్రజలకు నైపుణ్యాలను మరింత లోతుగా అందించి వారిని శక్తివంతులు చేయాలని మేధావులు సూచిస్తున్నారు. మొత్తానికి సాంకేతికంగా ఎన్ని మార్పులు వచ్చినా.. ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయాలే ప్రజలు, కార్మికుల హక్కులను కాపాడగలుగుతాయని చెప్తున్నారు.

---



## మనువాదమే ఈ దేశానికి పట్టిన దరిద్రం

- బీజేపీ విధానాలను తిప్పి కొట్టండి

**వివక్ష ఇంకెన్నాళ్లు.. దళితులంతా ఐక్యం కావాలి : కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ**

**నవ తెలంగాణ-ఖమ్మంరూరల్**


మనువాదమే ఈ దేశానికి పట్టిన దరిద్రమని, వివక్షతో ఇంకెన్నాళ్లు బతుకుతామని, దళితులంతా ఐక్యం కావాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని రాంలీలా ఫంక్షన్ హాల్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) పాలేరు డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ముందుగా మండలంలోని నాయుడుపేట చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి జాన్ వెస్లీ పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. నాయుడుపేట చౌరస్తా నుంచి రాంలీలా ఫంక్షన్ హాల్ వరకు భారీ జన సందోహంతో ర్యాలీ కొనసాగింది. అనంతరం కేవీపీఎస్ జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 'ఆత్మగౌరవం-సమానత్వం-కుల నిర్మూలన' లక్ష్యాలతో ఏర్పడిన సంఘం కేవీపీఎస్ అని అన్నారు. వేలాది గ్రామాల్లో దళితులు ఎదుర్కొం టున్న సమస్యలపై, అంటరాని తనంపై అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిన ఘనత కేవీపీఎస్‌కు ఉందని తెలిపారు. ఆలయ ప్రవేశాలు, రెండు గ్లాసుల విధానం, గ్రామాల్లో కులం, మతం పేరుతో జరిగిన ఘటనలపై కేవీపీఎస్ ఎప్పటికప్పుడు అధిపత్యాన్ని చీల్చి చెండాడుతూ దళితులకు అండగా ఉందన్నారు. 77 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ దళితవాడలు అత్యంత దుర్భరంగా ఉన్నాయని, ఎస్సీ జనాభా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్లో రూ.20వేల కోట్లు కేటాయించి, దళితవాడల అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. ఈ దేశంలో ఎస్సీలకు సెంట్ భూమి లేకుండా చేసింది మనువాదులేనన్నారు. దేశంలో చాతుర్వర్ణ వ్యవస్థను సృష్టించి దళితులను పంచములుగా చిత్రీకరించి ఊరు చివరన ఉంచి, దళితుల వెనుకబాటుతనానికి ప్రధాన కారణమయ్యారని తెలిపారు. దళితులంతా ఐక్యమై మనువాదులపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలన్నారు. ంఅనంతరం 25 మందితో కేవీపీఎస్ పాలేరు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు.

ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, రాష్ట్ర నాయకులు బండి రమేశ్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, వ్యకాస నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, నండ్ర ప్రసాద్, పొన్నెకంటి సంగయ్య, కేవీపీఎస్ నాయకులు నందిగామ కృష్ణ, అరేంపుల ఉప్పలయ్య, పగిడిపల్లి వెంకట్రావు, ఏపూరి వరకుమార్, వడ్లమూడి నాగేశ్వర రావు, బాలరాజు, బోట్ల సాగర్, చిరంజీవి, దాసరి మహేందర్, రాము, స్టాలిన్, భాస్కర్, గోపి, జానకి రాములు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

---

## విశాల ఐక్యతను నిర్మించాలి

**వామపక్షాలను బలహీనపరిచేందుకే విదేశీ నిధులు : సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభలో ఎండీ సలీం**




**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

రాష్ట్రంలోని వామపక్షాలను బలహీనపరిచేందుకు విదేశీ నిధులు వస్తున్నాయని సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ సలీం విమర్శించారు. సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర 27వ మహాసభ రెండో రోజు కార్యక్రమాలు ఆదివారం హుగ్లీలోని దంకునిలో కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య నగర్, కామ్రేడ్ సీతారాం ఏచూరి వేదికపై కొనసాగాయి. ఈ మహాసభలో రాష్ట్ర వ్యాప్తంగా 521 మంది ప్రతినిధులు, పరిశీలకులు పాల్గొన్నారు. ఆ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం రాజకీయ సంస్థాగత నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో వామ పక్షాలను బలహీనపరచడానికి టీఎంసీ, సామ్రాజ్యవాదులు చేపట్టిన ప్రాజెక్టులో 'లాల్ హఠా ఉద్యమం' ఒక భాగమన్నారు. వామ పక్షాలను బలహీనపరచడానికి వారికి విదేశీ నిధులు సమకూరాయన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో వామపక్షాలను బలహీనపరిచేందుకు విదేశీ నిధులను సమీకరించడాన్ని కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ తీవ్రంగా వ్యతిరేకిస్తూనే ఉంటారని వెల్లడించారు.

పశ్చిమ బెంగాల్‌లోని పేద, అణగారిన వర్గాల ప్రజల దుస్థితిని ప్రస్తావిస్తూ.. వామ పక్షాలుగా తాము విద్యలో డ్రాపౌట్స్, నిరుద్యోగం, పంటలకు ధర లభించకపోవడం, వలస కార్మిక సమస్యలపై స్పందించడానికి మాత్రమే పరిమితం కామన్నారు. వామపక్ష ప్రత్యామ్నాయంతో ఉద్యమ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. అణగారిన ప్రజలతో, ముఖ్యంగా గ్రామీణ పేదలతో జీవన సంబంధాన్ని ఏర్పరుచుకుంటూ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష కార్యకర్తలు తప్పుడు కేసులు, దాడులు, జైళ్లు మొదలైన వాటిని ఎదుర్కొంటూనే పోరాడుతున్నారన్నారు. ఈ మహాసభ చర్చల అనంతరం రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పార్టీని సంస్థాగతంగా నిర్మించడానికి నాయకత్వంలో కొత్తతరం కార్యకర్తలను చేర్చుకుంటూ.. నిర్విరామ పోరాటానికి పార్టీని ఒక సాధనంగా ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

హిందూత్వం, నయా ఫాసిస్ట్ ధోరణులు కవలలని, ట్రంప్ నుంచి మోడీ వరకు ప్రపంచ వ్యాప్తంగా మితవాద శక్తులు పెరిగేందుకు తృణమూల్ కాంగ్రెస్ ఒక అనుబంధమని విమర్శించారు. ఈ శక్తులకు వ్యతిరేకంగా పోరాటంలో విశాల ఐక్యతను నిర్మించాలన్నారు. కొత్త ఫాసిస్ట్ ధోరణికి వ్యతిరేకంగా రాష్ట్రంలో గొప్ప ఐక్యతను నిర్మించడమే లక్ష్యమన్నారు. ఇది ఏ వ్యక్తిపైనా పోరాటం కాదని, విధానాలకు వ్యతిరేకంగా పోరాటమని స్పష్టం చేశారు. టీఎంసీ, బీజేపీ ఈ రెండు శక్తులకు వ్యతిరేకంగా పోరాటంలో పేద, శ్రామిక ప్రజలను సంఘటితం చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. అనంతరం రాజకీయ సంస్థాగత నివేదికపై ప్రతినిధుల చర్చలు కొనసాగాయి.

---



## యుద్ధానికి మూడేండ్లు

- 267 డ్రోన్లతో రష్యా అతిపెద్ద దాడి
- రెండు లక్షల మందికి పైగా సైనికులు మృతి

**మాస్కో :** ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు సోమవారానికి సరిగ్గా మూడేండ్లు. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌వ్యాప్తంగా పుతిన్ సేనలు మరోసారి విరుచుకుపడ్డాయి. ఏకంగా 267 డ్రోన్లు ప్రయోగించినట్టు కీవ్ ఆరోపించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఒకేసారి ఈస్థాయిలో డ్రోన్లతో దాడులకు పాల్పడటం ఇదే మొదటిసారని ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమాండ్ ప్రతినిధి యూరీ ఇగ్నాత్ తెలిపారు. అయితే, వాటిలో సగానికిపైగా కూల్చేసినట్టు చెప్పారు. ప్రాణనష్టం, తదితర వివరాలు తెలియాల్సి ఉందన్నారు.త

గత వారం వ్యవధిలో దాదాపు 1150 డ్రోన్లు, 1400కుపైగా గైడెడ్ ఏరియల్ బాంబులు, 35 క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా రక్షణశాఖ సైతం తమ దేశంలోకి కీవ్ సేనలు 20 డ్రోన్లను ప్రయోగించాయనీ, వాటిని నాశనం చేసినట్టు తెలిపింది.

ఈ యుద్ధంలో ఇప్పటివరకు రెండు దేశాలకు చెందిన 2 లక్షలకు పైగా సైనికులు మరణించారు. దాదాపు 8 లక్షల మంది సైనికులు గాయపడ్డారు. ఉక్రెయిన్‌లో 10 మిలియన్లకు పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. వీరిలో, ఈ యుద్ధ విషాదంతో పోరాడిన 20 లక్షల మంది పిల్లలు ఉన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో జరిగిన అతిపెద్ద విపత్తుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు, 'డిఫెండర్ ఆఫ్ ది ఫాదర్‌ల్యాండ్ డే' పురస్కరించుకుని రష్యా అధినేత పుతిన్.. సైనికుల త్యాగాలను స్మరించుకున్నారు. యుద్ధంలో పోరాడిన సిబ్బందికి పతకాలను ప్రదానం చేశారు.

### ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్

2022 ఫిబ్రవరి 24న 'ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్' పేరుతో రష్యా యుద్ధాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. రష్యాతో ఉక్రెయిన్ సత్సంబంధాలు పెట్టుకోకుండా.. నాటో విస్తరణను నిలువరించే ప్రయత్నం చేయటమే యుద్ధానికి ప్రధాన కారణమైందని క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. జెలెన్‌స్కీ తీసుకున్న నిర్ణయాలు వివాదస్పదంగా మారాయి. నాటో విస్తరణను నిలువరించే ప్రయత్నం, డాన్‌బాస్ విమోచనం, నాజీయిజం నిర్మూలన వంటివి తమ లక్ష్యాలుగా పుతిన్ ప్రకటించారు. మొదట్లో మాస్కో సేనలు దూకుడు కనబర్చినా.. అనంతరం పాశ్చాత్య దేశాల ఆయుధ సాయంతో జెలెన్‌స్కీ ఎదురుదాడికి దిగారు. అయితే రష్యా సేనల ముందు తలవంచకతప్పలేదు. ఈ మూడేండ్లలో ఇరువైపులా లక్షలాదిమంది సైనికులు మరణించారు, గాయపడ్డారు. కోట్ల డాలర్ల మేర ఆస్తినష్టం వాటిల్లింది. అయితే, ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ పునరాగమనంతో యుద్ధం ముగింపు దిశగా ప్రయత్నాలు మొదలైనట్టు వైట్‌హౌస్ లీకులు ఇస్తోంది.

### పోప్ శాంతిసందేశం..

తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోప్ ఫ్రాన్సిస్.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి మూడేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో శాంతి సందేశాన్ని విడుదల చేశారు. ఈ యుద్ధం ప్రారంభాన్ని.. మానవాళికి బాధాకరమైన సందర్భంగా పేర్కొన్నారు. "యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయినవారిని మనం గుర్తుంచుకోవాలి. పాలస్తీనా, ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యం, మయన్మార్, సూడాన్ వంటి ప్రాంతాల్లో శాంతి కోసం ప్రార్థించండి" అని పోప్ పిలుపునిచ్చారు.

---

## ఏఐ రంగంలో మరింత ముందుకెళ్లాలి

- ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల భాగస్వామ్యం పెరిగింది : 'మన్‌కీ బాత్'లో మోడీ

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో ఈ సాంకేతికతను వినియోగించుకొని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని మోడీ కోరారు. ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధ వినియోగం గురించి ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక ఉపాధ్యా యుడి కృషిని ప్రత్యేకంగా అభినందించారు. అంతరిక్ష రంగంలో ఏటా పురోగతి సాధిస్తున్నామన్నారు.

ఇస్రో 100వ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేయడం దేశానికే గర్వకారణమని ప్రధాని కొనియాడారు. అంతరిక్షశాస్త్ర సరిహద్దు లను అధిగమించాలనే దేశ బలమైన సంకల్పానికి ఇది నిదర్శనమని తెలిపారు. గత పదేండ్లలో దాదాపు 460 ఉపగ్రహాలను ప్రయోగించినట్టు తెలిపిన ఆయన.. అంతరిక్ష రంగంలో ఏటా పురోగతి సాధిస్తున్నామన్నారు. చంద్రయాన్ విజయం దేశానికి ఎంతో గర్వకారణమని చెప్పారు. ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల భాగస్వామ్యం పెరగడమనేది ఇటీవల సాధించిన విజయాల్లో ఒకటన్నారు. "ఇటీవల ఏఐ సదస్సులో పాల్గొనేం దుకు పారిస్‌కు వెళ్లాను. కృత్రిమ మేధ రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రపంచం ప్రశంసించింది.

తాజాగా తెలంగాణలోని ఆదిలాబాద్‌లో గల ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు తొడసం కైలాశ్.. గిరిజన భాషలను పరిరక్షించడంలో మాకు సాయం చేశారు. ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో పాటను కంపోజ్ చేశారు" అని మోడీ అన్నారు. అంతరిక్షం లేదా ఏఐ అయినా భాగస్వామ్యం పెరుగుతోందని ప్రధాని తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి జీవితాల్లో స్ఫూర్తి నింపేందుకు ఒక రోజు తన సోషల్ మీడియా ఖాతాను వారికే అంకితం చేస్తామన్నారు.

---

'నవతెలంగాణ' రంగారెడ్డి రీజియన్ మేనేజర్

## మహేందర్‌రెడ్డికి మాతృవియోగం

- సంతాపం తెలిపిన నవతెలంగాణ బృందం

**నవతెలంగాణ- రంగారెడ్డిప్రాంతీయ ప్రతినిధి**


(ఫైల్)

నవతెలంగాణ రంగారెడ్డి రీజియన్ మేనేజర్ మహేందర్ రెడ్డి మాతృమూర్తి దూదిపాల లక్ష్మమ్మ(81) ఆదివారం మృతిచెందారు. ఆమె మృతదేహానికి నవతెలంగాణ బృందం నివాళి అర్పించి, బాధిత కుటుంబానికి సంతాపం తెలిపింది. లక్ష్మమ్మకు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం అస్వస్థతకు గురికావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. రెండేండ్ల కిందట లక్ష్మమ్మ భర్త అనారోగ్యంతో మృతి చెందారు. లక్ష్మమ్మ మృతి పట్ల నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ఎడిటర్ సుధాభాస్కర్, న్యూస్ ఎడిటర్ రమేష్, ఏడీవీటీ జీఎం వెంకటేశ్, మొఫిషిల్ ఇన్‌చార్జి వేణుమాధవ్, నవతెలంగాణ సిబ్బంది, తదితరులు సంతాపం తెలిపారు.

---

# సంపద సృష్టికర్తలు సామాన్యులే..

- బడ్జెట్‌లో వారివాటా వారికే దక్కాలి
- ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న మోడీ సర్కార్

- ప్రజల కొనుగోలు శక్తి పెంచని బడ్జెట్ ఎవరికోసం? : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య
- కేంద్రం ఇచ్చే రూ. 300 పింఛన్‌తో వికలాంగులు ఎట్లా బతకాలి? : ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

దేశంలో సంపద సృష్టి కర్తలు సామాన్యులేననీ, బడ్జెట్‌లో వారి వాటా వారికి దక్కాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. ఎన్‌పీఆర్‌డీ పదిహేనో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'కేంద్ర బడ్జెట్-వికలాంగులపై ప్రభావం' అనే అంశంపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఆ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ప్రజలంతా వివిధ రూపాల్లో కడుతున్న పన్నులను తిరిగి వారి ప్రయోజనాలకు ఖర్చు పెట్టకుండా మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీల పేరుతో కట్టబెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచని బడ్జెట్ గురించి ఆర్థిక మంత్రి నిర్మలాసీతారమన్ ఎన్ని మాటలు చెప్పినా ఉపయోగం లేదన్నారు. దేశంలో సరుకుల అమ్మకాలు తగ్గిపోయాయనీ, తగిన వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు పడిపోయాయనికేంద్ర ఆర్థిక సర్వే పేర్కొంటే మోడీ ఎందుకు స్పందిచడం లేదని ప్రశ్నించారు. పైగా నెలకు రూ.4,628 తో కుటుంబం బతకాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. బడ్జెట్‌లోని కేటాయింపులు ప్రజల ఆదాయాలు పెంచేదిగా ఉండాలని చెప్పారు. విద్యా, వైద్యం, ఉపాధి, గృహవసతి లాంటి కనీస సదుపాయాలకు కేటాయింపులు పెంచకపోతే ఎట్లా అని ప్రశ్నించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మోడీ ప్రభుత్వం పన్నుల భారాన్ని మోపుతున్నదని చెప్పారు. సంపద పోగు పడ్డ దగ్గర పన్ను వసూలు చేయాల్సిందేనన్నారు. ఆ పని చేసేందుకు మోడీకి ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో వ్యవసాయ కూలీలు, పేద రైతులు, కౌలు రైతుల ఊసే లేదన్నారు. పెరుగుతున్న ప్రజల అవసరాలను తీర్చే విధంగా బడ్జెట్ ఉండాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వలన తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ,వైద్యం ఖరీదుగా మారాయని తెలిపారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే మోడీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ శక్తుల ప్రయోజనల కోసం పని చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రైతుల రుణ మాఫీకి అంగీకరించని మోడీ ప్రభుత్వం, గత పదేళ్లలో బడా బాబులు, బ్యాంకులకు అప్పులు చెల్లించకుండా బకాయి పెట్టిన రూ.14.46 లక్షల కోట్లను ఎందుకు మాఫీ చేసిందని ప్రశ్నించారు. ఏడాది కాలంలో దేశంలో శత కోటీశ్వరుల సంఖ్య 109 నుంచి 200కు పెరిగిందని ఫోర్బ్స్ నివేదిక బట్టబయలు చేసిందనీ, కార్పొరేట్ సంస్థల లాభాలు 22.3 శాతం పెరిగాయని ఎకనమిక్ సర్వే రిపోర్టు తేల్చిందని గుర్తు చేశారు. ఈ విషయాలను మోడీ గుర్తించాలని సూచించారు. దేశ జనాభాలో ఒక్క శాతంగా ఉన్న ధనికుల చేతుల్లో 40.1 శాతం దేశ సంపద పోగైందని ప్రపంచ అసమానతల రిపోర్టు తేల్చిందని వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆర్థిక సర్వే పేర్కొన్నదన్నారు. ఆహార సరుకుల ద్రవ్యోల్బణం పెరిగిన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు పెంచాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో సవరణలు చేసి సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. అడివయ్య మాట్లాడుతూ 2012 నుంచి కేంద్రం పింఛన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం రూ.300 మాత్రమే తన వాటాగా చెల్లిస్తోందనీ, దీనితో వికలాంగులు ఎట్లా బతుకుతురని ప్రశ్నించారు. నిత్యావసర సరకుల ధరలు 300 రేట్లు పెంచిన మోడీకి వికలాంగుల పింఛన్‌ను పెంచాలనే ఆలోచన ఎందుకు రావడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, సాయమ్మ, జె రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లెపలి స్వామి, ఉపేందర్, యశోద, అరిఫా,లింగన్న సహాయ కార్యదర్శులు నాగలక్ష్మి, దశరథ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

---

సినిమాల్లో ఛాన్స్ ఇప్పిస్తానంటూ..

## థానేలో మహిళపై లైంగికదాడి

**థానే :** సినీ వ్యామోహంలో పడి ఎంతో మంది యువత మోస పోతున్నారు. తాజాగా మహారాష్ట్రలోని థానేలో సినీ పరిశ్రమలో మంచి ఆఫర్లు ఇప్పిస్తానని చెప్పి 34 ఏండ్ల మహిళపై ఒక వ్యక్తి పలు మార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

మహారాష్ట్రలోని థానే నగరంలోని మాజివాడ ప్రాంతంలో నివసిస్తున్న షెడ్యూల్డ్ కులానికి చెందిన బాధితురాలిని బెదిరించి బ్లాక్ మెయిల్ చేసినందుకు మరో మహిళ, ఆమె భర్త, వారి కుమార్తెను కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చినట్టు వారు వివరించారు. అయితే ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. బాధితురాలిని పెద్ద స్టార్‌గా చేస్తానని హామీ ఇచ్చి ఆమెను సింగపూర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను ఒక వ్యక్తికి పరిచయం చేసి, అతను సినీ ఇండస్ట్రీలో పేరున్న వ్యక్తిగా నమ్మబలికాడు. సింగపూర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి ఆమెకు మత్తు పానీయాలు ఇచ్చాడు. అక్కడ తనపై లైంగికదాడి చేశాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నది. ముంబయి, ఇతర ప్రదేశాలలోని హోటళ్లలోనూ పలుమార్లు తనపై అఘాయిత్యానికి పాల్పడినట్టు వివరించింది. తనపై దారుణం జరిగినపుడు వీడియోలు తీసి మరీ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడినట్టు పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా నలుగురు నిందితులపై లైంగికదాడి, క్రిమినల్ బెదిరింపులు, ఇతర అభియోగాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల కింద, అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని వారు చెప్పారు.

నవతెలంగాణ దర్వాజ 4
సోమవారం 24-2-2025 || హైదరాబాద్

## శ్రమజీవి పయనం



ప్రభాతభానుడి తొలికిరణం
నేలను స్పృశించేలోగానే
కొన్ని పక్కలు
అలవాటు కొద్దీ
ముడుచుకుపోతాయ్
కొన్ని చీపుర్లు
నిలువు కళ్ళేసుకుని
చెత్త జాడలను వెతుకుతాయ్
మనుషుల
కడుపులోకి చేరాల్సినవాటిని
తమ కడుపులో దాచుకుని
కొన్ని గిన్నెలు
కుతకుత ఉడుకుతుంటాయ్
కొన్ని భుజాలు
పనిముట్లకు ఆసరా అవుతాయి
ఉదరఘోషకు పరిష్కారాన్ని
కొన్ని చేతులు
స్టీలు డబ్బాలో కప్పిపెడతాయి
ప్రయాణ ఖర్చులతో
జేబు బరువుకు
సమతూకం కుదిరిందో లేదో
అంచనా వేసే మెదడు
దూరం-సమయం గ్రాఫును
గాలిలోనే గీసి పారేస్తుంది
గడప దాటే కాళ్ళ
చెప్పులను
ఆభరణాలుగా మార్చుకుంటాయ్
ఒక శ్రమజీవి పయనం
ప్రారంభమవుతుంది

**- డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839**

## అక్షరాలతోనే పని


ఎట్లాగూ నడుస్తూనే ఉన్నాం
అమూర్తంగా ఏదో ఓ దిక్కు ఎందుకు నడవాలి
చూపును సవరించి వెలుగులు పూచే
ఎడమ వైపుకే నడవాలె-
ఎట్లాగూ మాట్లాడుకుంటూనే ఉంటాం
అర్థ రహితంగా ఏదో ఒకటి ఎందుకు మాట్లాడుకోవాలి
మాటకు మహిమనద్దుతూ చీకటిని ఊడ్చే
సూర్య రశ్మి గురించే ముచ్చటించుకోవాలె-
ఎట్లాగూ వింటునే ఉంటాం
బధిర బంధురంగా ఏదో ఒకటి ఎందుకు వినాలి
చేతనను చెవిన పరికిస్తూ
త్యాగచరితుల స్ఫూర్తి పుటలనే చెవిన ధరించాలె-
ఎట్లాగూ పాడుతూనే ఉన్నాం
శ్రుతి శుభగమంటూ ఏదో మాయాగీతాన్ని ఎందుకు పాడాలి



కంఠానికి కోతపడినా సరే
ఆశయాలు ఉగ్గుపట్టే మట్టిపాటలే పాడాలె-
ఎట్లాగూ కలుసుకుంటూనే ఉంటాం
నిద్రాణంగా ఎవరినో ఒకరిని ఎందుకు కలవాలి
నాగలి భుజాన వేసుకుని
మహోపాధ్యాయుడు మార్క్స్ కలల్ని మోస్తున్న
రైతు దరికే చేరాలె -
ఎట్లాగూ యుద్ధమే చేస్తున్నాం
ఏకాకిగా తోడా తోడా ఎందుకు పోరాడాలి
క్రూర ఆధిపత్యాలపై రగల్ జెండాయెత్తి
సమిష్టిగా సంపూర్ణంగానే కొట్లాడాలె -
విలువలకు తిలోదకాలిస్తున్న
కార్పోరెట్ కాలమిది -
వివక్ష కాలనీల రూపం దాల్చి
విషం చిమ్ముతున్న ఆటోమేషన్ యుగమిది -
పెట్టుబడి 'Trust me, I am liying' అంటూ
ఉన్న ఆ కాస్తా చెలకమూలను దోచేస్తున్న సబర్బన్ ఋతువిది-
అంబేద్కర్ చెప్పినట్టు ఇప్పుడు ఆయుధాల కంటే
అక్షరాలతోనే మనకు ఎక్కువ పని.

**- డా.బెల్లి యాదయ్య, 98483 82690**

## నా వాక్యానికి మట్టిపూత పూసిన కవిత్వమిది






**ఒక్కో మలుపులో ఒక్కో పుస్తకం మనల్ని వెంటాడుతుంది. మనం రాసే వాక్యం నునుపుదేలిన వాక్యంగా మారడం వెనుక మనం చదివిన పుస్తకాల స్ఫూర్తి తప్పకుండా ఉంటుంది.**

మనం బతికిన బాల్యాన్ని, మనం జీవిస్తున్న జీవితాన్ని ఇలా కూడా రాయొచ్చా అని స్ఫూర్తినిచ్చిన పుస్తకాలలో కవి నాగిళ్ళ రమేశ్ రాసిన 'ఉద్దరాశి పూల చెట్టు' కవిత్వం ఒకటి. ఉద్దరాశి పూలు అంటే రుద్రాక్ష పూలు. చంద్రకాంత పూలని, గునుమల్లెలని కూడా అంటారు. వానాకాలంలో ఎక్కువగా పూస్తాయి. వరి నాట్లేయబోయె అమ్మ కష్టాన్ని తొలిసారి ఈ కవితలో చదువుకోవడం వలన ఈ కవిత్వం పట్ల మమకారం. అంతేగాదు దసరా పండుగకు ముందు దొరల, పటేలిండ్లకు బతుకమ్మ పువ్వు తెంపుకొనొచ్చె జీతగాళ్ళలను, గుత్ప అందుకోని బాయికాడికి పొమ్మనే తాతలను, దారి పొడవునా మొలచిన స్థూపాలను, గుల్ల పట్టుకొని అడివి దిక్కు పయనమయ్యే అమ్మలను చూపించింది ఉద్దరాశి పూలచెట్టు లోని కవిత్వం. అనేక గ్రామీణ దృశ్యాలతో, ఇదివరకు ఎవరూ పట్టించుకోని మాములు దృశ్యాలతో కవితను అల్లడం నన్ను బాగా కదిలించింది. కేవలం మాండలిక భాషకే ప్రాధాన్యత ఇస్తూ కవితాత్మను పట్టించుకోని కవులు ఉన్నరు. కానీ ఈ కవిత్వంలో తలపండు లాగానే 'ఎండుపండు' అని కవిత నడిపించిన కవితాత్మక వ్యక్తీకరణలు ఎంతో ఆలోచింపజేసేవి. వస్తువుతో మమేకమై రాసిన తీరులో కవి ముద్ర కనబడుతుంటది. పిల్లలతో బంజారా భాషలో అనువాదం కూడా చేయించిండు.

ఎన్ని సార్లు చదివినా, చదివిన ప్రతిసారీ జీవితాన్ని కొత్తగా చదువుతున్న అనుభూతి. ఇరవై ఒక్క కవితలతో ఉన్న చిన్న పుస్తకమే కానీ మాదిగవాడల జీవన సౌందర్యాన్ని, అల్లికల వారసత్వాన్ని, బతుకు పోరాటాన్ని కండ్లముందట చూపించింది. నా వాక్యానికి మట్టిపూత పూసిన కవిత్వమిది.

ముఖ్యంగా ఆ కవిత్వంలోని భాష నేను రాయవలసిన కవిత్వపు మూలాలను చూపించింది. గదువ దొరికిచ్చుకోవడం, పువ్వొన్నె కాడు, పిల్లలకు కీసర తగలడం లాంటి మాటలను మరిచిపోలేను.

ఆ పుస్తకాన్ని తలుచుకున్నపుడల్లా తోలు అట్ట మీద బొగ్గుతో కొలత తీసుకుని చెప్పులు కుట్టే జాంబవంతుడి కళానైపుణ్యం కండ్ల ముందట కదులుతుంటది.

**- తగుళ్ళ గోపాల్, 9505056316**




## సాహితీ వార్తలు

### మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార సభ

హైదరాబాద్ లోని ప్రభుత్వసిటీ కళాశాల ఆజామ్ హాల్లో ఈ నెల 24 ఉదయం 11 గంటలకు' సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారం' (2025) ప్రదానోత్సవ సభ జరుగుతుంది. డాక్టర్ నలిమెల భాస్కర్ పురస్కారాన్ని స్వీకరిస్తారు. ఆచార్య పి. బాలభాస్కర్ అధ్యక్షతన జరిగే సభలో ఆచార్య వెలుదండ నిత్యానందరావు, దేవులపల్లి అమర్, కవియాకూబ్, అన్నవరం దేవేందర్, డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డా. ఏలూరి యాదయ్య , డా.కోయి కోటేశ్వర రావు పాల్గొంటారు.

### శ్రీనివాస్‌గౌడ్‌కి మాడభూషి పురస్కారం

తెలంగాణ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డా॥మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారం పి.శ్రీనివాస్ గౌడ్‌కి (మర్జినోళ్ల కథల సంపుటికి) ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు రవీంద్రభారతి మినీ హాల్‌లో ప్రదానం చేస్తారు. ఈ సభలో సుధామ, డా॥ మామిడి హరికృష్ణ, డా॥నాళేశ్వరం శంకరం, మాడభూషి లలితాదేవి పాల్గొంటారు.

### పరమపథం గ్రంథావిష్కరణ

డా॥పులివర్తి కృష్ణమూర్తి రచించిన పరమపథం గ్రంథాన్ని ఫిబ్రవరి 25న హైదరాబాద్ డా॥కె.వి.రమణాచారి క్యాంపుకార్యాలయమునందు సాహితీకిరణం నిర్వహించే కార్యక్రమంలో డా॥కె.వి.రమణాచారి ఆవిష్కరిస్తారు. ఈ సభకు గుదిబండి వెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, ఎన్వీ.రఘువీర్ ప్రతాప్, పొత్తూరి జయలక్ష్మి, ఆర్.దమయంతి హాజరవుతారు.

**- పొత్తూరి సుబ్బారావు, సంపాదకులు**

### కథా సంపుటాలకు ఆహ్వానం

'వెన్నెల సాహితీ పురస్కారం-2024' కోసం 2023, 2024 సం.లలో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు (4) ప్రతులను 31 మార్చి 2025లోపు , యాదగిరి, ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్-2, మయూరి బార్ రెస్టారెంట్ ఎదురు వీధి, రంగధాంపల్లి చౌరస్తా దగ్గర సిద్దిపేట, 502103 చిరునామాకు పంపగలరు. సిద్దిపేటలో జరుగు సాహిత్య కార్యక్రమంలో నగదు పురస్కారం అందజేయబడును. వివరాలకు ఫోన్ నెం.9299909516, 9848261284.

**- పర్కపెల్లి యాదగిరి, వెన్నెల సాహితీ సంగమం**

### 'చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక సాహిత్య పురస్కార రచనలకు ఆహ్వానం'

శ్రీలేఖ సాహితి, వరంగల్లు వారు 'చెన్నమనేని రంగనాయకమ్మ గారి స్మారక సాహిత్య పురస్కారా'నికి విశిష్టాద్వైత సాహిత్యగ్రంథ పద్యకావ్యాలు, వ్యాససంపుటాల రచనలను ఆహ్వానిస్తున్నారు. అనువాదాలు పరిశీలించబడవు. 2020 - 2024 సంవత్సరాల్లో ప్రచురించబడిన రచనలను నాలుగు ప్రతులు 31 మార్చి 2025లోగా పంపాలి. పురస్కారం కింద రూ.5000/-, శాలువా, మెమెంటోతో సత్కరించబడుతుంది. చిరునామా: డాక్టర్ టి. శ్రీరంగస్వామి అధ్యక్షులు, శ్రీలేఖసాహితి ఇం.నం. 27-14-53, లిటిల్ సోల్జర్స్ స్కూల్ లేన్, మండల కార్యాలయం ఎదురుగ, హసన్ పర్తి 506371, హన్మకొండ వరంగల్ తెలంగాణ, ఫోన్ నం. 99498 57955.

**- డా. టి.శ్రీరంగస్వామి, శ్రీలేఖసాహితి వరంగల్**

### 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ

ఉత్తమ తెలుగు కథానికల కోసం 'భూపతి చంద్ర' స్మారక సంస్థ కథానికలను ఆహ్వానిస్తున్నది. సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించే ఇతివృత్తాలతో, సున్నితమైన వ్యంగ్య, హాస్యాలతో కూడిన కథానికలకు ప్రాధాన్యత. ప్రథమ బహుమతి రూ.5,000/-, ద్వితీయ బహుమతి రూ.3,000/-, తతీయ బహుమతి రూ.2,000/-, ప్రోత్సాహక బహుమతులు 5, ఒకొక్కరికి రూ. 1,000/-. కథానికలు మార్చి 10వ తేదీలోపు 'సమన్వయకర్త, భూపతి చంద్ర స్మారక కథానికల పోటి, ఆనంద నిలయం, ఇం.నం. 1-5-1020/4,.బి.ఆర్.రావు నగర్, ఓల్డ్ ఆల్వాల్, సికింద్రాబాద్-500010' చిరునామాకు పంపాలి. ఇతర వివరాలకు 9963616999.

**- ఎమ్.ఎల్.కాంతారావు**

## కవిత్వం - సౌందర్యం



**మానవ సమాజం ఉన్నతిని మరింత పెంచేది సౌందర్య కవిత్వమా లేక కవిత్వ సౌందర్యమా ఏది ముందో ఏది వెనుకో కవిత్వ ప్రేమికులు, కవులు, విమర్శకులు తేల్చుకోవాలి. ఆ విధపనే సాహిత్య సౌందర్య మూలాల అన్వేషణకు ఒక స్పష్టమైన తొవ్వ దారి దొరుకుతుంది. వర్తమాన కవిత్వం పోకడలను గమనంలోకి తీసుకుంటే అనేక అంశాలపై మరింత లోతైన చర్చ చేయవలసిన ఆవశ్యకత ఉందని అనిపిస్తున్నది.**

పువ్వు పూయడం ఒక సౌందర్యం. ఆ పూలను తెంపుకొని స్త్రీలు కొప్పులో ధరించడం మరో సౌందర్యం. ఆ పూల మొక్కను పెంచి పెద్ద చేసి పూలను తెంపిన కూలీల చెమట శ్రమ సమాజ నిర్మాణ సౌందర్యం. ఇక్కడ మనం అంటే కవి ఏ సౌందర్యాన్ని ఆశిస్తున్నామన్నది, ఆస్వాదిస్తమన్నది ప్రధానం.

దానికన్నా ముందు మనం తెలుసుకోవాల్సింది తేల్చుకోవాల్సింది మరొకటి ఉన్నది. అది సకల కళలు సమాజాన్ని ఉనిక చేసుకొని వికసిస్తాయా లేక సమాజం నుంచి మనిషిని విడదీసి కేవలం మనిషి ఉనికిని కేంద్రం చేసుకొని ఉత్పత్తి అవుతాయయా అనేది నేటి సాహిత్య కారుల ముందున్న ప్రశ్న. ఈ ప్రశ్నలను ఛేదించగలిగితే గానీ మిగతా విషయాలు అన్నీ దూద్ కా దూద్, పానీ కా పానీ, కుల్లం కుల్లా తెలుస్తుంది. ఈ చర్చ ఆది నుంచి ఉన్నప్పటికీ అంతిమంగా శ్రమ సౌందర్యమే పై చేయి సాదిస్తూ వస్తున్నది

సామాజిక శాస్త్రవేత్తలు యోచించాల్సిన అవసరం ఉన్నది. ఆధునికత, ఆధునికాంతరవాదం, ద్రవాధునికత ఇలా అనేక వాదాలు కళలను ఆసరా చేసుకుని అనేకానేక దోరణులు, వాదాలు, చర్చలు విశ్లేషణలు కొనసాగించాయి.

అయితే ఈ చర్చల విశ్లేషణ సారాంశమంతా ఉత్పత్తిలో జరిగిన మార్పు చేర్పుల యొక్క ఉపరితల అంశాలలో ఇమిడి ఉన్నాయి. అచ్చు యంత్రం సృష్టి ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణలకు అంకురార్పణ చేసింది. శాస్త్రజ్ఞులు మనిషి తద్వారా సమాజం సర్వతోముఖోన్నతి కోసం నూతన ఆవిష్కరణలను కనుగొన్నాడు.. అత్యాధునికత ఆలంబన మూలాలు కంప్యూటర్ కనుగొన్న తర్వాత ప్రారంభమైందని ఉజ్జాయింపుగా మన సామాజిక విశ్లేషకులు ఒక అంచనాకు వచ్చారు. మొత్తానికి మొత్తంగా చూస్తే పెట్టుబడి కేంద్రంగా మనిషి వలసలు నిరంతరంగా కొనసాగాయి. అలాగే వాటి వెంట కవిత్వమూ సకల సృజనాత్మక ప్రక్రియలు ప్రయాణించాయి. ఇవి కొన్నిసార్లు రాచరికానికి ఊడిగం చేస్తే మరికొన్నిసార్లు దేవాలయం చుట్టూ బాడుగకు వినిర్మితమైనవి. ఇలా ఆలోచిస్తే అక్షరాన్ని కొన్ని వర్గాలు తమ గుప్పిట్లో సంకెళ్లు వేసి కొన్ని వేల సంవత్సరాలు బంధించడం వలన ఇదంతా జరిగిందని అనిపిస్తున్నది. అక్షరాస్యులు, నిరక్షరాస్యుల మధ్య భేదాలు నిచ్చెన మెట్ల సమాజం ఆ వెంటే ఎక్కి వచ్చిన నిచ్చెనమెట్లను తన్నేసే తరం వచ్చింది. అంటే ఇక్కడే ఆధిపత్య కులాల ప్రాంతాల వారు ప్రయోజనాలు రక్షించుకునే విధంగా మిగితా ఉత్పత్తి కులాలకు మధ్య అంతరం అంటరానితనం ఏర్పచినారు. అంటే శ్రమ చేసేవారు కొందరైతే, కూర్చొని తినేవారు మరికొందరు ఈ సమాజాన్ని అవిచిన్నంగా ఏలారు. ఏది ఏమైనా పునాదిలో వచ్చిన ఉత్పత్తి సంబంధాల మార్పు ఉపరితలంలో కనబడుతున్న గందరగోళాలు అన్నిటికీ మనిషి లేక కవి కలత చెందే తక్షణ హృదయ స్పందన అయిన కవిత్వంలో ప్రతిబింబించాయి.



ఇది ఏందని ప్రశ్నించిన మనిషి, కవి అన్ని కాలాలలో రాజ్యానికి కంటగింపుగా కనిపిస్తాడు. మతాలు, హింస, యుద్ధాలు, యుక్తులు, కుట్రలు, కుతంత్రాలు ప్రజ్వరిల్లాయి. మానవజాతి వికాస చరిత్రంతా భూమి ఉన్నవాడిదే ఆధిపత్యంగా కొనసాగింది.

ఇదిగో ఇక్కడే శ్రమ, పెట్టుబడి, అదనపు విలువల మధ్య ఒక సంఘర్షణ వాతావరణం నెలకొన్నది. పెట్టుబడి లాభాపేక్షతో అనేక దేశాలకు విస్తరించింది. ఆ వెంటనే సృజనాత్మక ప్రక్రియలను విభజించే ఆధునికత, ఆధునికాంతరవాదం, ద్రవాధునికత వాదాలు అన్ని సామాజిక సందర్భాలను సామాజిక శాస్త్రజ్ఞులు విశ్లేషణాత్మకంగా అనేక నూతన విషయాలను సమాజం ముందు విపులంగా అరటిపండులా ఒలిచి పెట్టారు, వింగడించారు.

రాచరికము మతం భూస్వామ్యము సోషలిజం ప్రజాస్వామ్యం పరిపాలన విధానాలు శాస్త్రీయంగా రాజనీతి శాస్త్రము తెలియజేసింది అలాగే ప్రజలు బానిసలు భూస్వామ్య కాలంలో వెట్టి కౌలు రైతులు కూలీలు అంతరాలు లేని సమాజం సోషలిజం ప్రజాస్వామ్యంలో పెట్టుబడిదారీ విధానం ముసుగులో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. అలాగే ఈ అన్ని దశలలో ఆయా వ్యవస్థలలో కవిత్వం కొనసాగుతూ వచ్చింది. రాజు బానిసలు భూస్వామ్యంలో చేతులు కట్టుకొని నిలబడే జనం ప్రజాస్వామ్యంలో ప్రజలు మనుగడ సాగించారు. ఆయా కాలాలను అణచివేత వాళ్లకు వ్యతిరేకంగా సృజనాత్మక కళలు వర్ధిల్లాయి.

వారసత్వ రాజకీయాల లాగా వారసత్వ సాహిత్య కారులు కొనసాగారు. ఈ చట్రాన్ని బదాబదులు చేస్తూ మిగతా శ్రమ కులాల నుండి వారి వారి జీవిత సంఘర్షణలనం వాటిని పద్యంలో తెలుగు సాహిత్యంలో ముందు ఎప్పుడూ లేనంత తమ తమ జీవితం సాచివేత నుండి సుసంపన్నమైన సాహిత్యం పండిస్తున్నారు. సుమారు సాహిత్య చరిత్రలో తెలుగు సాహిత్యం యవనిక మీద అత్యద్భుతమైన దృశ్యం కనిపిస్తున్నది.


చివరగా చెప్పేదేమంటే అంతిమంగా మనిషి సంఘజీవి మాత్రమే కాదు రాజకీయ జీవి కూడా అని తత్వవేత్తలు నిర్ధారించారు. ఈ నిర్ధారణతో రాజకీయాలకతీతంగా సాహిత్యం కవిత్వం ఉండడానికి వీలు లేదని, కాదనే పసలేని వాదనలు తేలిపోయాయి. ఇక్కడే అనుభూతివాదుల హృదయ సంబంధమైన కవిత్వం పూర్వ పూర్వపక్షమైపోయింది. మొత్తంగా శ్రమ సౌందర్యం అంతిమంగా కవిత్వ సౌందర్యం పై చేయి సాధించింది.

కాబట్టి ప్రస్తుత వినియోగ సంస్కృతీ సేవల భావంపైన నిలకడలేని స్థలంలో మనిషి కేవలం వినియోగదారుడుగా తన జీవన విధానాన్ని కొనసాగిస్తున్నాడు. ప్రస్తుత తరుణంలో అంతిమంగా శ్రమ మాత్రమే కవిత్వ సౌందర్యంగా బాసిస్తున్నదని ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా కాలం గీటురాయి మీద అన్ని వాదాల కాలాలలో పరీక్షకు నిటారుగా నిలబడింది.

(నా "ఒక కప్పు చాయ్ నాలుగు మెస్సేజులు" కవితా సంకలనానికి ఈ 26న కొలకలూరి అవార్డు ప్రధానం స్పందర్భంగా...)

**- జూకంటి జగన్నాథం, 9441078095**

## ఒక అధ్యాపకురాలి అంతరంగం




అధ్యాపకురాలిగా, ఉద్యోగినిగా, గృహిణిగా ప్రగతి తాను - తన చుట్టూ ఉన్న మహిళలు ఎదుర్కొన్న కష్టాలు సవాళ్లను, వాటిని చక్కదిద్దే ప్రయత్నాలను- ఇలా కథలుగా రూపొందించారు.

స్కూల్ విద్యార్థినులకు శానిటరీ పాడ్ ల ఆవశ్యకత గురించి తెలియజేసిన టీచర్ ఒక కథలో కనిపిస్తుంది. బాల్యం నుండి స్త్రీలపై ఏదో రకంగా లైంగిక వేధింపులు తప్పవు. పరువు పోతుందని భయపడకుండా ఎప్పటికప్పుడు ఎదిరించడమే ముఖ్యమని ఇంకో కథలో తెలియజేస్తారు. స్త్రీకి బయట ఆఫీసులోపని, ఇంట్లో చాకిరి తప్పదు. ఇంట్లో వాళ్ళు సైతం ఆమె చాకిరిని గుర్తించరు . పైగా తమ కోరికలే ముఖ్యంగా భావించి ఇబ్బంది పెడుతుంటారని ఒక కథలో చూపిస్తారు. కొత్తగా రచనలు చేసే అమ్మాయిలను ప్రోత్సహిస్తున్నట్టుగా నటించి వారికి సన్మానాలు, అవార్డుల పేరిట లోబర్చుకోవడానికి చూసే గోముఖ వ్యాఘ్రాలను 'రైటింగ్ కోచింగ్' లో బయట పెడతారు. పరువు హత్యలతో జీవితాలు నాశనం చేసుకోవడమా? వాళ్ళ అభీష్టాన్ని మన్నించి అందరూ హాయిగా ఉండటమా తేల్చుకోమని చెప్పే కథ 'కొన్ని చీకట్లూ... ఓ వెలుతురూ...'. ఇంట్లో తండ్రి విధించే బురఖా నిబంధనలను వ్యతిరేకించిన హసీనా, బయట హిజాబ్ వ్యతిరేకతను కూడా అడ్డుకుంటుంది. మన బట్టల మీద వీళ్ళ పెత్తనమేమిటని 'ముస్కురాహట్' కథలో ప్రశ్నిస్తుంది

ఎన్ని చదువులు చదివినా, ఉద్యోగాలు చేసినా ఆమె జీవితం ఇంటికే పరిమితం కావాలా? తన జీవితాన్ని తాను చక్కదిద్దుకునే అవకాశాన్ని వారికి ఇవ్వకపోతే ఎలా అని 'దివిటి' కథలో నిలదీస్తారు. కుటుంబం బలం అనుకుంటారు. కానీ అది బలహీనతలా తయారవుతుంది. ఎక్కడికక్కడ స్త్రీ స్వతంత్రించకుండా మగాళ్ళు అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంటారు. ఆత్మ న్యూనత, అభద్రతా భావం నుండి తన మిత్రురాలిని ఎంత తెలివిగా సునీత బయటపడేసిందో చూడాలంటే 'విహంగ' కథ చదవాల్సిందే. పొలం ఎవరి పేరు మీద ఉంటే వాళ్ళు చచ్చిపోతేనే నష్టపరిహారం వస్తుంది. ఆ ఊర్లో ఆడాళ్లెవరి పేరు మీద పొలాలు లేవు గనుక రైతులు కాదంటారు. దాంతో రగిలిపోయిన హనుమక్క ఎమ్మార్వో ఆఫీసులో పట్టా పాసుబుక్కు తన పేరు మీద మార్చమంటుంది. ఎందుకని ప్రశ్నించిన కొడుకుతో "మేము సేద్యం పనులు చేస్తుండటం లేదా? చేన్లో పనిచేసే దానికి మేము కావాలి గాని పేరు ఎక్కడానికి, ఎక్కించడానికి పనికిరామా?" అని నిలదీస్తుంది. 'నేను రైతునే' అని నినదిస్తుంది.



**- కె.పి.అశోక్ కుమార్ 9700000948**

కాలేజీ మానేసి అడవుల వెంట తిరిగి పూలు, పత్రి కోసుకొని వచ్చి వినాయక చవితి పండుగకు అమ్ముకొని బీద విద్యార్థుల గురించి తపనపడే ఒక అధ్యాపకురాలు 'వెనకల చవితి'లో కనిపిస్తుంది. అలాగే డిగ్రీ చదివే అమ్మాయిలు సెలవులకు ఇంటికి పోలేదంటే ఏం అనర్థం జరిగిందో అని లెక్చరర్లు భయపడి పోతారు. తీరా చూస్తే, ఇంటికి పోతే చదువు మానిపిస్తారని ఒకరు, ఇష్టం లేని పెళ్లి చేస్తారని మరొకరు ఇంటికి వెళ్లలేదని చెబుతారు. ఈ విషయంలో అధ్యాపకుల నిస్సహాయత్వాన్ని మనల్ని ఆలోచింపజేస్తుంది. విద్యార్థినులు కాలేజీకి రాకపోవడం ఎందుకో సహృదయతతో ఆలోచించాలి. చిన్న వయసులో ఒక్కొక్కరు ఎన్నెన్ని బరువులు మోస్తున్నారో ఎవరికి తెలుసు. వాళ్ళ సంపాదన కుటుంబాలకు అవసరం కనుక చదువును పక్కన పెట్టేస్తున్నారు. రూల్స్ పేరిట అధ్యాపకులు వారిని పరీక్షలు రాయకుండా అడ్డుకుంటున్నారు. ఇలా పిల్లలు జీవితాలను కోల్పోతుంటే, అధ్యాపకులు వాళ్ళ ఉద్యోగ భద్రత కోసం తిప్పలు పడుతుంటారని 'తిరుపాలమ్మ' కథ తెలియజేస్తుంది.

ప్రేమలు, ఆప్యాయతలు అన్నీ డబ్బు సంబంధాల ముందు దిగదుడుపే అని 'మావి చిగురు' కథ, వసుధైక కుటుంబం అనే భావన నుండి కరోనా రాకతో ఎవరికీ మారుగా మిగిలిపోయారని 'ఉద్భవామి' కథ లో తెలియజేస్తారు. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రైల్వే స్టేషన్లో, రైళ్ల టాయిలెట్లలోకి పంపించే నీళ్లు పట్టుకొచ్చుకోవడానికి ఎంత ప్రమాదకరమైన ప్రయాణం చేస్తుంటారో 'నీళ్ల బండి' కథలో చూడవచ్చు. మంత్రాలు, క్షుద్ర పూజల పేరుతో ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఎంత హింస, ఎంత దోపిడీ జరుగుతుందో 'విలాపధామం' కథలో కనబడుతుంది.

ఈ కథలన్నీ మహిళా కేంద్రంగా రూపొందడం విశేషం. ముఖ్యంగా రచయిత్రి తన విద్యార్థినుల పట్ల కనపరిచే ప్రేమాదరణలు, వాళ్లకు సహాయంగా నిలిచి వాళ్ళ జీవితాలను చక్కదిద్దాలనుకునే ప్రయత్నాలు మనల్ని ఆకట్టుకుంటాయి. ఎన్రోల్మెంట్, డ్రాప్ అవుట్ల విషయంలో ప్రైవేటు విద్యాలయాలతో పోటీ పడలేరు. అలాగని ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించలేరు. రూల్స్ పేరు చెప్పి వాళ్ళ జీవితాలతో ఆడుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తారు. ఇక గృహిణిగా, ఉద్యోగిగా మహిళలు చేసే ద్విపాత్రాభినయం ఎంత విసుగ్గా, కష్టంగా ఉంటుందో చక్కగా తెలియజేశారు. మహిళా రైతుల గురించి కానీ, మైనార్టీ విద్యార్థినుల సమస్యలు కానీ, కొత్త రచయిత్రుల ట్రాపు గురించి రాసిన కథలు కొత్తగా, వైవిధ్య భరితంగా ఉన్నాయి. ఈ కథలన్నీ రచయిత్రి అనుభవంలోంచి రూపుదిద్దుకున్నాయని అనుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

## వీడిన రాజలింగమూర్తి మర్డర్ మిస్టరీ

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- 10మంది గుర్తింపు.. ఏడుగురు అరెస్ట్, పరారీలో ముగ్గురు
- ఏ-8గా మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ కొత్త హరిబాబు
- భూ తగాదాలే హత్యకు కారణం : జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసును ఎట్టకేలకు పోలీసులు చేధించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన రాజలింగమూర్తి హత్య కేసులో 10మందిపై కేసు నమోదు చేసినట్టు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నాగవెల్లి రాజలింగమూర్తిని హత్య చేసిన ఘటనలో 10 మందిపై కేసు నమోదు కాగా, ఏడుగురు.. రేణికుంట్ల సంజీవ్, పింగిలి సెమంత్, మోరే కుమార్, కొత్తూరు కిరణ్, రేణికుంట్ల కొమురయ్య, దాసరపు కృష్ణ, రేణికుంట్ల సాంబయ్యను అరెస్టు చేశారు. అలాగే మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ కొత్త హరిబాబు, పుల్ల నరేష్, పుల్ల సురేష్ పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న ముగ్గురిని కూడా అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. అయితే భూమి విషయంలో తలెత్తిన తగాదాతో నిందితులు రాజలింగమూర్తిని కత్తులు, ఇనుపరాడ్లతో హత్య చేసినట్టు వెల్లడించారు. నిందితుడు ఏ1 సంజీవ్‌కు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఎకరం భూమి విషయంలో తగాదా నడుస్తోంది. మోసపూరితంగా ఆ భూమి నుంచి తన పేరు మీదికి కొంత భాగాన్ని రాజలింగం అక్రమంగా రాయించుకున్నాడని కక్ష పెంచుకొని వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో తరచుగా రాజలింగమూర్తిని చంపేస్తానని, తన భూమి తనకు దక్కుతుందని బెదిరించేవాడు. తన సమీప బంధువులతో చర్చించి తనకు సహకరిస్తే ఆ భూమిని అందరం పంచుకుందామని ఒప్పందం కుదుర్చుకున్నారు. గతంలో మున్సిపల్ వైస్ చైర్మెన్‌గా పనిచేసిన కొత్త హరిబాబు దగ్గరికి వెళ్లి విషయం చెప్పగా చంపేయమంటూ, బెయిల్ ఖర్చులు, మిగతావి తాను చూసుకుంటానని చెప్పాడు. లాయర్ సంజీవరెడ్డి చనిపోయాక రామలింగం తన వెంట పడుతున్నాడని, ఎమ్మార్వో ఆఫీస్ వద్ద భూమిని రాకుండా చేయాలని చూస్తున్నాడని చెప్పాడు. దాదాపు రెండు నెలల కిందట రేణికుంట్ల సంజీవ్, మోరే కుమారులు ఇద్దరు కలిసి వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతంలో రెండు కత్తులు, ఒక రాడ్డు కొనుగోలు చేసి వాటిని తీసుకొచ్చి సంజీవ్ ఇంటిదగ్గర దాచి పెట్టారు. ఈనెల 19న సంజీవ్ కోర్టుకు వెళ్లగా అక్కడ రాజలింగంమూర్తి కూడా కనబడ్డాడు. ఎలాగైనా రాజలింగమూర్తిని మట్టుపెట్టాలని దాసారపు కృష్ణ, నరేష్‌కు సంజీవ్ చెప్పి రాజలింగమూర్తి కదలికలను గమనించాలని చెప్పారు. సంజీవ్, కొత్తూరు కిరణ్, మోరే కుమార్, బబ్లు నలుగురు కలిసి ఇంటి వద్ద దాచిన కత్తులు, రాడ్డు తీసుకొచ్చి రాజలింగమూర్తి ఇంటి సమీపంలో కాపుకాశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీ క్రాస్ వద్ద సాయంత్రం 6:45 గంటల ప్రాంతంలో అంబేద్కర్ సెంటర్ కేర్ మెడికల్ షాప్ నుంచి మోటార్ సైకిల్ మీద బయలుదేరి తన ఇంటికి వెళ్తుండగా రాజలింగమూర్తి బండికి అడ్డం తిరిగి కండ్లలో కారం చల్లి అకస్మాత్తుగా దాడి చేశారు. వారి వెంట తెచ్చుకున్న కత్తులు, ఇనుపరాడుతో విచక్షణారహితంగా కొట్టారు. పొట్ట భాగంలో కత్తులతో పొడవడంతో తీవ్ర గాయాలతో రాజలింగమూర్తి అక్కడి కక్కడే మృతి చెందాడు. ఆయన చనిపోయాడని నిర్ధారిం చుకొని వెంటనే అక్కడ నుంచి పరారయ్యారు. బైక్ పై 5 ఇంక్లైన్ రోడ్డు ద్వారా పరకాల వైపు పారిపోతూ శ్యామ్ నగర్ స్టేజీ వద్దకు చేరుకున్నారు. అక్కడ తన సమీప బంధువైన కలువల శ్రీనివాస్ ఆగి ఉండడాన్ని గమనించి తన ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని, ఇంటికి కాల్ చేసుకోవాలని శ్రీనివాస్ ఫోన్ తీసుకొని కొత్త హరిబాబుకు కాల్ చేసి విషయం చెప్పి డబ్బులు పంపమని అడిగారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 5వ ఇంక్లైన్ చెక్ పోస్ట్ వద్ద శనివారం సాయంత్రం 6:30 గంటలకు అందరూ ఒక్క దగ్గర కలుసు కొని డబ్బులు సమకూర్చుకొని పారిపోయేందుకు సిద్ధ మయ్యారు. నమ్మదగిన సమాచారం మేరకు వారందరినీ పోలీసులు పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి 2 కత్తులు, ఒక రాడ్డు, 7 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలతో పాటు రక్తపు మరకల బట్టలను స్వాధీనం పరుచుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి నట్టు ఎస్పీ వివరించారు. కేసును చేధించిన భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, పోలీస్ బృందాన్ని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, చిట్యాల సీఐ మల్లేష్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, భూపాలపల్లి, గణపురం, రేగొండ, టేకుమట్ల ఎస్సైలు సాంబమూర్తి, రమేష్, అశోక్, సందీప్, సుధాకర్, రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా అతిశీ


**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి ఆతిశీని ఆప్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన పార్టీ శాసనసభాపక్ష భేటీలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవ్ ఝా ఆమె పేరును ప్రతిపాదించగా.. మిగతావారంతా మద్దతు పలికారు. ఢిల్లీలో ప్రతిపక్ష నేతగా ఒక మహిళ ఎన్నికకావడం ఇదే మొదటిసారి. ఆప్ శాసనసభాపక్ష భేటీకి పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఇటీవల ఎన్నికైన 22 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కాల్‌కాజీ నియోజకవర్గం నుంచి ఆతిశీ గెలుపొందిన విషయం తెలిసిందే. తనపై విశ్వాసం ఉంచి, ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్నందుకు కేజ్రీవాల్‌తోపాటు పార్టీ నేతలకు ఆతిశీ కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో ప్రజల తరఫున బలమైన గొంతుకను వినిపిస్తామనీ, ఇచ్చిన హామీలు నెరవేర్చేలా బీజేపీ సర్కారుపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

# కుదరని ఏకాభిప్రాయం

### మంత్రివర్గ కూర్పుపై తేల్చని అధిష్టానం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల రాక కోసమా?
- కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ
- దీపాదాస్ మున్షీ కమిట్‌మెంట్‌ను కాదలేకపోయారా?
- ప్రాతినిధ్యం లేని ఆ 'నాలుగు జిల్లాలు'
- సవాల్‌గా సామాజిక సమీకరణాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్




కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదమూడు నెలలైనా మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం కుదరటం లేదు. రాష్ట్రానికి ముఖ్యమంత్రితో కలిపి 18 మంది మంత్రులకు అవకాశముంది. కానీ ప్రస్తుతం ముఖ్యమంత్రితో కలిసి 12 మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. మంత్రివర్గ విస్తరణ, మార్పులు, చేర్పులు పూర్తిగా ముఖ్యమంత్రి విచక్షణాధికారమే. అయినా రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన మంత్రి పదవులను ఖాళీగా ఉంచడమేంటన్న చర్చ జరుగుతున్నది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం చాలా సార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా తేల్చడం లేదనే ఆరోపణలు న్నాయి. ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో బిజీగా ఉండటం వల్ల మంత్రివర్గ విస్తరణ ఆలస్య మవుతున్నదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కానీ మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. దాన్ని సాధించుకునేందుకు ఎవరికి వారు పైరవీలు చేస్తున్నారు. అందు కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధ పడుతున్నారు. కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నాయకులతో అధిష్టానానికి చెప్పిస్తున్నారు. రోజుల తరబడి ఢిల్లీలో మకాం వేస్తూ...అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అటు అధిష్టానం, ఇటు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంకు కూడా మంత్రివర్గ విస్తరణ పెద్ద సవాల్‌గా మారింది. ఇన్‌చార్జీ మంత్రులు కూడా కొంత మంది ఎమ్మెల్యేల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. మొన్నటిదాకా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా కొనసాగిన దీపాదాస్ మున్షీ కూడా మంత్రి పదవి ఇప్పిస్తానంటూ ఒకరిద్దరికి గట్టి హామీ ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. ఈ విషయంలో ఆమెను కాదనలేక, ఎదురు చెప్పలేక...ఆమె వెళ్లిపోయిన తర్వాత మంత్రివర్గ విస్తరణ చేద్దామన్న కోణం కూడా దాగి ఉందని మరో వాదన వినిపిస్తున్నది. దీపాదాస్ మున్షీ సిఫారసు చేసిన వారిలో పటాన్‌చెరు నేత నీలం మధుకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేయాలని పట్టుబట్టినట్టు తెలిసింది.

రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యే మల్‌రెడి రంగారెడ్డికీ ఆమె హామీ ఇచ్చినట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఆమె వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం తప్పుపట్టింది. సామాజిక సమీకరణాలను బట్టి మంత్రులు ఎవరుండాలో, ఎవర్ని నియమించాలో స్థానిక పరిస్థితులను బట్టి తాము నిర్ణయించుకుంటామని చెప్పినట్టు సమాచారం. టికెట్ల విషయంలో కూడా దీపాదాస్‌పై అనేక ఆరోపణలొచ్చాయి. మంత్రివర్గ విస్తరణ జరుగక పోవడానికి మరో కారణం బీఆర్ఎస్ శాసనసభాపక్షం నుంచి ఎక్కువ మంది సభ్యులు కాంగ్రెస్‌లోకి వస్తారనే అంచనాలు. వారు కాంగ్రెస్ శాసనసభాపక్షంలో విలీనమైతే, వారిలో కొంత మందిని మంత్రివర్గంలో సర్దుబాటు చేయాల్సిన అవసరం రావొచ్చు అనే ముందు చూపుతో కూడా కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు మరో వాదన వినిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 64 సీట్లు వచ్చాయి. దీంతో ఈ ప్రభుత్వం కూలిపోతుందంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు పదే పదే ప్రకటనలు చేసిన సంగతి తెలిసిందే. దీన్ని నుంచి గట్టెక్కాలంటే కాంగ్రెస్ బలం పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందులో భాగంగా చేసిన ప్రయత్నాలతో బీఆర్ఎస్ నుంచి 11 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు అనుబంధంగా వ్యవహరిస్తున్నారు. వారిలో దానం నాగేందర్, కడియం శ్రీహరికి మంత్రిపదవులు వస్తాయనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ జరుగుతున్నది. కనుక కేసు విచారణ సమయంలో మంత్రిపదవులు ఇవ్వడం సాధ్యం కాదు.

అందుకే బెర్తులను నింపడం లేదని మరో వాదన. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆ దిశగా మంత్రివర్గ మార్పునకు డిమాండ్లు వస్తున్నాయి. ఇటీవల కులగణన, ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసింది. దీన్ని ఆసరాగా చేసుకుని బీసీ వాదాన్ని కాంగ్రెస్ బలంగా వినిపిస్తున్నది. ఆరు మంత్రిపదవుల్లో కనీసం ఒక మంత్రి పదవి అయినా ఇవ్వాలని భావిస్తోంది. ఖమ్మం మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాల నుంచి 17 మంది ఎమ్మెల్యేలు మంత్రిపదవి కోసం పోటీ పడుతున్నారు. అందులో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. ఈ జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున తీవ్రంగా పోటీ పడుతున్నారు. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఒక్కొక్కరికి మాత్రమే ప్రాతినిధ్యం ఉన్నది. గ్రేటర్ హైదరాబాద్‌లో కంటోన్మెంట్ తప్ప ఎక్కడా హస్తం గెలువలేదు. ఆ జిల్లా నుంచి ఎమ్మెల్సీ పదవులిచ్చి మంత్రిపదవి ఇస్తారనే ప్రచారం జరుగుతున్నది. అయితే ఇప్పుడే మంత్రిపదవులు ఇస్తే తమ నాయకుడికి పదవి ఇవ్వాలనే అసంతృప్తి స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యక్తమయ్యే అవకాశం ఉందని పార్టీ భావిస్తున్నది.

# నేటి నుంచి కీసర బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- జాతరలో 1000 మంది పంచాయతీ , మున్సిపల్ , జీహెచ్ఎంసీ సిబ్బంది
- జాతరను విజయవంతం చేస్తాం : ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ శర్మ





నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరు రోజులు పాటు జరిగే ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 5 లక్షల మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉండటంతో వారి సౌకర్యం కోసం జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్వామివారిని దర్శించుకునేందుకు నాలుగు లైన్ల క్యూలైన్ విధానాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎండ తగలకుండా క్యూలైన్, ఆలయ గోపురం ఎదురుగా పందిళ్లు వేశారు. జాతరలో పంచాయతీ, జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బంది 1000 మంది మూడు షిఫ్టులుగా 24 గంటల పాటు విధులు నిర్వహించనున్నారు. వాహనాల పార్కింగ్‌కు గురుకుల పాఠశాల వెనుక, ముందున్న ఖాళీ స్థలాన్ని కేటాయించారు. వీఐపీల వాహనాలను జిల్లా పరిషత్ వేద పాఠశాల వరకు అనుమతించనున్నారు. జాతరలో ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. పోలీసులు జాతర పరిసర ప్రాంతమంతా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

**కీసరగుట్ట జాతరను విజయవంతం చేస్తాం**



కీసరగుట్ట జాతర విజయవంతం చేయడానికి అందరూ సహకరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. భక్తుల కోసం ప్రసాదాలు, మంచినీరు, క్యూలైన్లు, చలువ వందిళ్లు ఏర్పాటు చేశాం.

**- ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ శర్మ**

## సీఎం రేవంత్‌కు రక్షణ కవచంలా బీజేపీ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ రక్షణ కవచంలా నిలుస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ఆరోపించారు. అమృత్ టెండర్ల స్కామ్ నుంచి మొదలుకుని సివిల్ సప్లైస్ స్కామ్ వరకు కేంద్ర ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు.వాటిపై సాక్ష్యాధారాలతోసహా అనేక సార్లు కేంద్రానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కాళేశ్వరం ప్రమాదంపై కేంద్రం అఘామేఘాలపై స్పందించిందని గుర్తు చేశారు. అదే తరహాలో సుంకిశాల ప్రమాదం, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రేవంత్ సరైన సమయంలో బీజేపీలో చేరతానని హామీ ఇవ్వడం వల్లనే కేంద్రం ఆయన్ను కాపాడుతుందన్న అనుమానం వ్యక్తం చేశారు. గతంలో ఎన్‌డీఎస్‌ఏ, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పందించిన విధంగానే రాష్ట్రంలో సంబంధించిన ప్రమాదాలపై విచారణ చేసి, కారణాలు కనుక్కొని ప్రజలకు చెప్పాలని కోరారు. దేశవ్యాప్తంగా బీజేపీపై విమర్శలు చేస్తూ పోరాటం చేశామంటున్న రాహుల్‌గాంధీ చెబుతుండగా ఇక్కడ మాత్రం బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్న విషయం అనేక సార్లు స్పష్టమైందని గుర్తు చేశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సీఎం సొంత బావమరిదికి రూ.1,337 కోట్ల అప్పనంగా కట్టబెట్టిందని ఆరోపించారు. మోడీ స్వయంగా తెలంగాణ రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ నిర్మాణరంగ సంస్థల నుంచి చదరపు అడుగుకి 150 రూపాయల చొప్పున రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ఆర్‌ఆర్ టాక్స్ పేరిట పన్నులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పించారని తెలిపారు. ఈ అంశంపై ఇప్పటిదాకా బీజేపీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేసి, భారీగా నగదుతోపాటు ఆస్తులను గుర్తించినట్టుగా వార్తలు వచ్చి ఐదు నెలలు దాటినా ఇప్పటిదాకా కనీసం ప్రకటన కూడా చేయలేదని విమర్శించారు. తాను చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అవినీతి, అరాచకాలపై వెంటనే స్పందించి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బీజేపీకి సవాల్ విసిరారు.

# కేంద్రమంత్రులతో రైతుల చర్చలు విఫలం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతులు, కేంద్ర మంత్రుల మధ్య చర్చలు విఫలమయ్యాయి. ఎటువంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. దీంతో పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. మూడో విడత చర్చలు మార్చి 19న చండీగఢ్‌లో జరగనున్నాయి. శనివారం రాత్రి చండీగఢ్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ భవన్‌లో దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో కేంద్ర ప్రభుత్వం తరపున కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, వినియోగదారుల వ్యవహారాల, ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, వ్యవసాయ శాఖ మంత్రి గుర్మీత్ ఖుడియన్, ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి లాల్ చంద్ కటారుచక్ సమావేశంలో పాల్గొన్నారు. రైతు నేత జగ్జిత్ దల్లేవాల్, సర్వాన్ సింగ్ పాంధర్‌తో సహా 28 మంది రైతు నాయకుల బృందం పాల్గొంది.

పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో ఏడాది పొడవునా జరుగుతున్న రైతుల ఆందోళనకు పరిష్కారం లేకుండానే రైతు నేతలకు, కేంద్ర మంత్రుల బృందానికి మధ్య జరిగిన రెండో విడత చర్చలు ముగిశాయి. చర్చలు సానుకూలంగా జరిగాయని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. "రెండు రైతు సంఘాలతో జరిగిన చర్చలు సానుకూలంగా ఉన్నాయి. రైతుల సంక్షేమం మోడీ ప్రభుత్వానికి ప్రాధాన్యత. మేము రైతు నాయకుల అభిప్రాయాలను విన్నాం" అని శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. రైతు నాయకులతో చర్చలు కొనసాగుతాయని వివరించారు.

కేంద్ర మంత్రులు మరో రెండు పంటలకు ఎంఎస్‌పీ వర్తింపజేయడానికి అంగీకరించినట్టు సమాచారం. అయితే రైతు నేతలు నోటిఫై చేయబడిన 23 పంటలకు ఎంఎస్‌పీ కోసం డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఎటువంటి పరిష్కారమూ చూపలేదు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి చౌహాన్ తన మంత్రివర్గ సహచరులతో కలిసి దల్లేవాల్ నిరాహార దీక్షను విరమించాలని కోరారు. అయితే, దల్లేవాల్ తన వైఖరిలో దృఢంగా ఉండి, అన్ని పంటలపై ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీ లభించే వరకు తన నిరసనను కొనసాగిస్తానని ప్రకటించారు. కనీస మద్దతు ధరకు నిజంగా ప్రభుత్వం కట్టుబడి ఉంటే, ఏడాదికి రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లు కేటాయించాలనీ, ఆ మొత్తం కేటాయించడం పెద్ద సమస్య కాదని రైతు నేతలు స్పష్టం చేశారు.

రైతు నాయకులు వివిధ పంటల సేకరణ పరిమాణాలు, కొనుగోలు ధరలు, మార్కెట్ ధరలపై డేటాను ఉటంకిస్తూ వారి డిమాండ్లకు మద్దతు ఇచ్చే గణాంకాలు, పత్రాలను సమావేశం ముందు పెట్టారు. అయితే, రైతులు పేర్కొన్న గణాంకాలకు, కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న గణాంకాలకు మధ్య వ్యత్యాసాలు బయటపడ్డాయి. "దీనిని పరిష్కరించడానికి కేంద్ర సంస్థలు రైతుల నుంచి డేటాను సేకరించాలని నిర్ణయించారు. మార్చి 19న జరిగే తదుపరి సమావేశంలో మరిన్ని చర్చలు జరుగుతాయి" అని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా మాట్లాడుతూ.. చర్చ ప్రధానంగా ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీపైనే జరిగిందన్నారు. "ఈ కీలకమైన డిమాండ్‌పై అన్ని రైతు సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు" అని ఆయన చెప్పారు.

## బలవంతపు హామీ పత్రాలు రాయించుకోవటం తగదు

**టీఎస్‌యూటీఎఫ్**

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీఆర్టీ(కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లు) లతో బలవంతగా హామీ పత్రాలు(అండర్‌టేకింగ్) రాయించుకోవటం మానుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఆర్‌టీలను మానసికంగా వేధించటం తగదని హితవు పలికారు. 2025 మార్చి నెలలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఫలితాలు సాధించకపోతే ఉద్యోగం నుండి తొలగించేలా సీఆర్టీలతో ఒప్పంద హామీ పత్రాన్ని రాయించుకోవటమేంటని ప్రశ్నించారు. పదో తరగతి కామన్ పరీక్షలు జరిగే ముందు ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను, సీఆర్టీలను మానసికంగా వేధించడం వలన ఫలితాలు రావనీ, ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో పనిచేసేటట్లు అధికారులు ప్రవర్తించాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి, భయభ్రాంతులకు గురి చేయటం వల్ల నూరు శాతం ఫలితాలు సాధించటం కష్టమని పేర్కొన్నారు. 22 ఏండ్ల నుంచి గిరిజన సంక్షేమ శాఖలో నామ మాత్రపు వేతనాలతో పనిచేస్తున్న సీఆర్టీలకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సర్వీసులు రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని గుర్తు చేశారు. విద్యాబోధనలో అపారమైన అనుభవాన్ని గడించిన సీఆర్టీలు అనేక సంవత్సరాలుగా అద్భుతమైన పనితీరును కనబరుస్తూ నూరు శాతం ఫలితాలు సాధించడంలో కీలకపాత్రను పోషిస్తున్నారని తెలిపారు. వాటిని పరిగణలోనికి తీసుకోకుండా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వటం వల్ల వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ కారణంతో వారిని టర్మినేట్ చేయాలని అధికారులు కుట్ర చేస్తే టీఎస్‌యూటీఎఫ్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

## కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ

- అహ్మదాబాద్ వేదికగా ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఏఐసీసీ కీలక సమావేశాలు : పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ వెల్లడి

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదిక కానుంది. గతేడాది డిసెంబర్‌లో కర్నాటకలోని బెళగావిలో జరిగిన నవ సత్యాగ్రహంలో తీసుకున్న నిర్ణయాలకనుగుణంగా ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఇక్కడ ఏఐసీసీ సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 8న సీడబ్ల్యూసీ సమావేశం, ఏప్రిల్ 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం ఉంటుందని వివరించారు. ఈ రెండు సమావేశాలకూ మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఈ కీలక భేటీ దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నేతలను ఒక చోటుకు చేర్చడమే కాకుండా బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ఎదురయ్యే సవాళ్లు, రాజ్యాంగం, దాని విలువలపై నిరంతరం జరుగుతున్న దాడిపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తుందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, పార్టీ జాతీయ ఆఫీస్ బేరర్లు, సీనియర్ నేతలు, ఇతర ప్రతినిధులు పాల్గొననున్నారు.

# దాశరథి, ఆరుద్రలు నేటి తరానికి ఆదర్శం

- దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేశారు
- సాహిత్య సమాలోచన సదస్సులో వక్తలు

### తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంమే వారికి స్ఫూర్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"గాంధీలు మాత్రమే కాదు... గాడ్సేలు కూడా దేశభక్తులే" అనే వాదం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజాపోరాటానికి గొంతుకలై, తెలుగు సాహిత్యానికి దిశా నిర్దేశం చేసిన దాశరథి, ఆరుద్రలు నేటి తరానికి ఆదర్శమని సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అన్నారు. మహాకవుల శతజయంతి సందర్భంగా తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో "దాశరథి, ఆరుద్ర సాహిత్య సమాలోచన" పేరుతో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యంపై ఇద్దరూ చెరగని ముద్రవేశారని కొనియాడారు. "నిజాం రాచరికాన్ని నిరసిస్తూ ...నిజామాబాద్ జైలు గోడల మీద... ఓ నిజాం పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని, తీగెలను దెంపి అగ్నిలో దింపినావు... నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ నినదించాడు. గోదారి గట్టుంది... గట్టుమీద పిట్టుంది అని సినిమా పాటలు రాసినా, కూనలమ్మ పదాలను పలికించినా అది వారికే చెల్లింది. మహత్తర ప్రజా పోరాటలకు ప్రాంతీయ భేదాలుండని వీరిద్దరు రుజువు చేశారు. వృత్తి జీవితంలో ఎంత నిబద్ధతతో ఉన్నారో... వ్యక్తిగత జీవితంలోనూ అంతే నిబద్ధతతో ఉన్నారు" అని వ్యాఖ్యానించారు. మతతత్వం ముసుగులో పుస్తకాలపై, పూజారులపై దాడులు జరుగుతున్న తరుణంలో వారి స్ఫూర్తితో నేటి తరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ కవి ఆర్.సీతారాములు మాట్లాడుతూ దాశరథి, ఆరుద్రలపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. వారు రాసిన కొన్నింటిని పదేపదే వల్లే వేస్తూ చెప్పడం మాని కొత్త కోణాలను ఆవిష్కరించాలని సమావేశంలో పాల్గొన్న పరిశోధనా విద్యార్థులకు సూచించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వారి యాదిలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. తెలుగు సాహిత్యానికి వారు వన్నె తెచ్చారని కొనియాడారు. కవి యాకుబ్ మాట్లాడుతూ ఇద్దరు కవులు రాసిన మహాకావ్యాలకు ఒక్క అవార్డు రాలేదనీ, సాహిత్యానికి అవార్డులు కొలమానం కాదని విశ్లేషించారు. పద్మశ్రీలు, పద్మభూషండ్లు రాకపోయినా వారు ప్రజాగొంతుకలని అన్నారు. సామాన్యులు తమ చరిత్రను తామే రాసుకోక పోతే... వేటగాళ్ల చరిత్రే చరిత్రవుతుందనీ, అలా కాకుండా సాహితీ వేత్తలు తమ కళాలకు పదును పెట్టాలని వ్యాఖ్యానించారు.

సదస్సు ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించిన తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ ఇద్దరు కవులు భిన్న ప్రాంతాలకు చెందిన వారైనా, భిన్న దృక్పదాల నుంచి వచ్చిన వారైనా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి స్ఫూర్తి పొందిన వారేనని గుర్తు చేశారు. దాశరథి సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా తన సాహిత్యం ద్వారా కమ్యూనిష్టు భావజాలాన్ని వ్యాపింపజేశారని పేర్కొన్నారు. డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర అధ్యక్షతన జరిగిన దాశరథి సాహిత్య సమాలోచన సమావేశంలో 'దాశరథి జీవితం-పోరాట నేపథ్యం' పై వుర జ్యోతి, కవిత్వంపై డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్, సినిమా పాటలపై డాక్టర్ బి.బాలకృష్ణ, కథలపై పెద్దపల్లి తేజస్విని, విమర్శ, అనువాదాలపై డాక్టర్ శివరాత్రి సుధాకర్ ప్రసంగించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ కోశాధికారి అనంతోజు మోహనకృష్ణ అధ్యక్షతన జరిగిన ఆరుద్ర సాహిత్య సమాలోచన సమావేశంలో ఆరుద్ర రాసిన త్వమేవాహం కావ్యంపై డాక్టర్ గంజి శశిధర్, కవిత్వంపై తులసి గగులోత్, సినిమా పాటలపై మౌనిశ్రీమల్లిక్, పరిశోధనలపై డాక్టర్ లక్ష్మి ఆసిరెడ్డి, విమర్శలపై బండారు రాజ్ కుమార్‌లు ప్రసంగించారు.

తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ ఇద్దరు కవులు తమ కళాలను పీడిత, తాడిత ప్రజల గోసను ప్రపంచానికి చాటారని అన్నారు. దాశరథి జైల్లో అగ్నిధారను, ఆరుద్ర రైల్లో త్వమేవాహం కావ్యాలకు నాంది పలికారని పేర్కొన్నారు. ప్రశ్నించే తెలంగాణ నేలే వారికి సాహితి ఓనమాలను నేర్పిందని వ్యాఖ్యానించారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు వారిద్దరి పేర్లు ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కవులు సలీమ,శరత్‌సుదర్శి, పేర్ల రాము, చికొండ్ర రవి, వాహెద్ ఖాన్, ఎం.రేఖ, ఏబూషి నర్సింహ, ముజాహిది అలీ, మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ డిమాండ్‌కనుగుణంగా జాబ్ క్యాలెండర్

- ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భరోసా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కనుగుణంగా జాబ్ రిక్రూట్‌మెంట్ క్యాలెండర్‌ను అమలు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఏఈఏ) నేతలు డిప్యూటీ సీఎంను కలిసిన సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. రామగుండంలో 800 మెగావాట్ల నూతన విద్యుత్ కేంద్రాన్ని 100 శాతం జెన్కో ఆధ్వర్యంలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఇంజనీర్లు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జెన్‌కోలో అక్టోబర్ 2024లో ఇచ్చిన పదోన్నతులకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. టీజీ ట్రాన్స్‌కో మరియు డిస్కాం కంపెనీల్లో నియామకాలు పదోన్నతుల అంశాలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. డిప్యూటీ సీఎం స్పందిస్తూ ఇటీవల ఇచ్చిన పదోన్నతుల గురించి త్వరలోనే ఉత్తర్వులు వచ్చేలా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులందరూ తెలంగాణలో ప్రజలకు ఎటువంటి విద్యుత్ అంతరాయం కలగకుండా తీవ్రంగా శ్రమించాలని సూచించారు. విద్యుత్ సంస్థలో ఉద్యోగం సేవాభావనతో కూడినదని దిశనిర్దేశం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బట్టు హరీష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్‌ఇమ్రాన్, ఏఈలు యాదగిరి, సమీర్, పిల్లి రాజు, అనిల్‌రెడ్డి, నాగరాజు, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీగా అశోక్ కుమార్‌ను గెలిపించుకుందాం

- ఎమ్మెల్సీ కోదండరాం
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్

నవతెలంగాణ-సిద్దిపేట

30 ఏండ్లు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమాలు చేసిన, ఉపాధ్యాయుల సమస్యలు తెలిసిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్‌కు ఓటు వేసి గెలిపించుకుందామని ఎమ్మెల్సీ కోదండరాం ఉపాధ్యాయులను కోరారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారున్ని గెలిపించేందుకు అన్ని జిల్లాల్లో ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. ఉద్యమకారునికే ఉపాధ్యాయ సమస్యలు తెలుస్తాయని, నిజాయితీగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న వారికి ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అభ్యర్థి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. 317 జీఓ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం ఇప్పిస్తానని తెలిపారు. వారికి కనీస వేతన అమలు చేయిస్తామని, పెండింగ్‌లో ఉన్న నాలుగు వేల కోట్ల బకాయిలు, పదవీ విరమణ పొందిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్, మంచి ఫిట్మెంట్‌తో పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. గురుకుల పాఠశాల టైంటేబుల్ మార్పిడి చేయిస్తామని, ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేసి ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 57 ప్రకారం నెలవారీ ప్రమోషన్, అర్హత ఉన్న టీచర్లకు జేఎల్, ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డైట్ లెక్చరర్ల ప్రమోషన్ ఇప్పిస్తామన్నారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 కింద వేతనాలు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో నిరంతరం పోరాడుతానని తెలిపారు. 27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అనిల్ కుమార్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిప్పంటించుకుని ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్య

నవతెలంగాణ-కొండపాక

ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఒక మహిళ, ఒక పురుషుడు.. ఆటోలో వచ్చి తిమ్మారెడ్డిపల్లి శివారులోని హెూటల్స్ వద్ద శనివారం రాత్రి దిగారు. రోడ్డుకు కొంత దూరంలో చెట్ల పొదల మధ్యకు వెళ్లి వారి వెంట తెచ్చుకున్న కిరోసిన్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నారు. అక్కడ ఒక్కసారిగా మంటలు రావడంతో పరిసర ప్రాంతంలోని స్థానికులు గమనించి వెంటనే నీటితో ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, వారు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అందులో మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కాగా, వారి బ్యాగుల్లో దొరికిన వారి ఆదార్ కార్డులను బట్టి వారిని గుర్తించారు. ఆధార్ కార్డుల ప్రకారం.. సిద్దిపేటలోని సాయి విద్యానగర్ కాలనీకి చెందిన శిరోద్కర్ లక్ష్మి (65) భర్త పేరు చందుగా, రంగారెడ్డి జిల్లా మేడిపల్లి ఘట్‌కేసర్ గవర్నమెంట్ స్కూల్ దగ్గర ఆదర్శనగర్‌కు చెందిన టెక్లేకర్ శ్రీధర్ (44) తండ్రి నర్సోజి అని తెలిసింది. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తులను గుర్తుపట్టిన వారు తొగుట సీఐ లతీఫ్ (ఫోన్ నెంబర్ 8712667342), కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ (ఫోన్ నెంబర్ 8712667345)కు సమాచారం ఇవ్వాలని కుకనూరుపల్లి ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# ఇసుకే బంగారమాయేనా..?

## హైదరాబాద్ నగరంలో ధరలకు రెక్కలు



ఇసుక విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఇసుక ధరలు ఉండటం లేదు. ఇసుక కొనలేని పరిస్థితి నెలకొంది. వాతావరణంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగినట్టు ఇసుక ధరలూ పెరుగుతున్నాయి.. 15 నుంచి 20 రోజుల కిందట వరకు టన్ను రూ.1300 పలికిన ఇసుక ధరలు అమాంతం పెరిగి ప్రస్తుతం మార్కెట్‌లో రూ.2000కు లభ్యమవుతోంది. దీంతో రియల్టర్లు, బిల్డర్‌లు కూడా ఆందోళన చెందుతున్నారు.

- కొత్త పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ?
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- అయోమయంలో లారీ యజమానులు
- ప్రత్యామ్నాయం వైపు రియల్టర్‌ల చూపు

నవతెలంగాణ-ఉప్పల్

ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. దీనికి తోడు ఇసుక ధరలు పెరగడంతో ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. ఇప్పటికే అప్పులు చేసి బిల్డింగ్ కట్టినవారు.. అమ్మకాలు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల సామాన్యులు ఇల్లు కట్టుకొనే పరిస్థితి లేదు. సిమెంట్, స్టీల్ ధరలతో పాటు ఇప్పుడు ఇసుక ధరలు పెరుగడంతో సామాన్యుడి సొంతింటి కల కలగానే మిగిలిపోయేలా ఉంది.

### కొత్త పాలసీ ఎవరికి లాభం ?

కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని తీసుకురాబోతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ కొత్త పాలసీ విధానంతో ఎవరికి లాభం చేకూర్చబోతుందన్న చర్చ నడుస్తోంది. బడా కాంట్రాక్టులకా.. సామాన్య ప్రజలకా అని పలువురు చర్చించుకుంటున్నారు. వాట్సప్ బుకింగ్ ద్వారా నగరంలో ఇంటికి డోర్ డెలివరీ చేస్తాం అని ప్రభుత్వ అధికారులు చెబుతున్నట్టు తెలిసింది. అయితే, ఇల్లు కట్టుకోవడానికి ముఖ్యంగా మూడు రకాల ఇసుకను వినియోగిస్తారు. కస్టమర్ తనకు నచ్చితేనే ఇసుకను కొంటారు. కానీ డోర్ డెలివరీతో కస్టమర్ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే విధానంతో వచ్చిన దానితోనే సర్దుకుపోవాలి. రాష్ట్రంలో 50 వేల నుంచి 60 వేల లారీలను ఇసుక ట్రాన్స్‌పోర్టులో మైనింగ్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేసుకున్నారు. భూపాలపల్లి, ములుగు, భద్రాచలం, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల క్వారీల నుంచి ఇసుకను నగరానికి చేరుస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్స్ ఏర్పాటు చేస్తే ఇన్ని వేల ఇసుక లారీల పరిస్థితి ఏమైపోవాలని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలపై ఆధారపడి జీవిస్తున్న, డ్రైవర్లు కూలీల పరిస్థితి ఏంటి? వారి బతుకుదెరువుకు భరోసా ఎవరు కల్పిస్తారు? అనే అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి. అందరినీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ముందడుగు వేయాలని డ్రైవర్స్, కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### అధికారుల మధ్య సమన్వయ లోపం..

రాష్ట్రంలో మైనింగ్, రవాణా శాఖ అధికారుల సమన్వయ లోపం లారీ యజమానులకు నష్టదాయకంగా మారింది. మైనింగ్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక పోర్టల్‌లో 16 టైర్ల లారీకి ఇసుకను 35 టన్నులుగా నిర్ధారించారు. దీనికి లారీ యజమాని ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేస్తూ ప్రభుత్వానికి రూ.14500 చెల్లిస్తారు. 14 టైర్ల లారీకి 33 టన్నులుగా నిర్ధారించారు. దీనికి లారీ యజమాని రూ.13300 చెల్లిస్తారు. 12 టైర్ల లారీకి 25టన్నులుగా నిర్ధారించారు. దీనికి లారీ యజమాని ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి రూ.10700 ప్రభుత్వానికి చెల్లిస్తారు. కానీ ఆర్‌సీ ప్రకారం 16టైర్ల లారీ ఇసుకను తీసుకురావడానికి 33 టన్నులకు మాత్రమే అనుమతి ఉందని, 14 టైర్ల లారీకి 29 టన్నులకు అనుమతి ఉందని, అంతకు మించి ఉంటే రవాణా శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు లారీ యజమానులపై, డ్రైవర్లపై కేసు నమోదు చేస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. రెండు ప్రభుత్వ శాఖల సమన్వయ లోపంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. అనుమతులు ఇచ్చేది వారే, కేసు నమోదు చేసేది వారేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు సమన్వయం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

### ప్రత్యామ్నాయం కోసం బిల్డర్ల ఎదురుచూపు

ప్రజలకు నాణ్యమైన నిర్మాణాలను తక్కువ ధరకు విక్రయించాలన్న బిల్డర్లకు ధరల పెరుగుదల సవాల్‌గా మారింది. దీంతో ఇసుక బదులుగా డస్ట్‌ను అధికంగా వాడుతున్నారు. డస్ట్‌కు రూ.700, రూ.800 ఉండటంతో బిల్డర్లు మొత్తం ఇసుకకు బదులుగా పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్స్‌కు డస్ట్‌ను వాడుతున్నారు.

### ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలి : బిల్డర్ నర్సిరెడ్డి

నగరంలో ఇసుక ధరలు పెరుగడంతో ఇల్లు కట్టి అమ్మే పరిస్థితి లేదు. గతంలో సామాన్యులకు తక్కువ ధరకు విక్రయించేవారం. బతుకుదెరువు కోసం బిల్డర్ వృత్తి వదిలేసి, ప్రత్యామ్నాయ ఉద్యోగాలు చూసుకోవాలి.

### బలవుతున్న లారీ యజమానులు : రామంతాపూర్, ఉప్పల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి

రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో లారీ యజమానులు బలైపోతున్నారు. టీజీఎండీసీ ప్రత్యేక పోర్టల్‌లో ఉన్నట్టు కాకుండా రవాణా శాఖ అధికారులు ఒకలా చెప్పి.. మళ్లీ కేసులు నమోదు చేసి జరిమానాలు వేస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం లారీ యజమానులకు సంకటంగా మారింది.

### ప్రభుత్వానికి కాసులు.. డ్రైవర్లకు కేసులా.. : డ్రైవర్ యాదయ్య

ప్రభుత్వ ఖజానాకు కాసులు చెల్లిస్తూ.. మేం కేసుల పాలవుతున్నాం. రెండు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో డ్రైవర్ల జీవనధారమైన లైసెన్స్‌లు రద్దవుతున్నాయి.

## టన్నెల్‌లో టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

తదితర సిబ్బంది రక్షణచర్యలు చేపట్టారు. 36 గంటలుగా అవిశ్రాంతంగా మట్టిలో కూరుకుపోయిన బాధితులను రక్షించడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. టన్నెల్ కూలడంతో ఆక్సిజన్ పైపులు ధ్వంసమయ్యాయి. దాంతో సొరంగంలో ఇరుక్కున్న బాధితులకు శ్వాస తీసుకోవడం కష్టమని తెలుస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. 8 మంది బాధితులను క్షేమంగా రక్షించేందకు శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రులు తెలిపారు. సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సైతం ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్లిన మంత్రి జూపల్లి**

ఎన్డీఆర్ఎఫ్, సైనిక బృందాలతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొరంగం లోపలికి ఆక్సిజన్ పంపుతున్నామని, వాటర్ తోడేసే పనులు నిరంతరం సాగుతున్నాయని వెల్లడించారు. రెస్క్యూ టీమ్‌లు రాత్రి నుంచి అక్కడే పని చేస్తున్నాయని చెప్పారు. కూలిన మట్టి, నీరు చేరడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. వాటిని తొలగించే పనిలో సహాయక బృందాలు శ్రమిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే టన్నెల్ బోర్ మిషన్ వరకూ సహాయక బృందాలు చేరుకున్నాయని, కార్మికులను రక్షిస్తామని దీమా వ్యక్తం చేశారు.

**బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి**

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న కార్మిక కుటుంబాలను కంపెనీ వారు, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. నల్లగొండ జిల్లాకు తాగునీరందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఎస్ఎల్బీసీ పనుల్లో ప్రమాదం విచారకరం. ఈ ప్రాజెక్టు పనులకు 2004లో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జయప్రకాష్ అసోసియేట్ కంపెనీ 2005లో సొరంగ మార్గం పూర్తి చేస్తామని అగ్రిమెంట్ చేసుకుంది. నాలుగేండ్లలో పూర్తి చేయాల్సిన సొరంగాన్ని 20 ఏండ్లయినా పూర్తి చేయలేదు. సొరంగం పూర్తయితే నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందుతుంది. ఆలస్యం కావడం వల్ల ప్రాజెక్టు ఖర్చు రూ.4600కోట్లకు పెరిగింది. ముఖ్యంగా 8 మంది ప్రాణనష్టానికి దారితీసింది. గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో జరిగిన ఈ నష్టానికి కార్మికులు బలయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు పూర్తి చేయడానికి పూనుకున్నారు. జూలకంటి వెంట రాష్ట్ర కమిటీ సభ్యులు పోతం రాజు, నాగర్ కర్నూల్ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పర్వతాలు, నాయకులు వెంకటేశ్వర్లు, ఆనంద్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

**వారిని సురక్షితంగా బయటికి తీయాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**

శ్రీశైలం ఎడమ గట్టు సొరంగ మార్గం ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మందిని క్షేమంగా బయటికి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత పదేండ్లుగా పట్టించుకోకుండా ఉన్న శ్రీశైల సొరంగ మార్గాన్ని త్వరిత గతిన పూర్తిచేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషకరమని తెలిపారు. టన్నెల్ పనులు ప్రారంభించేముందు టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం) ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సిన లాజికల్ సర్వే అధికారుల ఏమరపాటు వల్లనే ఈ ఘటన జరిగిండొచ్చని అభిప్రాయపడ్డారు. శ్రీశైలం రిజర్వాయర్ లోని నీరు టన్నెల్ కాంటూర్ లెవెల్ కంటే ఎక్కువగా ఉండటం వల్ల 14 కిలోమీటర్ల నుంచి 19.500 కిలోమీటర్లలో ఊట నీరు వస్తుందనీ, ఈ ప్రాంతంలో గ్రానైట్, రాతిశిల కంటే మట్టి ప్రాంతం ఎక్కువగా ఉండడం ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఊట నీరు రిజర్వాయర్ నుంచి రాకుండా కట్టడి చేయాలని కోరారు. ఇంజనీరింగ్ నిపుణుల సలహాలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సత్వరమే పనులు పూర్తిచేయాలని కోరారు. టన్నెల్ లోపల ఎప్పుడు ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచి పనులు నిర్వహించాలనీ, ఈ ఘటనపై నిపుణుల కమిటీని వేసి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

**సొరంగంలో చిక్కుకున్న వారి గురించి గవర్నర్ ఆరా**

**నాగర్ కర్నూల్ కలెక్టర్‌కు ఫోన్**

సొరంగం కూలిన ఘటనలో చిక్కుకున్న వారి యెగ క్షేమాలపై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆరా తీశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ కలెక్టర్‌కు ఫోన్ చేసి సహాయ చర్యలను అడిగి తెలుసుకున్నారు. సొరంగంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలను కలెక్టర్ ఈ సందర్భంగా గవర్నర్‌కు వివరించారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్), స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్ఎఫ్), ఆర్మీ, నిపుణులు సహాయక చర్యల్లో చురుగ్గా నిమగ్నమై ఉన్నాయని పేర్కొన్నారు. సొరంగంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా తిరిగి రప్పించేందుకు అన్ని విధాలా కృషి చేయాలని గవర్నర్ అధికారులను ఆదేశించారు.

**ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయాలన్న తపనతో పనులు ప్రారంభించాం**

**సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందించే లక్ష్యంతో 20 ఏండ్ల కిందట నాలుగేండ్ల కాలపరి మితితో రూ.2వేల కోట్లు కేటాయించి సొరంగాన్ని పూర్తి చేయాలని నిర్ణయించాం. పాలకుల నిర్లక్ష్యం వల్ల సొరంగం పనులు 20 ఏండ్ల దాకా కొనసాగాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో నయా పైసా ఖర్చు పెట్టలేదు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్‌లో రూ.4.50 వేల కోట్లు కేటాయించి పది రోజుల క్రితం పనులు ప్రారంభించారు. గత పాలకుల నిర్వహణా లోపం వల్ల లైనింగ్ దెబ్బతిని టన్నెల్ కూలింది. అందులో 8 మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వారిని కాపాడటానికి రెస్క్యూ టీమ్స్ కృషి చేస్తున్నాయి. ప్రపం చంలోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 43 కిలోమీటర్ల సొరంగ మార్గాన్ని సాహసోపేతంగా నిర్మిస్తు న్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న నాయకుల మాటలకు విలువలేదు.

## రాష్ట్రంలో యూరియా కొరత లేదు

**రైతులు ఆందోళనపడొద్దు : టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల**

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో యూరియా కొరత లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతులు ఆందోళనకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్ నుంచి మంత్రి వ్యవసాయాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వారంలో రాష్ట్రానికి మరో 81,800 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని తెలిపారు. గత యాసంగిలో రైతులు ఫిబ్రవరి 20 నాటికి 6.9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొనుగోలు చేయగా, ఈసారి 8.80 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో 1.99 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే, ఈ సంవత్సరం ఫిబ్రవరి 20 నాటికి 2.59 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, రాష్ట్రానికి 6.81 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు కేంద్రంతో ఇక్కడి పరిస్థితులను వివరిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రానికి కేటాయించిన దానిలో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా పంపినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే మార్క్‌ఫెడ్ వద్ద ఉంచిన 3.08 లక్షల మెట్రిక్ టన్నులతో అవసరంమేరకు అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను వెంటనే సరఫరా చేయాల్సిందిగా కోరారు. రాష్ట్రానికి సంబంధించిన బీజేపీ నాయకులు కూడా ఈ విషయంలో విమర్శలు మాని రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను వెంటనే సరఫరా చేసేలా తమ వంతు కృషి చేస్తే బాగుంటుందని, పెరిగిన విస్తీర్ణం మరియు వినియోగం దష్ట్యా రైతుల శ్రేయస్సును దష్టిలో వుంచుకొని తమ వంతు బాధ్యత తీసుకుంటామని తెలిపారు. గత యాసంగిలో పంటల విస్తీర్ణంతో పోల్చుకుంటే, ఈసారి నీటి వనరులు, భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వరి, మొక్కజొన్న పంటల విస్తీర్ణంలో 5 నుంచి 10 శాతం వరకు వృద్ధి నమోదైనట్టు, యూరియా వాడకం కూడా గతంతో పోల్చుకుంటే ఇప్పటికే 1.9 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా వినియోగించినట్టు వివరించారు.

## కేసీఆర్ అభిమానికి చేయూత

**నేడు జిరాక్స్ సెంటర్ ప్రారంభించనున్న కవిత**

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వీరాభిమాని అయిన చిర్రా సతీష్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేయూతనిచ్చారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామానుజాపురం గ్రామానికి చెందిన ఆయన కేసీఆర్‌కు వీరాభిమాని. చిన్ననాటి నుంచి ఆయన్ను వినికిడి సమస్య వెంటాడుతున్నది. డిగ్రీ పూర్తి చేశారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని తనకు జిరాక్స్ మిషన్, లాప్‌టాప్ ఇప్పిస్తే తాను స్వయం ఉపాధి పొందుతానంటూ కవితకు ఫోన్లో విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించి జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు ఆమె ఆర్థికసాయమందించారు. ఆ సెంటర్‌ను ఆమె సోమవారం ప్రారంభించనున్నారు. అనంతరం కవిత పలు శుభాకార్యాల్లో పాల్గొంటారు.

# రేషన్ కార్డులో 'డిలిట్' కోసం క్యూ..!

## కార్డుల్లో పేర్ల తొలగింపునకు 40వేలకుపైగా వినతులు



- కొత్త కార్డుల కోసం 1.11లక్షల మంది దరఖాస్తులు..
- మార్పులు చేర్పుల కోసం 1.28లక్షల మంది ఎదురుచూపులు
- సర్కిల్ కార్యాలయాలకు చేరుతున్న వందలాది అప్లికేషన్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త రేషన్ కార్డులకు ఒకవైపు దరఖాస్తుల వెల్లువ కొనసాగుతుండగా.. మరోవైపు అదేస్థాయిలో పాత కార్డుల్లోని పేర్ల తొలగింపు కోసం కార్డుదారులు సర్కిల్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు పదేండ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులతో పాటు పాత రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించడంతో జనం మీసేవా కేంద్రాలతో పాటు పౌరసరఫరాల శాఖ ఆఫీస్‌లకు పెద్దసంఖ్యలో వస్తున్నారు. దాంతో నగరంలోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో ఈనెల 8 నుంచి ఇప్పటివరకు 41వేల మంది పాత కార్డుల్లోని పేర్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఇక ఇలా వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం అధికారులు పేర్లను తొలగిస్తున్నారు. దాదాపు 41వేల దరఖాస్తుల్లో.. ఇప్పటివరకు 17,027 అప్లికేషన్స్‌కు డిలిట్ ప్రక్రియ పూర్తి చేయగా.. మరో 24,197 దరఖాస్తుల తొలగింపునకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పెండ్లయిన జంటలు, వేరు కాపురం ఉన్నవారు, విడిపోయిన కుటుంబాల వారు.. కొత్తగా రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవాలంటే.. కుటుంబ సభ్యుల కార్డుల్లో నుంచి డిలిట్ కావాల్సి ఉంటుంది. అప్పుడే వారి నుంచి కొత్త కార్డు కోసం దరఖాస్తు స్వీకరిస్తారు. దాంతో రోజుకు వందలాది మంది తమ కుటుంబ సభ్యుల పేర్ల తొలగింపు కోసం సర్కిల్ కార్యాలయాలకు వస్తున్నారు.

**సర్కిల్ ఆఫీస్‌కు రోజుకు 500కుపైనే దరఖాస్తులు**

కొత్త రేషన్‌కార్డుల కోసం హైదరాబాద్ జిల్లాలోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలోని మీసేవా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరిస్తున్నారు. ఈనెల 8వ తేదీ నుంచి మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. దాంతో మీ సేవా కేంద్రాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. ప్రతిరోజూ ఒక్కొక్క సర్కిల్ ఆఫీస్‌కు 500కుపైనే దరఖాస్తులు వస్తున్నాయి. ఇందులో కొత్త రేషన్ కార్డులతో పాటు పాత రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ అప్ డేట్ సైతం చేస్తుండటంతో ఇప్పటికే కార్డులు ఉండి మార్పులు అవసరం ఉన్నవారు, కొత్త కార్డులు అవసరం ఉన్నవారు మీ సేవా కేంద్రాల్లో ప్రక్రియ పూర్తిచేసిన అప్లికేషన్స్‌ను.. తిరిగి సర్కిల్ ఆఫీసుల్లో సబ్మిట్ చేస్తున్నారు. జిల్లాలో ఈనెల 8 నుంచి ఇప్పటివరకు 1,11,796 దరఖాస్తులు వచ్చాయి. వచ్చేనెల 15వ తేదీ నాటికి ఈ సంఖ్య రెండు లక్షలకు దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం మార్చి 15వ తేదీకి ముహుర్తం ఫిక్స్ చేసినట్టు సమాచారం. అదే రోజు నుంచి అర్హులను గుర్తించి కొత్త కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని పౌరసరఫరాల శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన కార్డుల జారీతో పాటు అవసరమైన ఇతర ఏర్పాట్లను పూర్తిచేస్తున్నట్టు ఆయన వివరించారు.

**డిలీట్ చేస్తాం.. కొత్త కార్డు వస్తుందా? : సువర్ణ, బేగంపేట వాసి**

రేషన్ కార్డులోని తమ కూతురు పేరు డిలీట్ చేస్తేనే.. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వీలుంటుందని మీసేవా నిర్వహకులు చెబుతున్నారు. కొత్త కార్డు అప్లయ్ చేయాలంటే పాత కార్డులో పెండ్లి అయిన తమ కూతురు పేరు డిలీట్ చేస్తే.. ఆమెకు కొత్త కార్డు వస్తుందా? లేకుంటే తమ పేర్లు కూడా తీసేస్తారా? తాము నిరుపేదలం, ఎన్నో సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. ఇప్పుడు కొత్త కార్డు కోసం పోతే.. ఉన్నకార్డు పోతే ఎలా అనే అనుమానం వస్తోంది.

**పదేండ్లుగా దక్కని మోక్షం..!**

ఆహార భద్రత కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఆన్‌లైన్ ద్వారా నమోదైన దరఖాస్తులు లక్షల్లో పెండింగ్ ఉన్నాయి. 2014 నుంచి కార్డుల్లో మ్యుటేషన్స్‌కు అవకాశం లేకుండాపోయిన విషయం తెలిసిందే. ఈ పదేండ్ల కాలంలో వివిధ వర్గాల ప్రజల నుంచి దాదాపు 1.28లక్షలకుపైగా దరఖాస్తుల వచ్చాయి. ఇందులో 1.22లక్షల దరఖాస్తులు కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం రాగా.. మరో 8647 అప్లికేషన్లు ఇంటి చిరునామా, పేర్లు కరెక్షన్స్ కోసం వచ్చాయి. అయితే పౌరసరఫరాల శాఖ అధికార లాగిన్‌లో కార్డులోని పాత సభ్యులు తొలగించేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. కొత్తగా అదనపు సభ్యులను ఆమోదించేందుకు అనుమతి లేదు. కుటుంబాల్లో సభ్యుల సంఖ్య పెరుగుతున్నా.. కార్డుల్లో సభ్యుల సంఖ్య పెరగకపోవడం నిరుపేదలకు ఇబ్బందిగా మారింది. త్వరలోనే మ్యుటేషన్స్‌తో పాటు కొత్త కార్డుల దరఖాస్తులను పరిశీలించనున్నట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈనెలాఖరున లేదా వచ్చేనెల మొదటివారంలో దీనిపై క్లారిటీ వస్తుందని అంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంతవరకు ఆగాల్సిందేనని చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ కొత్త కార్డు కోసం ఇప్పటికే ఉన్న పాత కార్డుల్లోని కుటుంబ సభ్యుల పేర్లు డిలిట్ చేసుకుంటున్నవారిలో తెలియని ఆందోళన కనిపిస్తోంది. భయం భయంతోనే ముందుకు వస్తున్నారు. ఇప్పుడు తొలగింపునకు గురవుతున్న తమ కుటుంబ సభ్యులకు కొత్త కార్డుల రాకుంటే ఏమిటీ? అనే ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి. ప్రభుత్వం కుటుంబ స్థితిగతుల ఆధారంగానే కార్డుల జారీ ఉంటుందని చెప్పకనే చెబుతోంది. మరి దీనికి ఎండ్‌కార్డు ఎలా పడుతుందో వేచిచూడాల్సిందే.



# ఇదేమీ న్యాయం?

## లైంగిక వేధింపుల కేసులో ముస్లిం వ్యక్తుల అరెస్టు

- ఆ కుటుంబాలకు, మసీదుకు 'బుల్డోజర్' నోటీసులు
- రాజస్థాన్‌లో విజయ్‌నగర్ మున్సిపాలిటీ తీరు

**జైపూర్ :** మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు, బెదిరింపుల కేసులో 10 మంది ముస్లింలు అరెస్టు కావడంతో ఈ నిందితుల కుటుంబాలందరికీ 'బుల్డోజర్' నోటీసులు జారీ చేసిన సంఘటన బీజేపీ పాలిత రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం రాష్ట్రంలోని బీవర్ జిల్లాలో విజయ్‌నగర్ పట్టణంలో ఈ నెల 16న హిందువులకు చెందిన ఐదుగురు బాలికలపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారనే కేసులో 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో వీరిపై బుల్డోజర్ చర్యలు తీసుకోవాలని హిందుత్వ శక్తులు డిమాండ్ చేశాయి. దీనిని లవ్ జిహాద్‌గా విమర్శించాయి. పట్టణంలో నిరసనలు నిర్వహించడంతో పాటు, బంద్‌కు కూడా పిలుపునిచ్చాయి. దీంతో హిందుత్వ శక్తుల ఒత్తిడికి తలొగ్గిన విజయ్‌నగర్ మున్సిపాలిటీ అధికారులు నిందితుల కుటుంబాలు, ఇంటి యాజమానులకు ఈ నెల 20, 21 తేదీల్లో నోటీసులు జారీ చేశారు. వారు వుంటున్న ఇళ్లన్నీ అక్రమ కట్టడాలు లేదా ఆక్రమణలు అని నోటీసుల్లో పేర్కొన్నారు. మూడు రోజుల్లోగా సరైన పత్రాలు చూపించాలని, లేకపోతే ఇళ్లన్నీ కూల్చివేస్తామని హెచ్చరించారు. పైగా కూల్చివేతకు అయ్యే ఖర్చునంతా నిందితుల కుటుంబాల నుంచే వసూలు చేస్తామని కూడా నోటీసులో పేర్కొన్నారు. పట్టణంలోని రాజ్‌నగర్ ప్రాంతంలోని జామా మసీదు యాజమాన్యానికి కూడా ఇలాంటి నోటీసే జారీ చేశారు.

ఈ నోటీసులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ కూల్చివేత నోటీసైనా సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధమని తెలిపారు. 100 ఏండ్ల నాటి మసీదుకు ఇప్పుడు యాజమాన్య హక్కులు అడగడం వలన ప్రయోజనం ఏమిటని విమర్శిస్తున్నారు. నిందితుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 'మేం విచారణకు పూర్తిగా సహకరించాం. నిందితుల్ని పోలీసు విచారణ ముందు హాజరుపర్చాం. వారు దోషి లేదా నిర్దోషి అని చట్టం, కోర్టు నిర్ణయించాలి. కానీ ఇలా మా ఇండ్లను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయం. మా దగ్గర అవసరమైన అన్ని పత్రాలు ఉన్నాయి. వాటిని అధికారులకు అంద చేస్తాం. అయినా కూడా మమల్ని లక్ష్యంగా చేసుకుని కూల్చివేత జరుగుతుందని భయ పడుతున్నాం' అని తెలిపారు. విజయ్‌నగర్‌లో మత సామరస్యాన్ని దెబ్బతీయడానికే ఇలా ప్రయత్నం జరుగుతుందని, ముస్లింల్లో ఏ ఒక్కరూ కూడా నిందితుల వైపు నిలబడలేదని, నేరాన్ని ఖండించలేదని స్థానిక ముస్లిం సమాజ సభ్యుడు అఖ్తార్ అలీ తెలిపారు.

ఈ నోటీసులను వెనక్కితీసుకోవాలని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) డిమాండ్ చేసింది. అకస్మాత్తుగా ఈ నోటీసులను జారీ చేయడంలోని అధికారుల ఉద్దేశ్యాన్ని ప్రశ్నించింది. అధికారులు నిష్పాక్షికంగా, ఒత్తిడికి భయపడకుండా పని చేయాలని పీయూసీఎల్ జాతీయ అధ్యక్షురాలు కవితా శ్రీవాస్తవ డిమాండ్ చేశారు.



## యూపీలో బరితెగిస్తున్న బీజేపీ నేతలు

- లక్నోలో ఓ చోట యువకుడ్ని చితకబాదితే.. మరోచోట పూలవ్యాపారిపై మంత్రి మేనల్లుడి దౌర్జన్యం
- బెదిరించి మరీ రాజీ.. వీడియోలు వైరల్

**లక్నో:** బీజేపీకి చెందిన నేత ఒక యువకుడ్ని దారుణంగా కొట్టాడు. వరుసగా పంచ్‌లు ఇచ్చాడు. కొందరు వ్యక్తులు జోక్యం చేసుకుని వారిని విడిపించేందుకు ప్రయత్నించారు. చివరకు వారిద్దరూ పోలీస్ స్టేషన్‌లో రాజీపడ్డారు. అయితే వారు కొట్టుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో ఈ సంఘటన జరిగింది. కారులో ఉన్న బీజేపీ నేత సచిన్ శర్మ ఒక వ్యక్తితో కొంతసేపు మాట్లాడాడు. ఆ తర్వాత ఆయన కారు నుంచి కిందకు దిగాడు. అక్కడకు బైక్‌పై వచ్చిన ఒక వ్యక్తిపై దాడి చేశాడు. అతడ్ని కొట్టడంతోపాటు వరుసగా పంచ్‌లు ఇచ్చాడు. ఆ వ్యక్తి కూడా ప్రతిఘటించేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు.

కాగా, అక్కడున్న కొందరు వ్యక్తులు వీరిద్దరిని విడిపించేందుకు ప్రయత్నించారు. గాయపడిన ఆ వ్యక్తిని సచిన్ శర్మ వదిలిపెట్టాడు. ఈ ఫైట్ తర్వాత వారిద్దరూ స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే అక్కడ రాజీపడ్డారు. ఆర్థిక లావాదేవీల కారణంగా వారి మధ్య వివాదం తలెత్తిందని పోలీసులు తెలిపారు. వారిద్దరూ ఒక ఒప్పందానికి వచ్చారని, సమస్యను పరిష్కరించుకున్నారని చెప్పారు. ఒప్పందం కాపీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమర్పించినట్టు వివరించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీస్ అధికారి వెల్లడించారు. మరోవైపు బీజేపీ నేత సచిన్ శర్మ ఆ వ్యక్తిని దారుణంగా కొట్టి పంచ్‌లు ఇచ్చిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

### పూల వ్యాపారితో యూపీ మంత్రి మేనల్లుడి దౌర్జన్యం



రద్దీగా ఉన్న వీధిలో యూపీ మంత్రి మేనల్లుడు, పూల వ్యాపారిపై దౌర్జన్యానికి దిగాడు. దీంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రాజీపడ్డారు. అయితే వారు కొట్టుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 22న బీజేపీకి చెందిన మంత్రి సోమేంద్ర తోమర్ మేనల్లుడు నిఖిల్ తోమర్, పూల షాపులతో ఇరుకుగా ఉన్న వీధిలో మహీంద్రా స్కార్పియోను డ్రైవ్ చేశాడు. ఎదురుగా ఈ ఆటో రావడంతో వాహనాన్ని నిలిపాడు.కాగా, వాహనం వెళ్లేందుకు దారి లేకపోవడంతో అక్కడున్న ఒక పూల వ్యాపారితో నిఖిల్ వాగ్వాదానికి దిగాడు. మాటా మాటా పెరుగడంతో ఇది ఘర్షణకు దారి తీసింది. దీంతో నిఖిల్ ఆ వ్యాపారిని కొట్టగా అతనూ ప్రతిఘటించాడు. ఆ వ్యాపారికి చెందిన మహిళ కూడా నిఖిల్‌పై తిరగబడింది. దీంతో ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. ఆ తర్వాత నిఖిల్ తన వాహనంలో అక్కడి నుంచి వెళ్లిపోయాడు.మరోవైపు ఈ సంఘటన తర్వాత ఇరువర్గాల వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పరస్పరం ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే కొందరు వ్యక్తుల ప్రమేయంతో వారు రాజీపడ్డారు. ఈ నేపథ్యంలో ఎవరి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# పీఎం టూర్‌కు ముందే పాలిట్రిక్స్

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసమే ఈ జిమ్మిక్కులు : ప్రతిపక్షాలు
- మఖానా రైతులతో కేంద్రం చర్చలు విఫలం
- మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసనలకు పప్పుయాదవ్ పిలుపు

### నేడు కిసాన్ సమ్మాన్ నిధి 19వ విడత నగదు విడుదల చేయనున్న ప్రధాని


**పాట్నా :** ప్రధాని మోడీ భాగల్పూర్ పర్యటనకు ముందే బీహార్‌లో రాజకీయం వేడెక్కింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా మరో విడతగా సుమారు పదికోట్ల మందికి లబ్దిదారులకు దాదాపు రూ.23,000 కోట్లు పంపిణీ చేయనున్నారు.

ప్రధాని పర్యటన సన్నాహాలను పర్యవేక్షించడానికి కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రానికి వచ్చి మఖానా (ఫాక్స్‌నట్స్) పండించే రైతులతో మాట్లాడారు. "ఇటీవలి బడ్జెట్‌లో ప్రకటించిన 'మఖానా బోర్డు' కోసం ఒక ప్రణాళికను రూపొందించారు. నిజమైన వాటాదారులైన రైతులతో సంప్రదించి మఖానా బోర్డును ఏర్పాటు చేయాలని మేం నిర్ణయం తీసుకున్నాం. ఢిల్లీలోని కృషిభవన్ నుంచి జారీ చేసిన ఆదేశాన్ని మేం ఇష్టపడలేదు" అని శివరాజ్‌సింగ్ చౌహాన్ దర్భంగాలో జరిగిన 'మఖానా పంచాయతీ' సందర్భంగా విలేకరులతో అన్నారు. సోమవారం జరిగే ప్రధానమంత్రి కార్యక్రమం దేశం మొత్తంపై ప్రభావం చూపుతుందని కేంద్రమంత్రి వెల్లడించారు.

ఆయా రాష్ట్రాల్లో బీజేపీ, సంకీర్ణ ప్రభుత్వాలు ఉన్నప్పుడు చేయని అభివృద్ధి పనులన్నీ ఎన్నికలు దగ్గరపడగానే.. ఆ పార్టీ నేతలకు గుర్తుకు వస్తాయి. అమాంతంగా వేల కోట్ల రూపాయలు విలువ చేసే అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేయటం, హామీలు గుమ్మరించటం సాధారణమైపోయింది. ఇక అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలు, అభివృద్ధి గురించి పట్టించుకునే నాథుడే ఉండరని స్థానిక ఓటర్ల ఆవేదన. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని ఈ కార్యక్రమానికి బీహార్‌ను ఎంచుకున్నారని ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శలు చేశారు. ఈ ఆరోపణను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ తోసిపుచ్చారు.

ఎన్నికల కారణంగానే ప్రధాని పర్యటన అని సూరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోడీకి ప్రచారాన్ని నిర్వహించిన రాజకీయ వ్యూహకర్తగా ప్రశాంత్ కిశోర్ వ్యవహరించారు. ఇప్పుడు బీహార్‌లో ఎన్నికలు జరగబోతున్నందున, ప్రధాని రాష్ట్రంపై దృష్టి సారిస్తారనేది స్పష్టంగా ఉన్నది ప్రశాంత్ కిషోర్ అన్నారు.

బీజేపీ మిత్రపక్షం లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత, బీహార్‌లోని హాజీపూర్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం







వహిస్తున్న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్.. మోడీ పర్యటన 'మా రాష్ట్రం ..ఆయన ప్రాధాన్యతకు రుజువు' అని అభిప్రాయపడ్డారు. "కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో మేం చూశాం. ప్రధాని కార్యక్రమానికి హాజరు కావడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని పాశ్వాన్ అన్నారు.

స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ మంగళవారం తన పూర్నియా లోక్‌సభ నియోజకవర్గంతో పాటు కొన్ని పరిసర ప్రాంతాలలో 'బంద్'కు పిలుపునిచ్చారు. పూర్నియాలో మఖానా బోర్డును ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను నొక్కి చెప్పడానికి ప్రయత్నించిన యాదవ్.. అవసరమైతే.. ఢిల్లీ , పూర్నియా, కతిహార్ మధ్య రైలు రాకపోకలను అడ్డుకుంటామని కూడా హెచ్చరించారు.

బీహార్ ప్రయోజనాలను, ముఖ్యంగా సీమాంచల్ ప్రాంతాన్ని బీజేపీ దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని మెర్క్యురియల్ ఎంపీ ఆరోపించారు. కానీ జేడీ(యూ)కి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నిరసన వ్యక్తం చేయలేకపోయారని విమర్శించారు. "జేడీ(యూ), బీజేపీకి చెందిన విధేయులతో నిండిపోయిందన్నారు. ఇప్పుడు సీఎం కుమారుడు ఆ పార్టీ పగ్గాలు చేపట్టడానికి అంగీకరిస్తేనే పార్టీని కాపాడు కోవచ్చు" అని యాదవ్ అన్నారు. సీఎం కుమారుడు నిశాంత్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తారనే ఊహాగానాల గురించి.. పాశ్వాన్ స్పందించారు. నిశాంత్ పొలిటికల్ ఎంట్రీపై నిర్ణయం తీసుకోవాల్సింది జేడీ(యూ)నని చెప్పారు.

# అలా ప్రచారం చేయడం సభా హక్కుల ఉల్లంఘనే : జమ్మూకాశ్మీర్ స్పీకర్



**శ్రీనగర్ :** ప్రశ్నలు, బిల్లులు, తీర్మానాలు, సభా వ్యవహారాలకు సంబంధించిన అసెంబ్లీ నోటీసులను ప్రచారం చేయడం సభా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తోందని జమ్మూకాశ్మీర్ స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్ స్పష్టం చేశారు. త్వరలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలకు జారీ చేసిన నోటీసులకు జరిగిన ప్రచారాన్ని తీవ్రంగా పరిగణిస్తూ స్పీకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్చి 3 నుంచి జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 'త్వరలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న సభా వ్యవహారాలకు సంబంధించి ఎమ్మెల్యేలకు ఇచ్చిన నోటీసులకు ఇటీవల తీవ్ర ప్రచారం జరిగింది. దీనిపై స్పీకర్ తీవ్రంగా దృష్టి సారించి ఈ ప్రచారంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ పద్ధతులు, సంప్రదాయాలు, నియమాలకు విరుద్ధమని తెలిపారు' అని అసెంబ్లీ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి చర్యలు సభా హక్కుల ఉల్లంఘనత సమానమని ప్రకటనలో తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు మానుకోవాలని స్పీకర్ ఆదేశించినట్లు ప్రకటన తెలిపింది.

### మార్షల్ లా విధించారా..? : మెహబూబా ముఫ్తీ

ఎమ్మెల్యేలకు ఇచ్చిన నోటీసులను ప్రచారం చేయడం సభా హక్కుల ఉల్లంఘనతో సమానమని స్పీకర్ హెచ్చరించడాన్ని పీడీపీ అధ్యక్షురాలు, జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తీవ్రంగా ఖండించారు. 'అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు రతర్ సాహబ్ రాజ్యాంగ పదవిలో ఉంటూనే ఒక రకమైన మార్షల్ విధించినట్లు కనిపిస్తోంది' అని ముఫ్తీ వ్యాఖ్యానించారు. స్పీకర్ పాత్ర ఎమ్మెల్యేల హక్కులను కాపాడటమే కానీ, సెన్సార్‌లో వ్యవహరించడం కాదని అన్నారు. అసెంబ్లీ కార్యకలాపాల పారదర్శకత, వాటిపై ప్రజలకు అవగాహనను పార్లమెంటరీ పద్ధతుల ఉల్లంఘనగా చూడకూడదని చెప్పారు. 'ఎమ్మెల్యేలకు నోటీసులు, అసెంబ్లీలో ప్రశ్నలు, తీర్మానాల గురించి ప్రజలకు ముందుగానే తెలియజేయడం జవాబుదారీతనాన్ని ప్రోత్సహిస్తుంది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ బిల్లుపై నెలల తరబడి బహిరంగంగా చర్చిస్తున్నారు' అని ముఫ్తీ తెలిపారు. అలాగే తమ పార్టీ అసెంబ్లీలో ప్రవేశ పెట్టే బిల్లులకు మద్దతు ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. తీర్మానాలు, బిల్లులపై మాట్లాడవద్దని ఎమ్మెల్యేలను బెదిరించవద్దని స్పీకర్‌ను అభ్యర్థించారు.కాగా, జమ్మూకాశ్మీర్‌లో మద్యాన్ని నిషేధించాలని కోరుతూ పీడీపీ నిర్వహిస్తున్న సంతకాల ప్రచారంలో ముఫ్తీ కూడా భాగమయ్యారు. ఆదివారం ఈ ప్రచారంలో భాగంగా సంతకం చేశారు. ఈ ప్రచారాన్ని ఈ నెల 22న శ్రీనగర్‌లో పార్టీ నాయకురాలు, ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ ప్రారంభించారు.

# ఐదు నెలల తరువాత హిజ్బుల్లా నేత హసన్ నస్రల్లా అంత్యక్రియలు



### వేలాదిగా తరలివచ్చిన జనం

### ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు

**బీరుట్ (లెబనాన్) :** ఇజ్రాయిల్ వైమానిక దాడిలో మరణించిన ఐదు నెలల తరువాత హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లా అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో జరిగిన ఈ అంత్యక్రియలకు వేలాదిమంది జనం తరలివచ్చారు. ఐదు నెలల క్రితం లెబనాన్‌పై ఇజ్రాయిల్ వైమానిక దళం వందల బాంబులతో జరిపిన దాడిలో హసన్ నస్రల్లా మరణించారు. అంత్యక్రియలకు ముందు నిర్వహించిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. శవపేటికపై పువ్వులు, దుస్తులు విసిరి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లెబనాన్‌లో గత 20 ఏళ్లలో జరిగిన అతి పెద్ద అంత్యక్రియలుగా హసన్ నస్రల్లా అంత్యక్రియలను అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగర్ ఖలీబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగీలతో పాటు లెబనాన్ పార్లమెంట్ స్పీకర్, ప్రధానమంత్రి ప్రతినిధులు కూడా హాజరయ్యారు. వేలాదిగా సాధారణ ప్రజలు తరలిరావడంతో వారిలో ఎక్కువ మందికి స్టేడియంలో ప్రవేశించడానికి అవకాశం కలగలేదు. స్టేడియం బయట భారీ తెరలను ఏర్పాటు చేశారు. నస్రల్లా అంత్యక్రియలు జరుగుతున్న సమయంలోనూ ఇజ్రాయిల్ వైమానిక దళ విమానాలు తక్కువ ఎత్తులో స్టేడియంపైన ఎగిరాయి. అంత్యక్రియలకు హాజరైన జనం ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిజ్బుల్లా వ్యవస్థాపకుల్లో హసన్ నస్రల్లా ఒకరు. ఈ గ్రూపునకు దాదాపు 30 ఏళ్లపాటు నాయకత్వం వహించారు. ఇరాన్, యెమెన్, పాలస్తీనా, ఇరాక్ వంటి దేశాల్లోనూ హసన్ నస్రల్లాకు అభిమానులు, మద్దతుదారులు ఉన్నారు.

# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ

### ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం

### మొదటి రోజు వైసీపీ హాజరయ్యే అవకాశం




**అమరావతి :** ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభంకానున్నాయి. తొలిరోజు ఉదయం 10 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. ఈ సారి సమావేశాలకు భారీ భద్రతను ఏర్పాటు చేయనున్నారు. గవర్నర్ ప్రసంగం నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలుపుకుని 11మంది సభ్యులు శాసనసభ సమావేశానికి హాజరు కానున్నట్లు సమాచారం. టీడీపీసభ్యులందరూ పసుపు షర్టులు, మహిళలు పసుపు చీరెలు ధరించి సమావేశాలకు రానున్నారు. ఉదయం 9.45గంటలకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శాసనసభలోకి ప్రవేశించనున్నారు. గవర్నర్ ప్రసంగంలో 2047 విజన్‌కు సంబంధించిన అంశాలను వివరంగా పేర్కొనే అవకాశముంది. శాసనసభ, శాసనమండలిలో సభ్యులు ఎలా వ్యవహరించాలనే అనే అంశంపై జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం మంగళగిరి పార్టీ కార్యాలయంలో విధి విధానాలు వివరించారు. సమావేశ ఏర్పాట్లకు సంబంధించి ఆదివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, సీఎస్ విజయానంద్, ఏపీ డీజీపీ హరీశ్ కుమార్‌గుప్తాతో సమావేశం నిర్వహించారు. గవర్నర్ ప్రసంగం తొలిరోజు ఉన్న నేపథ్యంలో సభ్యులందరూ ఉదయం 9.30గంటల కల్లా సభ్యులందరూ సభకు హాజరుకా వాల్సిఉంటుందని శాసనసభ స్పీకర్ తెలిపారు. ఎమ్మెల్యేల వ్యక్తిగత సహాయకులు, అధికారుల వ్యక్తిగత సహాయకుల (పీఏ)కు అసెంబ్లీలోకి ప్రవేశం ఉండదని ఈ విషయంలో సభ్యులు సహకరించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసే సందర్శకులు, ప్రతినిధులు శాసనసభ ప్రాంగణంలో అనుమతించరు. సీఎంను కలవాలనుకునే వారు సీం కార్యాలయంలోనే భేటీ కావాల్సి ఉంటుంది. శాసనసభ భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పోలీస్‌శాఖను స్పీకర్ ఆదేశించారు.

**1200మంది పోలీసులతో భద్రత:**

శాసనసభ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీకి సంబంధించి 1200మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు డిఐజితో పాటు గుంటూరు, పల్నాడు ఎస్పీలు, విజయవాడ నుంచి ఒకరిద్దరు డిసిపిలు, 10మంది డీఎస్పీలు, 50మంది సిఐలు, 100మంది ఎస్ఐలతో పాటు సుమారు 1000మందికి పైగా కానిస్టేబుల్స్ విధులు నిర్వహించనున్నారు.



## జర్మనీ ఎన్నికల్లో భారీ ఎత్తున పోలింగ్

**బెర్లిన్ :** జర్మన్ జాతీయ ఎన్నికలు ఆదివారం జరిగాయి. దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. జర్మనీలో 5.92 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉండగా, వీరిలో 20 శాతం ముంది పోలింగ్ రోజుకు ముందే మెయిల్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత కాలమాన ప్రకారం ఆదివారం రాత్రి 10:30 గంటలకు ఈ పోలింగ్ ముగింది. ఫలితాలు ఆదివారం రాత్రికే వెల్లడికావచ్చునని భావిస్తున్నారు. పాఠశాలలు, కిండర్‌గార్టెన్స్, జిమ్ములు, రిటైర్‌మెంట్ హోమ్స్‌ల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. యూరప్ ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత, వలసల సమస్యలు, ఉక్రెయిన్-రష్యా మధ్య సంక్షోభం, అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న పన్నుల విధానం వంటి ప్రపంచవ్యాప్తంగా కీలక పరిణామాలు నెలకొన్న వేళ జర్మనీ ఎన్నికలు జరుగుతుండటం ఆసక్తిగా మారింది.



(ఫైల్)

## వెంటిలేటర్‌పైనే పోప్

### కొనసాగుతున్న చికిత్స

**వాటికన్ :** పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. 88 ఏండ్ల ఫ్రాన్సిస్ న్యుమోనియాతో బాధపడుతూ రోమ్‌లోని జెమెల్లి ఆస్పత్రిలో పది రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించిందని, ప్రమాదం నుంచి బయటపడలేదని వాటికన్ వర్గాలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. దీర్ఘకాలిక ఉబ్బసం, శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్నారని, ఆక్సిజన్ ఎక్కువగా అందించడం అవసరమని పేర్కొన్నాయి. ప్లేట్‌లెట్లు భారీగా పడిపోవడంతో రక్తమార్పిడి చేశారు. 'రాత్రి ప్రశాంతంగా గడిచింది. పోప్ విశ్రాంతి తీసుకున్నారు' అంటూ వాటికన్ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఫ్రాన్సిస్ యువకుడిగా ఉన్నప్పుడే ఊపిరితిత్తుల్లో భాగాన్ని తొలగించారు. ఇప్పటికీ ఆయన వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతున్నారు. జెస్యూట్ ఆస్పత్రిలో చికిత్సపై తనకు నమ్మకం ఉందని, సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి కృతజ్ఞతలని ఇటీవల పోప్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోప్ కోలుకోవాలంటూ ప్రపంచవ్యాప్తంగా క్యాథలిక్కులు, క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

## జేఈఈ (మెయిన్) పేపర్ -2 ఫలితాలు విడుదల

**న్యూఢిల్లీ :** జేఈఈ (మెయిన్) పేపర్-2 పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఫిబ్రవరి 15న ప్రిలిమినరీ కీ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు, శనివారం తుది కీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తోపాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోరు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జనవరి 30న జరిగిన ఈ పరీక్షలో బిఆర్క్‌కు 44,144 మంది, బి ప్లానింగ్‌కు 18,596 మంది హాజరయ్యారు.

## పేపర్‌ప్లేట్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

- ప్రశాంత్ నగర్ పారిశ్రామిక వాడలో ఘటన

**నవతెలంగాణ - కూకట్ పల్లి**

కూకట్ పల్లి ప్రశాంత్ నగర్ లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది, ప్రశాంత్ నగర్ లోని పారిశ్రామిక వాడలో ఉన్న పేపర్ ప్లేట్ పరిశ్రమలో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు, షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. అగ్ని ప్రమాదం జరిగిన విషయాన్ని అగ్నిమాపకశాఖ కి సమాచారం ఇచ్చారు. హుటాహుటీన రెండు అగ్నిమాపక శకటాలతో వచ్చి మంటల్ని అదుపులోకి తెచ్చారు. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన ఇంద్రజాలికులు పీసీ సర్కార్



నవతెలంగాణ-ముషీరాబాద్

తన అద్భుత ప్రదర్శనల ద్వారా భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత ఇంద్రజాలికులు పీసీ సర్కార్ అని తెలుగు రాష్ట్రాల ఇంద్రజాల ప్రముఖులు పేర్కొన్నారు. సీనియర్ పీసీ సర్కార్ జయంతి సందర్భంగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో పలువురు ఇంద్రజాలికులు పాల్గొని మాట్లాడుతూ కార్యక్రమానికి హైదరాబాద్ మెజీషి యన్స్ గ్రూప్ బాధ్యుడు రామడుగు వసంత్ అధ్యక్షత వహించగా కార్యదర్శి ఆంజనేయులు, తెలుగు మెజీషియన్స్ గ్రూప్ నేతలు అలీ, ప్రదీప్ రంగరేజ్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి కె.వీరయ్య తదితరులు పాల్గొన్నారు. పీసీ సర్కార్ బాటలో సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని ఆయనను ఆదర్శంగా తీసుకొని తెలుగు రాష్ట్రాల్లో ఇంద్రజాల రంగాన్ని మరింతగా విస్తృత పరచాలని సమావేశం తీర్మానించింది. ఇంద్రజాలంలో అనేక మెళకువలు గురించి సీనియర్ ఇంద్రజాలకులు సలహాలు సూచనలు తెలియచేశారు.

## మైనారిటీలకు సీపీఐ(ఎం) ఉర్దూ శిక్షణా తరగతులు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

మైనారిటీలకు సీపీఐ(ఎం) ఉర్దూ శిక్షణా తరగతులు ప్రారంభించామని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. ఐఎస్ సదన్ సంతోష్ నగర్ కార్యాలయంలో ఆలం ఖుంద్మీరి భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ మైనార్టీ నాయకులకు, సభ్యులకు ఉర్దూ శిక్షణా తరగతులు ఆయనతో పాటు కామ్రేడ్ శివకుమార్ బోధిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ విధి, విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు, కార్యకలా పాలపై శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ అబ్దుల్ సత్తార్, ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కామ్రేడ్ ఆబిద్ అలీ, పార్టీ సభ్యులు కలిముద్దీన్, గులాం నసీర్, అలీమ్, మహమ్మద్ అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాలి

- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



నవతెలంగాణ-ధూల్‌పేట్

మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికి భరోసా కల్పించాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. ఆదివారం యాకుత్‌పూర నియోజకవర్గం రెయిన్ బజార్ డివిజన్‌లోని ఇమిలిబన్ ప్రాంతంలో స్థానిక మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ విభిన్న పాత్రలు పోషిస్తూ ఎన్నో బాధ్యతలను నిర్వహిస్తున్నారన్నారు. కుటుంబ భాధ్యతలను మోస్తూ సభ్యులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తారన్నారు. అలాంటి మహిళలు ఆర్థిక భరోసా లేక సమస్యలు ఎదుర్కొంటు న్నారన్నారు. వారికి ఆర్థిక స్వావలంబన కలిగే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కుట్టు మిషన్లను అందిస్తూ, ఇంటి వద్దనే మహిళలు ఉపాధి పొందే విధంగా సహకారం అందిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికి ఆర్థిక భరోసా అందించాలని సూచించారు. కుటుంబానికి తన సహాయం అందితే ఆ కుటుంబం మరింత ఆర్థిక స్వేచ్ఛ పొంది సంతోషంగా ఉంటుందని అభిలాషించారు. సుమారు 25మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పూర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, స్థానిక ఎంఐఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



- కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్..

నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు సబ్జిమండి లోగల శ్రీ సాయి హై స్కూల్‌లో స్కూల్ కరెస్పాండంట్ ప్రనీత ఆధ్వర్యంలో ప్రదర్శన సైన్స్ ఎక్సపోలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రదర్శనను తిలకించి మాట్లాడుతూ.. శ్రీ సాయి హై స్కూల్ ప్రతి యేటా విద్యార్థుల సైన్స్ ప్రదర్శన, గేమ్స్ కాంపిటీషన్ తదితరవి నిర్వహించడం హర్షనీయమన్నారు. కరెస్పాండంట్ ప్రనీత మాటాడుతూ.. ఒకటవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు సుమారు 210 మంది విద్యార్థులు ప్రదర్శన పాల్గొనగా ఉత్తమ ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూల్సుంపురా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, గంగ పుత్ర సంఘం అధ్యక్షులు డి. శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకుడు ముత్యాల భాస్కర్, స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## 'భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించాలి'

- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటదాస్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటదాస్ సూచించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ప్రయివేట్ యజమాన్యాల చేతుల్లో బందీ అయిందని, విద్యా రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రభుత్వ రంగంలోనే విద్య కొనసాగాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డీఏటీఏ) ఆవిర్భావ సభ అధ్యక్షులు డా.మోహినోద్దీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎం.ఎన్.నర్సయ్య, అధ్యాపకురాలు రజిత, ఓయూ ప్రొఫెసర్ శోభలతో కలిసి ప్రొఫెసర్ వెంకటదాస్ అసోసియేషన్ లోగో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి నాణ్యమైన, నైపుణ్యత కలిగిన విద్యాను అందించే లక్ష్యంగా డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భవించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నేడు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు గణేష్, డా.సీతారాం, ప్రధాన కార్యదర్శి డా. ఉపేంద్ర కుమార్, కోశాధికారి ఓరుగంటి రమేష్, సంయుక్త కార్యద ర్శులు కుమార్, అమరనాథ్, మల్లేష్, సంయుక్త, శిరీష, పెరియార్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు తదితరులున్నారు.

## 'బాపూజీ సార్వజనిక్ వచనాలయ భూమిని కాపాడాలి'

**బాపూజీ వచనాలయ పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కోనేరు సాయికుమార్**



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నిజామాబాద్‌లోని బాపూజీ సార్వజనిక్ వచ నాలయంకు సంబంధించిన 2 ఎకరాల భూమిని కొంత మంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, వెంటనే ఆ భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలని బాపూజీ వచనాలయ పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ కోనేరు సాయికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికా రులకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్‌లో 1923 సంవత్సరంలో ఉన్న మూడు చారి త్రాత్మకమైన గ్రంథాలయాలు ఉరుకమారేడి గ్రంథాలయం, రైల్వే స్టాఫ్ గ్రంథాలయం, ఫూలంగ్ గులాంగ్ హైమదీ అంజుమన్ ఇస్తామియా దారులే ముతాలియా గ్రంథాలయంకు 1951లో బాపూజీ సార్వజనిక్ వచనాలయంగా పేరు మార్చబడిందన్నారు. వచనాలయం ద్వారా వచ్చిన అద్దె డబ్బులు రూ.80 లక్షలతో వారు తమ ఇష్టాను సారంగా 2 ఎకరాల స్థలంలో కట్టడాలను చేపడతున్నారని, సీడీఎఫ్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని గ్రంథాలయ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

## మున్నూరు కాపు కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి



- మున్నూరు కాపు రాష్ట్ర సంఘాల ధర్నా..

నవతెలంగాణ-ముషీరాబాద్

మున్నూరు కాపు కార్పొరేషన్‌కు 2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో మున్నూరు కాపు రాష్ట్ర సంఘాల ఆధ్వర్యంలో మున్నూరు కాపు నిరసన దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు ఎడ్ల రవి, వనమాల ప్రవీణ్ కుమార్, బండి సంజీవ్ కుమార్, చింతపండు మహేందర్, ఆరె దశరథం మాట్లాడుతూ కోకాపేటలోని మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించి వెంటనే నిర్మాణం చేపట్టాలన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో మున్నూరు కాపు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలని కోరారు. మున్నూరు కాపులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు రాష్ట్ర సంఘాల ప్రతినిధులు భారీగా పాల్గొన్నారు.

## 'ఎస్సీ జాబితాలోని 58 కులాలకు అన్యాయం'

- మాల మహానాడు జాతీయ కమిటీ గౌరవ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎస్సీ జాబితాలోని 58 కులాలకు అన్యాయం చేసి, మాదిగలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి నెలలో ప్రవేశపెట్టడానికి చేస్తున్న ప్రయత్నం వెంటనే మానుకోవాలని మాల మహానాడు జాతీయ కమిటీ గౌరవ అధ్యక్షులు, న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని మాల మహానాడు కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగ నిబంధనలు దిక్కరించి వర్గీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఓటు బ్యాంకు వర్గీకరణ రాజకీయాలను అడ్డుకోవాలని, జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మాక్వాన, రీజినల్ డైరెక్టర్ లకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. 338 ఆర్టికల్, క్లాజ్-9 దిక్కరించి వర్గీకరణ చేపడుతున్న కాంగ్రెస్ పై చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రపతికి సిపార్సు చేయాలని, ఎస్సీ కమిషన్ ను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న వర్గీకరణ చర్యలపై స్టే ఇవ్వాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ (డబ్ల్యూపీ నెంబర్: 3586/2025) వేసి న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ వర్గీకరణ చర్యలకు వ్యతిరేకంగా, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జే.ఎస్.రావు, ఉపాధ్యక్షులు, వల్లం సురేష్, ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్ రావు, గ్రేటర్ అధ్యక్షులు, అక్కిదాసరి రవీంద్రబాబు, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షులు, పి.సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బస్తీ దవాఖానలకు సుస్తీ

- మందులు అంతంత మాత్రమే
- సిబ్బందికి రెండు నెలలైనా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు
- సమస్యలు పరిష్కరించాలి బస్తీ దవాఖాల సిబ్బంది









నవతెలంగాణ-అంబర్‌పేట

బస్తీ దవాఖానాల్లో అన్నీ లోటుపాట్లే. డాక్టర్లు, సిబ్బందికి వేతనాలు రావు.. దవాఖానల్లో సరిపోను మందులు లేవు.. అంతా అగమ్య గోచరంగా తయారైంది. ఏడాది కాలంగా ఎప్పుడు వేతనాలొస్తాయో తెలియని అయోమయ పరిస్థితుల్లో డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు. గత రెండు నెలలుగా అసలే వేతనాలు లేవు.. వేతనాలు సరైన సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

వివరాల్లోకెళ్లితే... నగరంలో మొత్తం 169 బస్తీ దవాఖానలు ఉన్నాయి. ఒక్కో దవాఖానలో ఒక డాక్టర్, స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్ ఉంటారు. దవాఖానకు వచ్చిన రోగులను డాక్టర్ పరిశీలించి మందులు, టెస్టులు రాస్తారు. వారికి కావాల్సిన మందులను దవాఖానలోనే ఇస్తారు. అవసరమైన టెస్టులు కూడా ఇక్కడే చేస్తారు. అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తారు. ఈ సౌకర్యాన్ని గత ప్రభుత్వం కల్పించింది. అయితే ప్రస్తుతం బస్తీ దవాఖానల్లో ఈ పరిస్థితి లేదు. ఏడాదిగా ఇందులో పని చేసే డాక్టర్లు, సిబ్బందికి వేతనాలు సరిగ్గా రావడం లేదు. రెండు నెలల నుంచి అసలే రాలేదు. తమ వేతనాలు వెంటనే విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

**మందులు అంతంతే...**

బస్తీ దవాఖానల్లో గతంలో అన్ని రకాల టాబ్లెట్లు, సిరప్స్ అందుబాటులో ఉండేవి. కానీ ప్రస్తుతం చాలా వరకు మందులు అందుబాటులో ఉండడం లేదు. రోగులు వెళ్తే సరఫరా లేదు. వచ్చిన తర్వాత ఇస్తామని సిబ్బంది చెబుతున్నారు. అయితే వీరికి కావాల్సిన ఇండెంట్‌ను మాత్రం పంపిస్తున్నారు. కానీ అవసరమైన మందులు మాత్రం స్టోర్ నుంచి రావడంలేదని సమాచారం. ఇందులో ప్రధానంగా లియోని ట్రోజెన్ టాబ్లెట్లు, అమాక్స్ సిరప్, సీపీఎం సిరప్‌లు కూడా అందుబాటులో లేవు. రెండు, మూడు నెలలుగా ఈ మందుల సప్లరు అసలే లేదు. అలాగే ఈ బస్తీ దవాఖానలకు సరఫరా చేసిన డిజిటల్ బీపీ మిషన్లు కూడా సరిగ్గా పని చేయడం లేదు. ఇందులో సెల్స్ ఉంటున్నాయి. వంద మందికి బీపీ పరీక్షలు చేసేవరకు సెల్స్ అయిపోతున్నాయి. కొత్తవి కొనడానికి బడ్జెట్ లేదు. ఛార్జింగ్ సౌకర్యం కూడా లేదు. దీంతో చాలా మందికి బీపీ చెక్ చేయడం లేదు. కొన్ని దవాఖానల్లో వైఫై సౌకర్యం కూడా లేదు. దీంతో ల్యాబ్‌కు ఎఫెక్ట్ అవుతున్నది. ఇలాంటి సమస్యలు బస్తీ దవాఖానల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విన్నవిస్తున్నారు.

**బస్తీ దవాఖానాలో సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలి**



- సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్

బస్తీ దావాఖానలలో ఎంతోమంది పేద వైద్యులకి నిత్య వైద్య సేవలు అందిస్తూ చలిచాలని జీతాలతో కుటుంబం నడవక ఉద్యోగ రీత్యా బస్తీ దవాఖానాలలో పనిచేసే సిబ్బందికి సరైన టైంలో ప్రభుత్వం జీతభత్యాలు చెల్లించి వారికి న్యాయం చేయాలి.

## కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

- రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు



నవతెలంగాణ-ముషీరాబాద్

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం అని రిటైర్డ్ ఐఏఎస్ టి. చిరంజీవులు అన్నారు. తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఐదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ డెలివరీ కార్మి కుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆదివారం బాగ్ లిగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఐదవ మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీ ఇంటలెక్చు వల్స్ ఫోరం చైర్మెన్ టి.చిరంజీవిలు మాట్లాడుతూ కార్మికుల చట్టాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, కార్మికుల సంక్షేమా న్ని గాలికి వదిలేసారని ఆయన విమర్శించారు. ప్రముఖ ప్రజా ఉద్యమ నేత డాక్టర్ చెరుకు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా కార్మికుల హక్కుల కోసం అడుక్కోవడం సిగ్గు చేటన్నారు. వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు, యూనియన్ సలహాదారులు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కెవి గౌడ్, ఉద్యమకారుడు మంగిళిపల్లి శంకర్, బహుజన ప్రజాశక్తి కన్వీనర్ నల్ల లక్ష్మణ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి బుర్ర చంద్ర య్య గౌడ్, ఉపాధ్యక్షులు ఎండి యునుస్, కోశాధికారి రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్, అజయ్ రెడ్డి, నర్సింగ్, రాజేష్, రాకేష్, రాజశేఖర్, రంజిత్, సుధాకర్, సోషల్ జస్టిస్ నాయకులు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ ప్రధాన కమిషనర్, కమిషనర్ లను నియమించాలి..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆర్టీఐ ప్రధాన కమిషనర్, కమిషనర్‌లను వెంటనే నియమించాలని మేఘ గ్రేటర్ హైదరాబాద్ డెవలప్మెంట్ ఫోరమ్ కన్వినర్, గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్దం సతీష్ గౌడ్ అన్నారు. ప్రస్తుత ఎన్నో పరిణా మాలు ఎదుర వుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకొంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకుపోతున్నారన్నారు. చాలా కాలంగా ఆర్టీఐ ప్రధాన కమిషనర్, కమిషనర్‌లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. సంబంధిత సమాచార అధికారులు తగు సమాచారాన్ని ఇవ్వడం లేదని ఆరోపించారు. తదుపరి అప్పిలెట్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికిని స్పందించటం లేదన్నారు. సమాచారం కోరగానే ఇవ్వని పక్షంలో తదుపరి చర్యలు తీసుకునే కమీషనర్ లను వేడుకొనే అవకాశం కల్పించాలన్నారు.

## 'జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ఎం.సంతోష్ కుమార్'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

వెంట్రిలాక్విజంలో అందిస్తున్న సేవలకు ఎర్లీ చైల్డ్ హుడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 15న ముంబైలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎర్లీ చైల్డ్ హుడ్ కాన్ఫరెన్స్‌లో జాతీయ స్థాయి అవార్డును అందుకున్నట్లు ఇంటర్నేషనల్ వెంట్రిలాక్విజం ఆర్టిస్ట్, టెడెక్స్ స్పీకర్, వాయిస్ కోచ్ ఎం.సంతోష్ కుమార్ పేర్కొన్నారు. తాను గత 2012 నుండి యూఎస్‌ఏలో జరిగే అంతర్జాతీయ వెంట్రిలోక్విజం సదస్సుకు హాజరైన ఏకైక వెంట్రిలోక్విజం కళాకారుడినని తెలిపారు. 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' గుడ్ బిహేవియర్, టీవీ, సెల్ ఫోన్, నోట్లో వేలు పెట్టు కోవడం, పర్యావరణ పరిరక్షణ, జంక్ ఫుడ్స్ నివారణ తదితర అంశాలపై సాఫ్ట్ పప్పెట్స్ బొమ్మల ప్రదర్శనతో విద్యార్థులకు అవగాహన పెంపొందిస్తున్నామని, వాటి కృషికి అవార్డు లభించిందని చెప్పారు. తాను దివంగత పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ మార్గదర్శకత్వంలో తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీలో డిప్లొమా చేశానని, ప్రముఖ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ జి.వి.ఎస్.రాజు తనకు మార్గదర్శకులు అని ఆయన పేర్కొన్నారు.

## ఛావా చిత్రానికి విశేష ఆదరణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ మహరాజ్ జీవిత కథగా తెరకెక్కిన ఛావా చిత్రం ప్రజల నుండి విశేష ఆదరణ పొందుతుందని సనాతన ధర్మ సేన వ్యవస్థాపకుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ అన్నారు. ఆదివారం కాచిగూడలోని ఐనాక్స్‌లో ప్రదర్శిస్తున్న చిత్రాన్ని సనాతన ధర్మ సేన వ్యవస్థాపకుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ తో కలిసి గాంధీ, ఉస్మానియా వైద్య విద్యార్థులు 250 మంది చిత్రాన్ని తిలకించారు. ఈ సందర్భంగా కొప్పుల రాజశేఖర్ మాట్లాడుతూ... మహనీయుల త్యాగాలను చరి త్రపుటలో కనిపించకుండా కుట్ర చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గాంధీ, ఉస్మానియా, కామినేని,తదితర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల అవకతవకలపై చెస్ క్రీడాకారుల నిరసన

నవతెలంగాణ-ముషీరాబాద్

ఇటీవల జరిగిన రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికల్లో చెస్‌కు సంబంధం లేని వారిని ఎంపిక చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజాస్వామ్య చెస్ అభివృద్ధి, హైదరాబాద్ డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కంది రవి, అమిత్ పాల్ సింగ్, ఎ.వెంకటేశ్వరరావు, దయాభేతి, తులసి రామ్, గంగాధర్ రావులు పాల్గొని మాట్లాడుతూ కే.ఎస్. ప్రసాద్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, ఆర్థిక అవకతవకలపై ఇప్పటికే బ్యాంకు ఎకౌంటు హైకోర్టు నిలుపదల చేసిందని వారు పేర్కొన్నారు. దేశంలో చెస్ సంఘం అవకతవకలపై తొలిసారిగా ధర్నా చేపట్టామని ఈ విషయాలన్నీ ఆలిండియా చెస్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## 'నెల్లి లక్ష్మీనారాయణను పద్మశ్రీ అవార్డుకు నామినేట్ చేయాలి'

- రాష్ట్ర ప్రభుత్వానికి ముదిరాజ్ సంక్షేమ సమితి విజ్ఞప్తి





నవతెలంగాణ-హిమాయత్‌నగర్

హైదరాబాద్ నగరానికి అలనాటి నగర మేయర్ దివంగత నెల్లి లక్ష్మీనారాయణ సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డుకు నామినేట్ చేయాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నెల్లి లక్ష్మీనారాయణ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి అని, ఇప్పుడున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి ప్రస్తుత గన్ పార్కును నెల్లి లక్ష్మీనారాయణ గన్ పార్కుగా నామకరణం చేస్తూ వారి విగ్రహాన్ని పెట్టుకోవడానికి అనుమతించాలని కోరింది. ఈ మేరకు ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి కన్వీనర్ బానిస నారాయణ ముదిరాజ్, అధ్యక్షులు అల్లాదుర్గం సురేష్ ముదిరాజ్ లు మాట్లాడుతూ ముదిరాజ్‌ల విద్య, ఉద్యోగ, ఆర్థిక అవకాశాలు దెబ్బ తిస్తున్న బీసీ-డీ నుండి బీసీ-ఏలోకి మార్చి బీసీ-ఏలో రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. నెల్లి లక్ష్మీ నారాయణ అణచివేయబడిన ముదిరాజ్ కులానికి చెందినవాడు కావడం వాల్లనే ఇక్కడి ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయన్నారు. నాటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి ఆదేశాలను సైతం లెక్క చేయకుండా 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో అమరవీరు లైన విద్యార్థులను స్మరించుకోవడం కోసం ఎంసీహెచ్‌లో తీర్మానం చేసి అమరవీరుల స్మారక స్థూపానికి 23-02-1970 నాడు శంకుస్థాపన చేయడం నాటి మేయర్ నెల్లి లక్ష్మీనారాయణ ధైర్య సాహసాలకు, తెలంగాణ ప్రాంత ప్రజల పట్ల వారికి ఉన్న ప్రేమను తెలియజేస్తుందన్నారు. ఈ సమావేశంలో సమితి నాయకులు బాలుగారి నరసింహులు, కటికల శ్రీహరి, తోట సంజయ్, రమేష్, సీనేటి శ్రీనివాస్, జాన్ ముదిరాజ్, అజయ్, గోపి ముదిరాజ్, మాసాయిపేట శ్రీనివాస్, నారాయణ, అనసూయ, విజయలక్ష్మి, ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పురుషులతో సమానంగా మహిళలకు సమాన రిజర్వేషన్ కల్పించాలి

**సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు బి.పురుషోత్తం**



నవతెలంగాణ-ముషీరాబాద్

పురుషులతో సమానంగా మహిళలకు సమాన రిజర్వేషన్ కల్పించాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు బి. పురుషోత్తం అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించిన ఇంతవరకు సిగ్గు లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో నిలబడని దమ్ము లేని బీఆర్‌ఎస్ నిలదీసేది ఎక్కడిది ప్రతిపక్ష హోదాలో ఉండి ప్రజా అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించడం పక్కకు పెట్టి తన వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయం చేస్తున్న బీఆర్‌ఎస్‌కి రాబోయే కాలంలో రాష్ట్రంలో ఉనికి కాపాడుకునేందుకు ఎంత ప్రయత్నించినా శూన్యం తప్ప ఇంకేమీ మిగలదన్నారు. ఇందిరమ్మ పేర్లతో ఇండ్లు నిర్మిస్తున్న నారాయణపేటలో ఇందిరమ్మ ఇండ్లు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి అభినందిస్తూ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నియోజకవర్గానికి ముందుగా 3,500 ఇండ్లు కేటాయిస్తామన్న ప్రభుత్వం ప్రతి ఏరియాలో రేషన్‌కార్డు, రైతుబంధు ఇంది రమ్మ ఇండ్లు వెంటనే అమలు చేసి ఎన్ని కలకు రావాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండి యా తెలంగాణ రాష్ట్ర తరపున ప్రభుత్వా న్ని కోరుతున్నామని నవ సమాజ నిర్మాణ స్థాపన కోసం మహిళలకు కల్పించబడిన చట్టసభల్లో పురుషులతోపాటు సమానంగా రిజర్వేషన్లు అమలు చేయాలని మన నిధులు మనం మన గ్రామ అభివృద్ధి పొందాలంటే మంచి నాయకున్ని ఎన్నుకొని నోటుకు ఓటు అనే పేనుభూతాన్ని శ్వాశతంగా తరిమికొట్టాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేంద్రాల సేకర్ పి.సురేష్, భాను ప్రసాద్, సుజాత, ఆర్.ఝాన్సీ, నాగేంద్రమ్మ, సంధ్యారాణి, గోవింద నాయక్, ఆర్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి



నవతెలంగాణ-ముషీరాబాద్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30శాతం నిదులు కేటాయించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్ మార్క్స్ భవన్ లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పీడీఎస్‌యు జాతీయ నాయకులు పి.మహేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, కే. శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలంలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిపులు ఇవ్వలేదన్నారు. విద్యార్థులకు ఇవ్వాలసిన రూ.7500 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్‌షిప్ లు విడుదల కాక పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని యూనివర్సిటీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యాశాఖకు మంత్రిని ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఇప్పటినుండే అడ్మిషన్ల ప్రక్రియ నిబంధనలను ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారని ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం శ్రీ చైతన్య విద్యా సంస్థలు చనిపోయిన దేగల యోగానందిని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మెన్ శ్రీధర్‌ను వెంటనే అరెస్టు చేయాలని, వారి విద్యా సంస్థలను సీబీఐతో విచారణ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు పీడీఎస్‌యు ఆసిఫ్, మౌనిక, గౌతమ్, ఝాన్సీ, జాహ్నవి, రహీం తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై యధేచ్చగా బోరు..

- నిలిపివేసిన రెవిన్యూ అధికారులు... బోర్ లారీ సీజ్



**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**

వీధిలో రహదారిపై యధేచ్చగా బోరు వేస్తున్నారని పక్కా సమాచారం తెలుసుకున్న రెవిన్యూ అధికారులు అడ్డుకున్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ సంజయ్ గాంధీనగర్ లో రోడ్డు నెంబర్ 8 లో ఓ వ్యక్తి తన ఇంటి ఎదురుగా ఆదివారం బోరు వేస్తున్నాడు. ఇంటికి మూడు అడుగుల ముందు రోడ్డుపైనే బోర్ తవ్విస్తున్నాడు. స్థానికులు రెవిన్యూ అధికారులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పనులు నిలిపివేయించి బోరు సీజ్ చేశారు. డివిజన్‌లో చాలా చోట్ల ఇంటి బాల్కనీ బయటకు నిర్మించడం బోర్లు రహదారిపై వేయడం పరిపాటిగా మారిందని పలువురు బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇదే బస్తీ రోడ్ నెంబర్ 7 లోని రోడ్డు మీద బోర్ వేశారని ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను వారు కోరుతున్నారు.

## నేటి నుంచి ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ మహాసభలు

- హైదరాబాద్ సిటీ డివిజన్ అధ్యక్షులు కే జైపాల్



**నవతెలంగాణ - కూకట్ పల్లి**

ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, పోస్ట్ మెన్ అండ్ ఎంటీఎస్ తెలంగాణ సర్కిల్ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ హైదరాబాద్ సిటి డివిజన్ ప్రెసిడెంట్ జైపాల్, డివిజన్ కార్యదర్శి వెంకట్ రెడ్డి శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు. 24, 25 తేదీల్లో హైదరాబాద్ అబిడ్స్‌లోనిలక్ష్మీ నగర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరగబోతున్నాయని, ఈ మహాసభలకు ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ అర్పి సారంగ్, సురేష్ ఆర్, జనరల్ సెక్రెటరీ, మాజీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రావు, రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్ కుమార్ తదితర ముఖ్యులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో పోస్టల్ వ్యవస్థను మరింత మెరుగుపరచాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసీ, ఇండిపెండెంట్ డెలివరీ సిస్టం ను రద్దు చేయాలని,అలాగే కరోనా సమయములోని 18 నెలల డి ఏ ను విడుదల చేయాలని,ఇలాంటి అనేక తీర్మానాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. కావున సభ్యులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## ఆగి ఉన్న బస్సులో చెలరేగిన మంటలు...



- తప్పిన పెను ప్రమాదం
- పూర్తిగా దగ్ధమైన బస్సు

**నవతెలంగాణ - కుత్బుల్లాపూర్**

ఈ మధ్యకాలంలో బస్సులలో తరచుగా అగ్ని ప్రమాదాలు సంభవించడం చూస్తున్నాం. ఈ ఘటనలలో భారీగానే ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లుతున్నది. తాజాగా.. నిలిపి ఉంచిన ఒక కంపెనీకి చెందిన ప్రయివేటు బస్సు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టమైసమ్మ దేవాలయ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. నిలిపి ఉంచిన బస్సులో ఉన్నట్టుండి.. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక శాఖ సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని 1 ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేసినప్పటికీ... ఆలోపే బస్సు మంటలలో పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఎవరూ లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకొని బస్సులో మంటలు ఎలా వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-కూకట్‌పల్లి**



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీలో వాల్మీకి బోయ కిషన్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఎమ్మెల్యే పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గొప్ప వ్యక్తి అని, సంస్కృత, సాహిత్యంలో పేరెన్నికగల కవి అని, రామాయణ మహా కావ్యాన్ని రచించిన మహాకవి అన్నారు. ఆయనను సంస్కృతభాషకు ఆదికవిగా గుర్తిస్తారని, శ్లోకమనే ప్రక్రియను కనుగొని ప్రచేతసుని పుత్రుడు కాబట్టి అతడు ప్రాచేతసుడు అని కూడా ప్రసిద్ధం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, రామగుండం కార్పొరేటర్ అడ్డాల స్వామి, వాల్మీకి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రేపల్లె కష్ణ వాల్మీకి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి, బోయ నగేష్, బోయ తిమ్మప్ప, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల నేస్తం కాంగ్రెస్ అభయ హస్తం



- కాంగ్రెస్ 'కూకట్ పల్లి' ఇన్‌చార్జి బండి రమేష్

**నవతెలంగాణ - బాలానగర్**

నిరు పేదల నేస్తం కాంగ్రెస్ అభయ హస్తం అని కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పతాకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు లాల్జీ దేశాయ్, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ప్రతినెలా చివరి ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరణకు పిలుపు నిచ్చారు. ఈ మేరకు బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సందోహం మధ్య బండి రమేష్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మేరకు నాయకులు జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ జెండా ఎల్లప్పుడూ పేదలకు అండదండగా ఉంటుందన్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు కట్టి వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేయగా రాజీవ్ గాంధీ ఐటీ రంగాన్ని పీవీ నరసింహారావు సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని శరవేగంగా అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ పుష్పా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి సేవాదళ్ పార్టీ వాజిద్ పాషా, అంజాద్, ఆలయ కమిటీ సభ్యులు, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాలనీల్లో పర్యటించిన చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి

**నవతెలంగాణ - కుత్బుల్లాపూర్**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని న్యూ మాణిక్య నగర్, గార్డెన్ కాలనీలలో రోడ్డు, డ్రయినేజీ,శానిటైజెషన్, ఎలక్ట్రిక్ పోల్స్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డికి కాలనీ వాసులు తెలియజేయడంతో ఆయన కాలనీ వాసులతో కలిసి కాలనీలలో పర్యటించారు. సమస్యల అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. కాలనీ అధ్యక్షులు గోపి కృష్ణమాచార్యులు,ప్రభాకర్ రెడ్డి,చంద్రశేఖర్,శంకరా చారీ, జగన్, శ్రీకాంత్, రామకృష్ణ, ఆంజనేయులు, రామారావు అరుణ్, ఈశ్వర్,శివ,హేమంత్ తదితరులు పాల్గొన్నారు. గార్డెన్ కాలనీలో కాలనీ అధ్యక్షులు ఉప్పల వేణుగోపాల్,నీరుడు రాజేష్,బోనాల అనిల్,పెద్దింటి సాయిలు, నాగమని, సురేష్, మహేశ్వర్, సిద్దేశ్వర్, ప్రవీణ్, సందీప్, భరత్, బన్నీ, సన్నీ, సంజయ్, శ్రీకాంత్, భాస్కర్ రెడ్డి, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.



**కారుణ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం**

132 జీడిమెట్ల డివిజన్ పరిధి పైప్ లైన్ రోడ్‌లో మణిరత్నం నూతనంగా ఏర్పాటు చేసిన " కారుణ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

## రవీంద్ర భారతిలో శివ తత్వ గీతాలు శ్లోకాల నృత్యాలు..





**నవతెలంగాణ-కల్చరల్**

భం భం భోలే శంఖం మ్రోగెలే నటుడు చిరంజీవి నర్తిస్తూ చేసిన అభినయాన్ని నేపథ్యం గా తీసుకుని ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో వేదిక పై శివ తత్వ గీతాలు శ్లోకాలతో కూడిన నాట్య అంశాలతో రవీంద్ర భారతి ప్రధాన వేదిక పులకరించింది. రాబోయే మహా శివ రాత్రి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో పాతిక మంది పైగా గురువుల 200కు పైగా శిష్య బృందాలు నృత్య సంగీత నీరాజనంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సినీ నిర్మాత రామ సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలలో పండుగలు ఉత్సవాలు భారతీయతకు ప్రతిబింబాలు గా నిలుస్తాయన్నారు తెలుగు వారే కాక దేశ ప్రజలు అందరూ భక్తి భావనతో జరుపుకునే పండగ మహా శివ రాత్రి అన్నారు. మూడు రోజుల ముందుగానే భారత్ ఆర్ట్స్ అకాడమీ రవీంద్ర భారతి వేదిక పై శివ రాత్రి తత్వాన్ని దర్శింపజేసిందనీ అభినందించారు. సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ కళా కారులను గురువులను సత్కరించారు. మేము సైతం స్థాపకురాలు చకిలెం స్వప్న శ్రీనివాస్, నటులు శ్రీవాణి విక్రమ్ సంగీత నాట్య గురువులు మాధవి, విజయ్, పద్మజ, నవ్యస్రవంతి,సుధా కామేశ్వరి, చంద్ర శేఖర్, విజయ లక్ష్మి , రమా దేవి హర్షిత తదితరులు పాల్గొన్న సభలో అధ్యక్షత వహించిన సంస్థ స్థాపకుడు రమణా రావు మాట్లాడుతూ భారత్ ఆర్ట్స్ అకాడమీ భారతీయ సంప్రదాయ బద్ధమైన ప్రతి పండుగ ను వేడుక లా నిర్వహిస్తూ నేటి తరాలకు మన సంస్కృతి లోని గొప్పదనాన్ని తెలియపరిచేందుకు తమ వంతుగా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు అధ్యక్షురాలు లలితా రావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు

# వేతన వెతలు..!

- ఇంటింటి సర్వేకు ఎన్యుమరేటర్ల విధులు
- నెలలు గడుస్తున్నా వేతన చెల్లింపులో నిర్లక్ష్యం
- సాంకేతిక సమస్య పేరుతో తీవ్ర జాప్యం
- కార్యాలయాల చుట్టూ సిబ్బంది ప్రదక్షిణలు



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు వేతనాల కోసం అవస్థలు పడుతున్నారు. సర్వే పూర్తి చేసి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు వారికి వేతనం చెల్లించలేదు. రోజువారీ టార్గెట్లు విధించి మరీ లక్ష్యం పూర్తి చేయించుకుని వేతనాల చెల్లింపులో మొండి చెయ్యి చూపిండంతో సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్నికల్ పేరుతో వేతనాలు చెల్లించకుండా తప్పించుకుంటున్నారని ఎన్యుమరేటర్లు చెబుతుంటే.. లిస్ట్ ప్రభుత్వానికి పంపించాం ఇంకా డబ్బులు రాలేదని అధికారులు అంటున్నారు. దీంతో అధికారుల చుట్టూ తిరిగి వేసారిన ఎన్యుమరేటర్లు కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపగా.. బోడుప్పల్‌లో మున్సిపల్ కమిషర్‌కు వినతిపత్రం అందజేశారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 9 మున్సిపాల్టీలు, 4 కార్పొరేషన్లు, 5 మండలాల్లో 2,780 మంది ఎన్యుమరేటర్లు, 270 మంది సూపర్‌వైజర్లు ఇంటింటి సర్వే కోసం విధులు నిర్వహించారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 కుటుంబాలను రోజుకు 10 కుటుంబాల చొప్పున సర్వే చేయాలని టార్గెట్ విధించి మరీ సర్వే చేయించారు. సర్వే చేసే క్రమంలో వీరు సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు అధికారులు తమ పరిధిలో ఇన్ని కుటుంబాల సర్వే పూర్తయిందంటూ గొప్పలు చెప్పుకుంటూ నివేదికలను ఉన్నతాధికారులకు అందించారు. ఇదే ఉత్సాహం వేతనం చెల్లింపులో మాత్రం చూపించడం లేదని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు చెబుతున్నారు.

**పని చేయించుకుని పైసల ఊసే లేదు..**

ఇంటింటి సర్వే ప్రారంభానికి ముందు ఎన్యుమరేటర్లుగా విధులు నిర్వహించే వారికి ఒక్కొక్కరికి రూ.10వేలు, సూపర్‌వైజర్లకు ఒక్కోరికి రూ.12వేలు వేతనంగా చెల్లిస్తామని అధికారులు చెప్పుకొచ్చారు. జీహెచ్ఎంసీ సిబ్బందితోపాటు అంగన్‌వాడీ, ఆశా, ఆర్పీ, ప్రైమరీ స్కూల్ అధ్యాపకులు ఈ సర్వే కోసం ఎన్యుమరేటర్లుగా పని చేశారు. తీరా టార్గెట్ పూర్తి చేశాక డబ్బులిస్తామన్న అధికారులు, దాదాపు రెండు నెలలుగా ఆ ఊసే ఎత్తడం లేదు. టార్గెట్లు విధించి మరీ పనులు చేయించుని తీరా డబ్బులు అడుగుతుంటే రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీయడం తప్ప, నెలలు గడుస్తున్నా నేటి వరకు తమకు డబ్బులు రాలేదని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 13 మున్సిపాల్టీల్లో పని చేసిన సిబ్బందికి దాదాపు రూ.3.84 లక్షలు చెల్లించాల్సి ఉంది.

**పలు నిరసనలు ఇలా..**

తమ డబ్బులు తమకు ఇప్పించాల్సిందిగా రోజుల తరబడి సర్కిల్ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో తాజాగా ఎన్యుమరేటర్లుగా విధులు నిర్వహించిన వారు నల్ల బ్యాడ్జీలు ధరించి కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట తెలిపారు. ఎన్యుమరేటర్లు వేతనాల కోసం ఇటీవల కలెక్టరేట్‌లోని ప్రజావాణిని ముట్టడించారు. రోజు వారీ టార్గెట్లు విధించి అనుకున్న లక్ష్యం పూర్తి చేసుకున్న అధికారులు టెక్నికల్ పేరుతో వేతనాలు చెల్లించకుండా తప్పించుకుంటున్నారని ముందుగా ప్రజావాణిలో ఆ తర్వాత జిల్లా ప్రణాళిక సంఘం కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇటీవల బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్‌కు సైతం వినతిపత్రం అందజేసి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

**సమస్యల సాకుతో నిర్లక్ష్యం..**

ఎన్యుమరేటర్లుగా పని చేసిన వారికి డబ్బులు చెల్లించేందుకు ఇప్పటికే వారి వద్ద నుంచి అకౌంట్ వివరాలను అధికారులు సేకరించారు. అయితే అకౌంట్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి అని చెప్పడంతో కొందరు మరొక అకౌంట్ నెంబర్ సైతం ఇచ్చారు. అయినప్పటికీ వారికి నేటి వరకు డబ్బులు అందలేదు. ఎందుకని ప్రశ్నిస్తే టెక్నికల్ ఎర్రర్ వల్ల డబ్బులు రావడం లేటవుతుందనీ, మరి కొద్ది రోజులు వేచి ఉండాలని అధికారులు చెబుతున్నట్టు సమాచారం.



## హిందూ ముస్లింలు సోదర భావంతో మెలగాలి

- కార్పొరేటర్ రావుల శేషగిరి

**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**

హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ బేకరీగడ్డలో గల దర్గా (సందల్)గందోత్సవ వేడుకలకు హాజరై ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతకు ప్రతీకగా ఈ వేడుకలు నిలుస్తాయని తెలిపారు. దర్గా కమిటీ సభ్యులు,స్థానిక మైనారిటీ నాయకులు పర్వీజ్, అఫ్జల్,ఫరీద్,యాసిన్,గఫార్ దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## జగదీశ్వర్ గౌడ్‌కు అభినందనల వెల్లువ

**నవతెలంగాణ-కూకట్‌పల్లి**

నూతన గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన,కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్‌కు కాంగ్రెస్ శేర్లింగంపల్లి వైస్ ప్రెసిడెంట్ కూన సత్యం గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్. ఆల్విన్ కాలని డివిజన్ కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగదీశ్వర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం చాలా సంతోషంగా ఉందని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి జగదీష్ చేసే కషికి ఎల్లప్పుడూ తాము తోడుంటామని ఆమె పేర్కొన్నారు. యశ్వంత్, మధు, అనురాధ, గాయత్రి, మణమ్మ లీల తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే

**నవతెలంగాణ - జగద్గిరిగుట్ట**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయ 2వ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఒగ్గు కళాకారుల సంగీత వాయిద్యాల మధ్య అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అనుగ్రహం నియోజవర్గ ప్రజలందరిపై ఉండాలని కోరారు. అమ్మవారి ఆలయ 21వ వార్షికోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.బాలయ్య నగర్ ప్రెసిడెంట్ నగేష్,ఆలయ కమిటీ అధ్యక్షులు శ్యాంసుందర్, గంగారాం, ప్రేమ్ కుమార్, బాలాజీ, చిన్న, నాగరాజు, హన్మంత్,బుచ్చిరెడ్డి,ఏనుగుల శ్రీనివా స్ రెడ్డి, షాకీర్, కృష్ణ యాదవ్, తాఫిక్, చోటు,భక్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ వార్షికోత్సవంలో పుప్పాల భాస్కర్

**నవతెలంగాణ - కుత్బుల్లాపూర్**

సురారం 129 డివిజన్ పరిధిలోని న్యూ శివలయనగర్‌లోని ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు ప్రజలందరిని చల్లగా చూడాలని, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలు కలిగించాలని వేడుకున్నట్టు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ముకుంద రావు ఆకుల రాజకుమార్ ప్రసాద్ నాయుడు డేవిడ్ , గోపాల్, అంజన్యులు, మూర్తి, రాజు, రాకేష్, నందు తదితరులు పాల్గొన్నారు.

## విరజ ఫ్రిల్స్ ఉమెన్స్‌వేర్ స్టోర్ ప్రారంభం

**నవతెలంగాణ-సిటీబ్యూరో**



ఫ్యాషన్ ప్రియుల కోసం లేటెస్ట్ ట్రెండ్స్‌తో అతి తక్కువ ధరలతో విరజ ఫ్రిల్స్ ఉమెన్స్‌వేర్ స్టోర్ కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలో తమ సరికొత్త స్టోర్‌ను ప్రారంభించింది. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్‌తోపాటు ఆఫర్లు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మిసెస్ మిటాలీ మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత-2025 మాట్లాడుతూ విరజ ఫ్రిల్స్ సరికొత్త ఉమెన్స్‌వేర్ ఫ్యాషన్ స్టోర్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ ఉమెన్స్‌వేర్ అన్ని ట్రేడి కలెక్షన్స్ ఉన్నాయని తెలిపారు. కూకట్‌పల్లి దగ్గరలో ఉండే వారికి లేటెస్ట్ డ్రెస్సులను అతి తక్కువ ధరకు మంచి కలెక్షన్స్ పొందొచ్చు అని తెలిపారు. రీసెంట్‌గా మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. సెప్టెంబర్‌లో జరిగే మిసెస్ ఇండియా ఫ్యాషన్‌లో పాల్గొంటాననీ, అక్కడ విజయం పొందాలి అనుకుంటున్నానని తెలిపారు. ఈ స్టోర్ స్మార్ట్ క్యాజువల్స్, బిజినెస్ క్యాజువల్లతో మహిళల సరికొత్త స్టయిల్ కోసం లేటెస్ట్ ట్రేడింగ్ కలక్షన్స్ అందిస్తుందని తెలిపారు. ఉమెన్స్‌వేర్‌లో అన్ని రకాలుగా నైట్ వేర్, డైలీ డ్రెస్, చిన్న పిల్లలు, యువ కస్టమర్ల కోసం అధునాతన, సౌకర్యవంతమైన దుస్తులను అందిస్తున్నామని విరజ ఫ్రిల్స్ నిర్వహకులు అనుషా నామా, రాకేశ్ బాబు పొంటగాని తెలిపారు.

## 'సంతానోత్పత్తికి పోషకాహారం కీలకం'

- ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రిజ్వానా అత్తర్



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

సంతానోత్పత్తి విషయంలో సమతుల ఆహారానికి అత్యంత ప్రాధాన్యత ఉందని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రిజ్వానా అత్తర్ పేర్కొన్నారు. పోషకాలతో నిండిన ఆహారం గర్భధారణ అవకాశాలను పెంచుతుందని వివరించారు. అలాగే మెరుగైన ఆరోగ్యం కూడా సంతానోత్పత్తికి అవసర మనీ, గర్భధారణకు ముందు, ఆరోగ్యకరమైన గర్భధారణ సమయంలో శరీరాన్ని సిద్ధం చేయడంలో పోషకాహార పద్ధతులను పాటించాలన్నారు. కొన్ని పోషకాలు తల్లి, పిండం ఆరోగ్యానికి ఎంతో కీలకమని చెప్పారు. సంతానో త్పత్తికి పోషకాహారం అంటే కేవలం ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమ కాదనీ, పునరుత్పత్తి జీవ ప్రక్రియలను కూడా మెరుగుపర్చడానికి, ఆరోగ్యకరమైన శిశువు పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. గర్భిణులకు పోషక అవసరాలు వివిధ రకాల విటమిన్లు, ఖనిజాలు, స్థూల పోషకాలను కలిగి ఉంటాయని తెలిపారు. వీటిలో ముఖ్యమైన అంశాలలో ఫోలిక్ ఆమ్లం, ఇనుము, కాల్షియం, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉన్నాయనీ, ఇవి తల్లి, బిడ్డ శ్రేయస్సులో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వెల్లడించారు. గర్భధారణ ఫలితాలను మెరుగుపర్చడానికి, సాధారణ తల్లి శ్రేయస్సును నిర్ధారించడానికి ఈ పోషకాల సమతుల్యత వినియోగం ముఖ్యం అని తెలిపారు.

## రికార్డుకెక్కిన ఆనంద లక్ష్మి 12 గంటల గానం



**నవతెలంగాణ-కల్చరల్**

గాయని వొక్కరే సహా గాయకులు పదుల సంఖ్యలో. పన్నెండు గంటల పాటు నిర్విరామ గానం తో ప్రేక్షకులచే ప్రశంస పొందారు. ఈ అపురూప విన్యాసం కు త్యాగరాయ గానసభ ప్రధాన మందిరం వేదికైనది. ఢీ భారతీ మణి ఫౌండేషన్ ఆనంద్ లహరి కల్చరల్ ఈవెంట్స్ ఆరంభం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వర్ధమాన గాయని ఆనంద లక్ష్మి ఉదయం 8.05 నిమిషాలకు తన గానం ఆరంభించి రాత్రి 8.30 వరకూ నిరాటకంగా కేవలం 15 నిమిషాలు వ్యవధి ఇస్తూ 12 గంటల పాటు సినిమా పాటలతో పాటు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ప్రారంభం లో వున్న స్వరం వలే చివరి వరకు గళంలో మృదుత్వం మాధుర్యం తగ్గకుండా పాడి రికార్డ్ కెక్కారు. చిత్ర బాల సుబ్రహ్మణ్యం లు కోటి, ఇళయ రాజా సంగీత దర్శకత్వం లో ఆలపించిన 120 పాటలు ఆనంద లక్ష్మి ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో గాయని ఆనంద లక్ష్మి కి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్టు ప్రతినిధి ప్రకటించి యోగ్యత పత్రం అందజేశారు. కార్యక్రమాన్ని గాయకుడు దేవేందర్ గౌడ్ పర్యవేక్షణ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ గాన సభ ఆనంద పండుగ జరిగిందన్నారు. ఆనంద లక్ష్మి గళం లో చిత్ర సుశీల జానకి లే కాదు లతా మంగేస్కర్ స్వరం కూడా పలుకుతుందని అభినందించారు. వేదిక పై బీజేపీ నాయకుడు వంశీ కృష్ణ ప్రముఖ గాయకుడు త్రినాథ రావు, సామాజిక కార్యకర్త వెంకట రావు తదితరులు తమ అభినందన తెలిపారు.

## జాతీయ ఓబీసీ అధ్యక్షులుగా గూడ ఐలయ్య గౌడ్

**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**



జాతీయ ఓబీసీ అధ్యక్షులుగా జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన ఐ. ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం కార్యాలయంలో రాష్ట్రీయ దళిత సేన వ్యవస్థాపక చైర్మన్,విశ్రాంత ఐఏఎస్ జే.బి.రాజు చేతులమీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమ నేత,వామపక్ష ఉద్యమ కార్యకర్త ప్రజా సేవకులు,సమజ సమాజ స్థాపన కోసం నిరంతరం పోరాటం చేసిన కార్మికుల హక్కుల కోసంపేద ప్రజల పక్షాన నిలబడి రోటి కపడా మఖాన్ నినాదంతో పేదల కోసం పోరాటంలో జైలు కెళ్ళి జైలు జీవితం గడిపిన ఉద్యమ నేత ఐలయ్య గౌడ్‌ను నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన జరిపి కులాల వారీగా అధికారం దక్కాలని ఎస్సీ వర్గీకరణ,బీసీ జనాభా రిజర్వేషన్ ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి కి అభినం దనలు తెలిపారు. ఐ.ఎన్.టి. యు.సి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి,ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర అధ్యక్షులు గుంజా శ్రీనివాస్,జాతీయ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు భూదాల అమర్ బాబు,రాష్ట్రీయ దళిత సేన జాతీ య అధ్యక్షులు జేమ్స్,ప్రధాన కార్యదర్శి వై.రాజు,దళిత ఐక్యవేదిక ఎన్.వై.అశోక్, జై భీమ్ సేన కన్వీనర్ ఎం. ఆంజనే యులు,మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, కాంగ్రెస్ నాయకులు మునిపల్లి జనార్ధన్ తదితరులు శాలువాతో సన్మానిస్తూ అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
సోమవారం | ఫిబ్రవరి 24, 2025 | www.navatelangana.com



# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నవతెలంగాణ-హయత్‌నగర్**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సరూర్నగర్ విద్యుత్ డీఈ రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11 కెవి రాక్ టౌన్ ఫీడర్.. రాక్ టౌన్, లలిత నగర్, అయ్యప్ప కాలనీ పరిసర ప్రాంతాల్లో, 11కెవి గణేష్‌పురి ఫీడర్.. రామాలయం, ఇందిరా నగర్, గణేష్ పురి, దిల్‌సుఖ్‌నగర్ ద్వారకాపురం పరిసర ప్రాంతాల్లో, 11 కెవి సాయి నగర్ ఫీడర్.. కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, సాయి నగర్ హట్స్, లలిత నగర్ పరిసర ప్రాంతాల్లో, 11 కెవి డెంటల్ కాలేజ్ ఫీడర్.. హుడా కాలనీ మెయిన్ రోడ్డు, మోర్ బ్యాక్ సైడ్, డీసీబీ బ్యాంక్, డెంటల్ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

# కార్పొరేటర్‌ను కలిసిన కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు



**నవతెలంగాణ-హస్తినాపురం**

హస్తినాపురం డివిజన్ పరిధిలోని విజయ దుర్గ కాలనీ, శ్రీ బాలాజీ కాలనీ, డైమండ్ కాలనీ, అలాక్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆదివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత ఆయా కాలనీలో నెలకొన్న సమస్యలను వారు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సుజాత నాయక్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీల అభివృద్ధి కోసం జీహెచ్ఎంసీ, ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, మాన్కోటియ, భాస్కర్ రెడ్డి, సిరాజ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం





- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- వాదే ఉమర్ కాలనీలో క్రికెట్ మైదానం ప్రారంభం

**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

నేటి సమాజంలో యువతకు క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు మనోధైర్యం కలుగుతుందని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబిత ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గంలోని జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న వాదే ఉమర్ కాలనీలో బాక్స్ క్రికెట్ మైదానాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితమ్మ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడా రంగంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు మనోధైర్యం కలుగుతుందని తెలిపారు. క్రీడల్లో రాణించటం వలన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంటారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలో నూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ అబ్దుల్లా సాధి, మాజీ వైస్ చైర్మెన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, కౌన్సిలర్లు శంషుద్దీన్, దస్తగిరి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శంషుద్దీన్, హమీద్ అలీ, మన్సూరి, మిరాజ్ భాయ్, మతిన్ పటేల్, సయ్యద్ జిషన్, మగ్దూం బాయ్, మాహేశ్వరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, జల్ పల్లి సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ అబ్బాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మారింది నేతల రాతలే..

# మా తలరాతలు కాదు..

తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించింది. 2021లో కేవలం కొందరికి మాత్రమే రేషన్ కార్డులు జారిచేసింది. అంతేకాదు పింఛన్లు, డబుల్ బెడ్ రూం ఇండ్లను కూడా కొందరికే అందజేసింది. ప్రజా ప్రభుత్వం అయినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రేషన్ కార్డులు ఇస్తామని రేపు, మాపు అంటూ పబ్బం గుడుపుతోంది. రేషన్ కార్డు లేని ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో మళ్ళీ దరఖాస్తులు చేసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుంది తప్ప.. ఇప్పటికీ జారీ చేసిన పాపాన పోలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు అవకాశం లేదు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి డబుల్ బెడ్ రూమ్ అయినా ఇవ్వాలని చాలామంది బాధితులు వాపోతున్నారు. హయత్ నగర్ సర్కిల్ పరిధిలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అందజేయలేదు. 200 యూనిట్ల ఉచిత కరెంటు చాలా మందికి అమలు కావడం లేదని దారిద్ర్య రేఖకు దిగువనున్న పేద కుటుంబాలు వాపోతున్నాయి. ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు పేదలకు అందడం లేదని చెబుతున్న పేదల మాటల్లో...

నవతెలంగాణ-హయత్‌నగర్/నాగోల్

**ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు..**

పెన్షన్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న. ఇప్పటికీ తనకు పెన్షన్ రావడం లేదు. దీంతో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది.



- ఏ. పాండు, నాగోల

**పక్షవాతం వచ్చి ఏడేండ్లు.. పెన్షన్ రావడం లేదు**

బీపీ ఎక్కువై నాకు పక్షవాతం వచ్చి ఏడు సంవత్సరాలు అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచిన తనకు వికలాంగుల పెన్షన్ రావడం లేదు. నాగోల్ డివిజన్ ఎరుకల నాంచారమ్మ బస్తీకి చెందిన శంకరమ్మ ఆవేదన..



- శంకరమ్మ

**రోడ్డు ప్రమాదంలో నా భర్త చనిపోయి మూడేండ్లు**

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓ రోడ్డు ప్రమాదంలో నా భర్త చనిపోయి మూడేండ్లు అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో గానీ తనకు వితంతు పింఛన్ అందడం లేదు. ప్రభుత్వం పున పరిశీలన చేసి ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు నాలాంటి పేదలకు అందేలా చూడాలని కుంభం బాలమ్మ విజ్ఞప్తి..



- బాలమ్మ

**కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎటువంటి పరిష్కారం కనిపించడం లేదు**

అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు లింక్ పెట్టారు. కానీ రేషన్ కార్డులను మాత్రం మంజూరు చేయడం లేదు. ఏ ప్రభుత్వాలు అయినా పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆఫీసులు, మీ సేవల చుట్టూ తిప్పుతూనే ఉన్నారు. వాళ్ళ సమయం, డబ్బులు వృథా అవుతూనే ఉన్నాయి. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా వాటన్నింటికీ ఎలాంటి పరిష్కారం కనిపించడం లేదు.



**బొడ్డుపల్లి కృష్ణ, రజక వృత్తిదారుల సామాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**కాంగ్రెస్ మాకు ఇచ్చింది ఏమీ లేదు**

ఎన్నికల ముందు చెప్పినట్లుగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాకు ఇచ్చింది ఏమీ లేదు. గ్యాస్ సబ్సిడీ మాకు రావడం లేదు. పెన్షన్ పెంచుతామని చెప్పి సంవత్సరం గడిచిపోయింది. అదేవిధం గా ఉచిత కరెంటు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ జీరో బిల్లు రావడం లేదు. పేద ప్రజలకు కావాల్సింది ఉచిత బస్సు కాదు.. తినడానికి తిండి, ఉండడానికి గూడు, మెరుగైన వైద్యం, పేద పిల్లలకు చదువును అందిస్తే చాలు.. అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఇందిరమ్మ ఇల్లుకు దరఖాస్తు చేసుకున్నాను. అదైనా వస్తుందో లేదో చూడాలి మరి.



- **మంగమ్మ, బండ్లగూడ**

**రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారు**

సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది జీరో. నేడు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటున్నారు అది పచ్చి బూటకం. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్న కేసీఆర్ లాంటి నాయకత్వం అవసరం. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలొచ్చినా కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.



**సతీష్ యాదవ్, నాగోల్**

**పేదలకు రేషన్ కార్డు ప్రామాణికం**

మా లాంటి పేదలకు ప్రతి దానికీ రేషన్ కార్డును ప్రభుత్వం ప్రామాణికం చేస్తుంది. సంవత్సరాలు గడుస్తున్నా నాకు ఇప్పటి వరకూ రేషన్ కార్డు లేదు. ప్రభుత్వం చెప్పిన 200 యూనిట్లు కూడా అందడం లేదు. మా కుటుంబంలో ఇద్దరే ఉంటున్నా కూడా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు మా లాంటి పేదలకు అందేలా చూడాలని విజ్ఞప్తి.. చేస్తున్న గండికోట వెంకటమ్మ..



- వెంకటమ్మ

**భర్త చనిపోయి 10 ఏండ్లు అయినా పెన్షన్ అందడం లేదు**

నా భర్త అనారోగ్య కారణంతో 2013లో చనిపోయాడు. ఇప్పటికీ నాకు వితంతు పెన్షన్ అందడం లేదు. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా పాలనలో నా పిల్లల పేర్లు చేర్చాలని దరఖాస్తు చేసుకొని ఏడాది అయినా రేషన్ కార్డుల్లో ఇంకా పేర్లు కూడా నమోదు కాలేదు. ఎరుకల నాంచారమ్మ బస్తీకి చెందిన కుటుంబ సమ్మక్క ఆవేదన..



- సమ్మక్క

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదు**

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. డబుల్ బెడ్ రూమ్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకుంటే ఇల్లు రాలేదు. ప్రజా ప్రభుత్వమైనా కాంగ్రెస్ పార్టీలో అయినా ఇల్లు వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న. రేషన్ కార్డులో నా పిల్లల పేర్లు ఇప్పటికీ చేరలేదు. రేషన్ కార్డులు, డబల్ బెడ్ రూమ్ తనకు మంజూరు అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేసిన పూజారి అనిత..



- అనిత

## మహిళ అదృశ్యం



**నవతెలంగాణ-హయత్‌నగర్**

ఓ మహిళ అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్‌లో నివాసం ఉండే నోముల అలివేలు (43).. ఈ నెల 2న హయత్ నగర్, ప్రగతి నగర్‌లో ఉండే బంధువుల ఇంటికి వచ్చింది. ఆమెకు మతిస్థిమితం లేకపోవడంతో ఈ నెల 22న బంధువుల ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# 'ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరం'



**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

నేటి సమాజంలో ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరికీ కరాటే ఎంతో అవసరమని కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఎల్మేటి అమరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ కంబ్యాట్ స్కూల్ ఆఫ్ మ్యార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే విద్యను నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు అహ్మద్ బామ్, కరాటే కోచ్‌లు, ఓమర్ బిన్, హఫీజ్ ఐజాజ్ అహ్మద్, హలీం, జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మరక్షణకు కరాటే విద్య అందరికీ అవసరం**

నేటి సమాజంలో ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతో అవసరమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు గ్రేడింగ్ బెల్టులను మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విద్యార్థులు కృషి పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్టు బాలకృష్ణ, మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ జి.నాగరాజు, మాస్టర్స్ జి.శివ, డి.మంజునాథ్, కె.సంగీత, బాలాజీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతోనే మానసిక ప్రశాంతత

ఎడ్ల వాసుదేవరెడ్డి

**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

యువతకు క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎడ్ల వాసుదేవ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్



పరిధిలో ఉన్న మామిడిపల్లిలో ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎడ్ల వాసుదేవ రెడ్డి ప్రారంభించారు. బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 45 రోజుల పాటు కొనసాగనున్న ఈ టోర్నమెంట్లో మొత్తం ఏడు జట్లు పాల్గొంటున్నాయి. మామిడిపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారి ఎడ్ల వాసుదేవారెడ్డి హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. రెడ్ బుల్స్, మామిడిపల్లి సూపర్ కింగ్స్, నైట్ వాకర్స్, టీం జగన్, బెంగాల్ టైగర్స్, కింగ్ ఫిషర్, ఆర్బీఎం వారియర్స్ తదితర జట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి. విజేత జట్టుకు రూ.35వేలు, రన్నరప్కు రూ.25 వేల నగదు పురస్కారాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా వాసుదేవా రెడ్డి మాట్లాడుతూ.. మామిడిపల్లి గ్రామంలో యువకులంతా ఏకతాటిపైకి వచ్చి క్రికెట్ ఆడడం అభినందనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా గొడవలకు తావులేకుండా ఆడుతూ క్రీడాస్ఫూర్తిని నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుక్క శివ కుమార్, నాయకులు ఈరంకి విశ్వనాథ్ గౌడ్, మహ్మద్ నయీం, నరేందర్ యాదవ్, లిక్కి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంత్ గాడ్గే జయంతి వేడుకలు



**నవతెలంగాణ- ఎల్బీనగర్**

సంత్ గాడ్గే జయంతి వేడుకలను నాగోల్‌లోని మన ఆలోచన కార్యాలయంలో పెద్దవూర బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మన ఆలోచన వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు, పూస నరసింహా బెస్త, రేవల్లి నరేష్, గౌరీ, పుష్పలత, రత్నం, శ్రీనివాస్ అడ్వకేట్, వినయ్ కుమార్ రజక, బచాబోయిన శ్రీనివాస్, అందేపాటి రమేష్, వేముల కొండల్, వేముల రమేష్, రజక సంఘం ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్కనపల్లి గణేష్, ఉపాధ్యక్షులు రావుల వెంకట రాములు, ప్రధాన కార్యదర్శి కేతురు రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ దుదిగామ వీరన్న, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు చందు, గౌడ సంఘం కన్వీనర్ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్**

ఆర్కేపురం చౌరస్తా వద్ద బీసీ కులాల ఐక్య వేదిక కార్యదర్శి పగడాల ఎల్లన్న అధ్వర్యంలో ఆదివారం గాడ్గే బాబా 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజా సేవకులు యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు



**నవతెలంగాణ-కొత్తపేట**

కొత్తపేటలోని మల్లేశ్వర రాజేశ్వరి రాష్ట్ర మహిళా కన్వీనర్ ఆధ్వర్యంలో సంత్ గాడ్గే జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తర్వాత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజకుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు

లర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ పగడాల శ్రీశైలం, యాదవరెడ్డి, పెద్దవూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, లింగుస్వామి గౌడ్, అంజన్ రావు, చిలుక రాజు, సాయి జగదీష్, నగేష్, పగిళ్ల అంజి, సాయి, ప్రశాంత్, విప్లవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# పిల్లల భద్రతా అవగాహనకు సంకల్ప్ సురక్ష రన్

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

పిల్లల భద్రత, విద్యను పెంపొందించే ప్రయత్నంలో సంకల్ప్ అనే రిజిస్టర్డ్ ఎన్జీవో ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో సంకల్ప్ సురక్ష రన్‌ని నిర్వహించింది. ఇందులో 1,700 మంది ఉత్సాహవంతులు పాల్గొన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం 2016 నుంచి 2022 వరకు పిల్లలపై లైంగిక హింసలో 96 శాతం పెరిగినట్టు వెల్లడించే భయంకరమైన గణాంకాలకు ప్రతిస్పందనగా ఈ రన్ నిర్వహి ంచారు. ఈ కార్యక్రమాన్ని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి.జోయెల్ డేవిస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి ఇది మనం పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాల్సిన సమ యం అని ఉద్ఘాటించారు. సంకల్ప్ వ్యవ స్థాపకులు, అధ్యక్షురాలు హేమలత విజయ రాఘవన్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యా లకు అనుగుణంగా పిల్లల భద్రత, పిల్లల లైంగిక వేధింపుల నివారణకు తక్షణ ఆవశ్యకత గురించి అవగాహన పెంచడం సంకల్ప్ లక్ష్యం అని తెలిపారు. "సంకల్ప్ సురక్ష రన్ కోసం ఉద్దేశించిన ఆలోచన బలహీనమైన పిల్లలు మరియు కమ్యూనిటీలతో కలిసి పని చేయాలనే మా నిబద్ధత నుంచి ఉద్భవించింది" అని తెలిపారు. సురక్షితంగా భావించే పిల్లవాడు పెద్దగా కలలు కనే, వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించగలడు అనీ, ప్రతి బిడ్డకూ దీన్ని నిజం చేద్దాం" అని తెలిపారు. ఎస్‌సీఎస్‌సీ జనరల్ సెక్రెటరీ రమేష్ కాజా మాట్లాడుతూ "పిల్లల భద్రతను నిర్ధారించడం కేవలం ఒక బాధ్యత కాదు. అది నైతిక విధి. సంకల్ప్, ఎస్‌సీఎస్‌సీ సహకారం ద్వారా మేం ప్రతి బిడ్డకూ రక్షణ, సాధికారత గల భవిష్యత్తును నిర్మిస్తాం" అని తెలిపారు.



## మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

రిలయన్స్ మెడికల్ యాజమాన్యం వాజిద్ ఇలియాస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బోయిన్‌పల్లిలో ఈద్గా వద్ద మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. పలు రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్ బాయ్ సీనియర్ నాయకులు కర్రే జంగయ్య పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపులో కార్పొరేటర్



**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**

సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంపును కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సందర్శించి హెల్త్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఫ్రీ హెల్త్ చెకప్ కార్యక్రమం నిర్వహించడం వల్ల ఇక్కడున్న పేదలకు ఎంతో ఉపయోగం అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి



- **సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్**

**నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్**

ప్రజలకు అందుబాటులో ఉంటూ డీఎస్ఎం కాలనీ నూతన అభివృద్ధి కమిటీ సభ్యులు కృషి చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ లోని డీఎస్ఎం కాలనీ అభివృద్ధి కమిటీకి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. కాలనీకి సంబంధించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీ చైర్మెన్ నోమానోద్దీన్, అధ్యక్షుడు జమీర్, ప్రధాన కార్యదర్శి మన్నన్, ఉపాధ్యక్షుడు శంషేర్, అబ్దుల్ రహీం, సర్దార్ తదితరులు ఉన్నారు.

## బస్తీలో పర్యటించిన ఆదం



**నవతెలంగాణ-ఓయూ**

గత పదేండ్లుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం. సంతోష్ కుమార్ ఆదివారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధ నగర్ బస్తీలో ప్రజలకు ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా అయన ఎక్కడ చూసినా ప్రజల సమస్యలు స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని చెబుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా, ఉపసభాపతిగా పనిచేసిన స్థానిక ఎమ్మెల్యే పద్మారావు నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసారని ఆదం దుయ్యబట్టారు. తను బస్తీలో పర్యటిస్తుంటే ఎక్కడ చూసిన ప్రజలు వాళ్ళ యొక్క సమస్యలు చెబుతున్నారు. తమ సమస్యలు పరిష్కారం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఇంజినీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, ఎలక్ట్రికల్ విభాగం, వాటర్ వర్క్స్ విభాగం అధికారులతో చర్చించి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సృజన్ కుమార్, డివిజన్ అధ్యక్షులు అనిల్ కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అమర్‌నాథ్ గౌడ్, షకీల్ బాయ్, వహీద్, బబ్లు, శ్రీకాంత్, లడ్డు, అలీమ్, నాయకులు, కార్యకర్తలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## మురారిపల్లి 'డబుల్' ఇండ్లలో వసతులు కల్పించాలి

- **సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్**



**నవతెలంగాణ-ముషీరాబాద్**

శామీర్‌పేట్ మురారిపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) నగర కార్యాలయంలో సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఇండ్ల వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేశారని, గత ప్రభుత్వం లాగా రేవంత్ రెడ్డి కూడా నిర్లక్ష్యం చేయకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు వసతులు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయిన నేటి వరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కనీస వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మురారిపల్లి డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులకు కనీస వసతులు అయినా కరెంట్ మీటర్లు, లిఫ్ట్ వసతి, డ్రయినేజీ అలాగే మంచినీరు తదితర వసతులు కల్పించాలని లేనియెడల ఈ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సీఎం క్యాంప్ ఆఫీస్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్ వెంకటేష్, కృష్ణ స్వామి, హెచ్‌సీఎఫ్ నాయకులు విజయకుమార్ లబ్దిదారులు శంకర్, బి సుజాత, యాదమ్మ, అనీఫా బేగం, శ్రీనివాస్, రాజేశ్వరి, పల్లవి, అనిత, ఎం లక్ష్మీ, కే శ్రీదేవి, వరలక్ష్మి, జయలలిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు షాక్‌తో రైతు మృతి



**నవతెలంగాణ-శామీర్‌పేట్**

విద్యుత్తు షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడు చింతలపల్లి మండలం అనంతారం గ్రామానికి చెందిన బుద్ధి వెంకటేష్ (40) అతని కుమారుడు సృజన్‌తో కలిసి వారి వ్యవసాయ పొలం వద్దకు ఉదయం సుమారు 7 గంటల 30 నిమిషాలకు పొలంలో (కాంప్లెక్స్ ఎరువు) మందు చల్లడానికి వెళ్లారు. అతడు అల్యూమినియం గంపలో మందు నింపుకొని పొలంలో మందు చల్లుతుండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న కరెంట్ తీగలకు అల్యూమినియం గంప తగలడంతో షాక్ కొట్టి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆర్‌వీఎం హాస్పిటల్‌కి తరలించగా డ్యూటీ డాక్టర్లు వెంకటేష్‌ను పరీక్షించి అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## 1931 తర్వాత దేశంలో మొట్టమొదటి సారిగా కులగణన

- **ఏఐసీసీ మెంబర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కటారి గౌరీ శంకర్**



**నవతెలంగాణ-బేగంపేట్**

1931 తర్వాత దేశంలో మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కులగణన చేపట్టారని ఏఐసీసీ మెంబర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కటారి గౌరీ శంకర్ అన్నారు. ప్రజాభవన్‌లో కులగణనపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కుల గణనలో పాల్గొనని వాళ్ళ కోసం ప్రభుత్వం ఈ నెల 28వ తేదీ వరకు మరో అవకాశం కల్పించింది ప్రజలు దీన్ని సద్వినియోగం చేసికోవాలని కోరారు. మార్చి 1 నుంచి 5 వరకు అసెంబ్లీలో దీనిపై తీర్మానం చేస్తారని చెప్పారు. ఈ సర్వే నిష్పక్షపాతంగా జరిగిందని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు దీనిపై చర్చించేందు ఎక్కడికి వచ్చినా తాము సిద్ధమని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన సకల జనుల సర్వే వివరాలు ఇంత వరకు ప్రజల ముందు పెట్టలేదని విమర్శించారు.

## ప్రసన్న హరికృష్ణకు ఓయూ జేఏసీ మద్దతు



**నవతెలంగాణ-ఓయూ**

మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓయూ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారుడు ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఓయూ జేఏసీ రాష్ట్ర నాయకులు డాక్టర్ నరసింహ మాదుగుల, దర్శనం జాన్, వంశీ యాదవ్ రవికుమార్ నాయక్, శాంసన్, డాక్టర్ మోహన్‌లు విజ్ఞప్తి చేశారు.



సాగౌర చారిటబుల్ ట్రస్ట్ సొసైటీ వారు దారుల్‌షిఫా అంధుల పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖుద్సియా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సద్గుణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

## పీపుల్స్ ప్లాజాలో తనైరా శారీ రన్

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో తనైరా శారీ రన్‌ను ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలు, యువతులు చీరకట్టులో పాల్గొన్నారు. టాటా సంస్థకు చెందిన సుప్రసిద్ధ బ్రాండ్ 'తనైరా' బెంగళూరు ఫిట్‌నెస్ కంపెనీ 'జేజే యాక్టివ్'తో భాగస్వామ్యం చేసుకుని ఒక ఉత్సాహభరితమైన మార్నింగ్ రన్‌ను ఆదివారం నిర్వహించింది. దేశమంతటా ప్రాచుర్యం పొందిన అద్భుతమైన నేత వస్త్రాలను ధరించిన 3120 మంది మహిళలు రన్‌లో పాల్గొనడంతో నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా అంతా రంగుల వాతావరణం నెలకొన్నది. తనైరా శారీ రన్ హైదరాబాద్ ఎడిషన్‌ను జేజే యాక్టివ్ నుంచి కోచ్ ప్రమోద్ ప్రారంభించారు. జేజే యాక్టివ్ నుంచి కోచ్ ప్రమోద్ మాట్లాడుతూ.. తమ కుటుంబాల శ్రేయస్సు కోసం తమను తాము అంకితం చేసుకునే మహిళలు తమ ఆరోగ్యం కోసం సమయం కేటాయించడం ఒక సవాలుగా భావిస్తారు. తనైరా శారీ రన్ అనేది మహిళలు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వడానికి, సాధికారత కల్పించడానికి రూపొందించబడిన ప్రత్యేకమైన కార్యక్రమం అన్నారు. గత



ఏడాది ప్రారంభమైన తనైరా శారీ రన్‌కు వచ్చిన అద్భుతమైన స్పందనతో హైదరాబాద్ మహిళలు అద్భుతమైన ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది హాజరైనందుకు సంతోషిస్తున్నామన్నారు. ఈ రన్‌లో భాగస్వాములైన నగరంలోని మహిళలందరికీ అభినందనలని తెలిపారు.

## ఘనంగా కార్పొరేటర్ వివాహ దినోత్సవ వేడుకలు



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముత్యం నరసింహ యాదవ్ వివాహ దినోత్సవ వేడుకలను ఆదివారం కార్యకర్తలు నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు నాయకులు ఆయన నివాసానికి చేరుకొని కేకులు కట్ చేయించి ముద్దం దంపతులను శాలువాలతో సన్మానించారు.

## పార్ట్ టైం ఆధ్యాపకులను ప్రభుత్వం ఆదుకోవాలి

- **తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్**

**నవతెలంగాణ-ఓయూ**

రాష్ట్ర వ్యాప్తంగా పలు యూనివర్సిటీలలో పనిచేస్తున్న 800 పార్ట్ టైం లెక్చరర్లకు కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం కాలంతో సంబంధం లేకుండా, క్లాసలతో సంబంధం లేకుండా 50,000 జీతం 12 నెలలు ఇవ్వాలని, బేసిక్ పే, మినిమం టైం స్కేల్ ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులను ఆర్థికంగా ఆదుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి డా. యోగిత రాణి ఐఏఎస్‌ను తెలంగాణ అల్ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ (టీజీఆప్ట) ప్రతునిధులు కోరారు. ఈ సందర్భంగా సెక్రెటరీ స్పందిస్తూ.. ప్రభుత్వానికి నివేదించి మీ సమస్యలు పరిష్కారం చేసేలా కృషి చేస్తామన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఆప్ట వ్యవస్థాపక అధ్యక్షులు డా.బి రవీందర్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు డా.ఎస్.కిరణ్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎర్రం నాగేంద్రం, వైస్ ప్రెసిడెంట్ డా. మరపాల కుమార స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. పి.శ్రీలక్ష్మి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు డా. బిక్షమయ్య డా. మంచాల



లింగస్వామి, సైఫాబాద్ కళాశాల అధ్యక్షులు డా. టి శేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు డా.ఎస్ వెంకట్, డా. కాటేపాగ యూగందర్, డా. జి శ్రీనివాసులు, డా ఏడుకొండలు, డా.కంచి రాజేష్, డా.మహేష్, డా.భీమ్ రావు, డా. పల్లవి, డా. రాము, డా. మాధవి, డా. మహతి, డా. శ్రీ వైష్ణవ వేణుగోపాల్, డా. వవిల్ల కుమారస్వామి, డా రవీందర్ పాల్గొన్నారు.

## తెలుగు భాషకు ఎంతో ప్రాధాన్యత ఉంది



- **పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆవుల మంజుల..**

**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

దేశభాషలందు తెలుగు లెస్స అని ఎందరో కవులు రచయితలు మహానుభావులు తెలుగు భాష యొక్క ప్రాధాన్యతను ప్రపంచ పటంలో నిలిపారని, తెలుగు భాషకు ఎంతో ప్రాధాన్యత ఉంది పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ డా. ఆవుల మంజుల పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం చాదర్ ఘాట్‌లోని భాగ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల రీ యూనియన్ పేరిట పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంజుల డా. పద్మావతి, డా. వెంకటరమణ, డి మధు, బిందు భాగ్య మెమోరియల్ గర్ల్స్ హై స్కూల్ కరస్పాండెంట్ డా, శ్రీలత గౌతమ్, ప్రిన్సిపల్ రత్న మేరీలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆవుల మంజుల మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు పాశ్చాత్య పోకడలకు పోకుండా తెలుగు భాష ప్రాధాన్య తను గుర్తించి భాషపై పట్టు పెంచు కోవాలన్నారు. ఈ సందర్భంగా భాగ్య మెమోరియల్ బాలిక ఉన్నత పాఠశాలలో 1992 నుంచి 2024 వరకు విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయులను, నాలుగో తరగతి సిబ్బందిని శాలువా జ్ఞాపకలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు బోధించిన ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న సందర్భంలో కరతాల ధ్వనులతో వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ డా. శ్రీలత, గౌతమ్ మాట్లాడుతూ.. భాగ్య మెమోరియల్ పాఠశాలలో చదువుకున్న విద్యార్థినిలు నేడు అన్ని రంగాలలో ఉన్నత పదవులలో ఉండటం గర్వనీయమన్నారు. భాగ్యరెడ్డి వర్మ ఎంబీ గౌతమ్ ల కృషితోనే భాగ్య మెమోరియల్ గర్ల్స్ హై స్కూల్ ఉన్నత స్థాయికి చేరుకుందని మహేశ్వరం మెడికల్ కాలేజ్ అనాటమీ, పాఠశాల పూర్వ విద్యార్థిని డా. ఎల్ వినోదిని అన్నారు.అనంతరం పూర్వ విద్యార్థినులు పాఠశాలలో తాము చదువుకున్న సమయంలో తరగతి గదులను సందర్శించి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

## మాల విద్యార్థి యువ గర్జన వాయిదా..

- **చినేని వెంకట్**



**నవతెలంగాణ-ఓయూ**

ఓయూలో తెలంగాణ మాల పెడరేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25న తలపెట్టిన మాల విద్యార్థి యువజన గర్జనను వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు చినేని వెంకట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షమీ అక్తర్ ఏకసభ్య కమిషన్‌ను మార్చి 10 వరకు పొడిగించిన నైపథ్యంలో ఈ వాయి దా వేసినట్టు చెప్పారు. విద్యార్థి, యువ గర్జ తేదీని మార్చి 3న జరిగే సమా వేశంలో తదుపరి గర్జన తేదీని ప్రకటించనున్నట్టు వెంకట్ పేర్కొన్నారు.

## గ్యార్మీలో పాల్గొన్న పవన్ కుమార్



**నవతెలంగాణ-ఓయూ**

పద్మారావు నగర్‌లోని బాపూజీనగర్ ముస్లిం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ్ జమ్ మసీద్ చిల్లా వద్ద జాకిర్, మొహద్ గౌస్, జహంగీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మీ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బన్సీలాల్ పేట్ డివిజన్ అధ్యక్షులు రాజు, నాయకులు బాలకృష్ణ, మహేందర్ గౌడ్, హరి చారీ, సాయిరాం చారీ, సౌండ్ రవి, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ పతి వ్యక్తికీ హానికరం



- **ప్రముఖ చిత్ర నిర్మాత బెక్కం వేణుగోపాల్**

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

'సైబర్ దొంగలున్నారు..తస్మాత్ జాగ్రత్త' నినాదంతో 'తకిట తదిమి తందాన' చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన మెగా సైకిల్ ర్యాలీ ఆదివారం ఫిలింనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ దగ్గర ప్రారంభమైంది. జూబ్లీహిల్స్ అపోలో నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 పూరి జగన్నాథ్ టెంపుల్, కేబీఆర్ పార్క్ మీదుగా సుమారు 150 మంది సైక్లిస్టులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో సైబర్ క్రైం అనేది ప్రపంచంలోని ప్రతి వ్యక్తికీ అత్యంత హానికరం కానుందని ప్రముఖ చిత్ర నిర్మాత బెక్కం వేణుగోపాల్ పేర్కొన్నారు. సైబర్ క్రైం ఆన్‌లైన్ పేమెంట్ యాప్స్ ఈజీగా లోన్స్ అందిస్తూ, సగటు వ్యక్తిని అప్పుల ఊబిలోకి లాగి, ఆ తర్వాత అప్పు వసూలు పేరుతో అప్పు తీసుకున్న వ్యక్తి నుంచి అసలు కన్నా కొన్ని రెట్లు అధికంగా వడ్డీని వసూలు చేస్తూ, మానసికంగా చిత్రహింసలకు గురి చేస్తున్న లోన్ యాప్‌లకు వ్యతిరేకంగా 'తకిట తదిమి తందాన' చిత్రాన్ని నిర్మించడం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. సైబర్ క్రైం అత్యంత ప్రమాద కారిణి కానుందని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉంటూ, ప్రభుత్వం, బ్యాంకులు పోలీసు అధికారులు అందిస్తున్న సూచనలను తప్పకుండా పాటించాలని కోరారు. సందేశాన్ని వినోదాత్మకంగా చూయిస్తూ ప్రజలకు మేల్కొలుపుగా తకిట తదిమి తందాన చిత్రాన్ని నిర్మించడం సమాజసేవలో భాగమేనని, ఈ చిత్రాన్ని ప్రజలు ఘన విజయం చేయాలని దర్శకులు చంద్ర మహేష్ విజ్ఞప్తి చేశారు. పేమెంట్ యాప్ వల్ల జరుగుతున్న నష్టం అప్పు తీసుకున్న వ్యక్తులు పడుతున్న అవస్తలపై నిర్మించిన తకిట తదిమి తందాన చిత్రం ఈ నెల 27న థియేటర్లలో విడుదల కానుందనీ, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని యువ హీరో రాంకీ కోరారు. హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ర్యాలీలో ఫెటాప్సీ చైర్మెన్ హరి గోవింద ప్రసాద్, హెచ్‌సీజీ అధ్యక్షుడు రవీంద్ర, చిత్ర నిర్మాత చందన్ కుమార్ కొప్పుల, హీరో గణ ఆదిత్య, హీరోయిన్ ప్రియ, దర్శకులు రాజ్ లోహిత్, సినెటేరియా అధినేత వెంకట్ బులెమోని తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్



**నవతెలంగాణ-ఓయూ**

హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ ఆదివారం సాయంత్రం హబ్సిగూడ డివిజన్‌లోని డాక్టర్ ధీరజ్ పెయిన్ రిలీఫ్ సెంటర్‌ని సందర్శించారు. ధీరజ్ ఆధ్వర్యంలో ఉచితంగా రోగులకు వైద్య పరీక్షలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డా. ధీరజ్‌ని ఆయన రోగులకి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్పొరేట్ కాలంలో తనవంతు బాధ్యతగా ఒకరోజు ఉచితంగా రోగులను పరీక్షించడం చాలా సంతోషమని డాక్టర్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెల్లోజు ఎల్లాచారి, పెంటం శైలేందర్, కట్ట భాస్కర్ పాల్గొన్నారు.

## రాష్ట్రపతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ప్రతి శని ఆదివారాలలో కళా సంధ్య పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రపతి నిలయం కార్యదర్శి రజిని ప్రియ తెలిపారు. ఇందులో భాగంగా శని ఆదివారాల్లో నృత్య కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు.

# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

## మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

సోమవారం ఫిబ్రవరి 24, 2025 www.navatelangana.com


## ప్రజా సేవే లక్ష్యంగా పేదలకు ఆర్థిక సాయం



- కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

మల్కాజిగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు ప్రజాసేవే లక్ష్యంగా మల్కాజిగిరి సర్కిల్ వినాయక్ నగర్ డివిజన్‌కు చెందిన పిట్టల నాగరాజు పేదవారికి తనకు తోచిన సహాయం అందజేస్తూ అండగా నిలుస్తున్నారు. ఆదివారం కాప్రా సాయిబాబా నగర్‌లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబ సభ్యులు నాగమణి రాజయ్య దంపతులకు మంచినీటి సంపును కట్టించుకోనేందుకు అయ్యే ఖర్చు రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి రాజయ్య దంపతులు మాట్లాడుతూ కట్టించి ఇచ్చి, నీటి కొదవ లేకుండా చేసిన నాగరాజు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పిఎస్ఆర్ గ్రూప్ సభ్యులు, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

## 'వామపక్షాలు కాంగ్రెస్‌కు తొత్తులనడం సరికాదు'



**నవతెలంగాణ- మేడ్చల్**

వామపక్షాలు కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ సీఎం కేసీఆర్ అనడం సరికాదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మందపురం నరేష్ ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఫామ్ హౌస్ నుండి బయటికి వచ్చిన కేసీఆర్ తెలంగాణ భవన్ లో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో వామపక్షాలు కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారాయని అనడాన్ని ఖండించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. సింగరేణి బొగ్గుగనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముతుంటే కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని విమర్శించారు. లాగచెర్లలోని పేదల భూములు లాక్కుంటుంటే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మహబూబాద్, వరంగల్ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పేదల గుడిసెలను తొలగిస్తుంటే ఎందుకు మాట్లాడలేదన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న వామపక్షాలపై చౌకబారు విమర్శలు మానుకోవాలని కేసీఆర్‌కు హితవు పలికారు.

## కరాటే పోటీల్లో యూనివర్సల్ 369 విద్యార్థుల ప్రతిభ




**నవతెలంగాణ-మేడ్చల్**

మేడ్చల్ పట్టణంలోని యూనివర్సల్ 369అకాడమీ విద్యార్థులు ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే కుంఫు పోటీల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా దావల్య గోల్డ్ మెడల్, మనోజ్ఞ సిల్వర్ మెడల్, అలేఖ్య గోల్డ్ మెడల్ , శ్రీపాద గోల్డ్ మెడల్, మణిద్వీప గోల్డ్ మెడల్, జయంతి సిల్వర్ మెడల్, ఆద్య సిల్వర్ మెడల్, సాయి ప్రియ సిల్వర్ మెడల్, సుహాస్ సిల్వర్ మెడల్ సాధించారు. అదేవిధంగా అండర్ 14 ఇయర్స్ కేటగిరిలో అమూల్య గోల్డ్ మెడల్, ఎబౌ 14ఇయర్‌లో నిత్యశ్రీ, గోవింద్ గుప్తాలు గోల్డ్ మెడల్ సాధించినట్లుగా సంస్థ ప్రతినిధులు తెలిపారు. కాగా వీరందరినీ మార్చి 16న మేడ్చల్ పట్టణంలో జరగబోయే జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ పోచయ్య, సత్యశంకర్, చందర్ మాస్టర్ అభినందించారు.

## వాటర్ డెవలప్‌లమెంట్ సొసైటీ ప్రతినిధుల కృషి ఫలించింది



- వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మెన్ మీనా

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులతో కలిసి 30 ఏండ్ల నుండి చేస్తున్న పోరాటం కొలిక్కి వచ్చిందని, త్వరలోనే వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులకు రావాల్సిన బెనిఫిట్స్ అందుతాయని చైర్మెన్ మీనా దీమా వ్యక్తం చేశారు. ఆదివారం మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీ సంక్షేమ భవనంలో ఏర్పాటు చేసిన సొసైటీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ వాటర్ డెవలప్‌మెంట్ సొసైటీ పని ముగిసిందని ఎంతోమంది ఎద్దేవా చేసినా, ఎంతమంది అవమానించినా కృంగిపోకుండా, సొసైటీలోని కొంతమంది సభ్యుల సహకారంతో ఈ విజయాన్ని సాధించే దిశలో ప్రయాణిస్తున్నామన్నారు. అనంతరం కేంద్ర ఆసరా కమిటీ ప్రధాన కార్యదర్శి కందిబండ సత్యనారాయణ మాట్లాడుతూ వాటర్ డెవలప్మెంట్ సొసైటీ ఉద్యోగులకు, వారికోసం కృషి చేస్తున్న వారికి సరైన న్యాయం జరగలేదని కోర్టుకు వెళ్లి వారి హక్కులను సాధించుకోగలిగినందుకు, ప్రత్యేకంగా వారికోసం కృషి చేసిన చైర్మెన్ మీనాకు అభినందనలు తెలియజేస్తూ సొసైటీ సభ్యులకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓటరు డెవలప్ మెంట్ సొసైటీ అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు మహమ్మద్ యూసఫ్, ప్రధాన కార్యదర్శి పిజి చారి, సహాయక కార్యదర్శి విన్సెంట్ యాంతోని, కోశాధికారి ఆన్ షర్లాక్, ఆర్గనైజర్ నాగరాజ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, అడ్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం యువతకు ఉచిత ఉపాధి శిక్షణ



**నవతెలంగాణ-కాప్రా**

విద్యావంతులైన నిరుద్యోగ ముస్లిం యువతీ, యువకులకు మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉపాధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వంశిక ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు కోటి ప్రభాకర్ తెలిపారు. ఆసక్తి గలవారు 18 నుంచి 35 ఏండ్లు కలిగి ఉండి కులం, ఆదాయం, విద్యార్హత ఆధార్, రేషన్ కార్డు, మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో శిక్షణకు హాజరు కావచ్చునని తెలిపారు. మూడు నెలల శిక్షణ పూర్తయిన అనంతరం ప్లేస్‌మెంట్‌తో పాటు ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందన్నారు. నార్త్ కమలానగర్‌లోని కాప్రా సబ్ రిజిస్టర్ కార్యాలయం పైన ఉన్న వంశీక ఎడ్యుకేషనల్ సొసైటీలో 'డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్' (డీఎంఎం) కోర్సులో ఇంటర్ డిగ్రీ అర్హత కలిగిన వారికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారుఫోన్: 93461 85524, 80086 23330 సంప్రదించాలని సూచించారు.

## జేవీవీ వైద్య శిబిరానికి విశేష స్పందన..



- రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్

**నవతెలంగాణ - చర్లపల్లి**

జన విజ్ఞాన వేదిక కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద శిబిరానికి విశేష స్పందన లభించిందని జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చక్రిపురంలోని చక్రి విద్యానికేతన్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 114వ బీపీ, షుగర్ వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు సుమారుగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. బార్ద్ ఫ్లూ, ఎండాకాలం వస్తునందున ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండడం, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ తెలిపారు. నిరంతరం వైద్య సేవలు నిర్వహిస్తున్న వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్నీ, నాయకులు వెంకటరమణ, శేషు, శ్రావణ్ కుమార్, శివ శంకర్ రెడ్డి, సోమయ్యచారి, శివప్రసాద్, మధు, మురళీమోహన్, ప్రభాకర్ మెడికల్ క్యాంప్ ఆర్గనైజర్ కర్ణకర్ రెడ్డి, డాక్టర్లు విద్యాసాగర్, జయరాజ్, దేవిక తదితరులు పాల్గొన్నారు.

కాప్రా మండల్ జమ్మిగడ్డ ప్రాంత, బి.జె.ఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో 143 వ వారం జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలతో జ్ఞానమాల సమర్పణ చేశారు. జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్ సభ్యులు.కే.శ్రీనివాస్, రవి నాయక్,దయానంద్, శ్రీసేలం, శ్రీనివాస్, మెకానిక్ కొండల్, వెంకటయ్య, నగేష్, మాణిక్, ఇస్తారీ పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా



# ఓపెన్ జిమ్‌లు ఇలా.. వ్యాయామం చేసేదెలా..

- శిథిలావస్థకు చేరిన వ్యాయామ పరికరాలు
- లక్షలు వెచ్చించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు
- నిర్వహణ లోపంతోనే పరిస్థితి ఇలా





**నవతెలంగాణ- మేడ్చల్**

మున్సిపల్ ప్రజల ఆరోగ్యం మానసిక ప్రశాంతత కోసం గత ప్రభుత్వం మేడ్చల్ జిల్లాలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేసింది. ఇందుకోసం లక్షల రూపాయలను వెచ్చించింది. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఓపెన్ జిమ్ లో 8 రకాల పరికరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో ఓపెన్ జిమ్ కు లక్షల్లో నిధులను వెచ్చించింది. అయితే ఈ వ్యాయామ పరికరాలు నాణ్యత లేకపోవడం... ఈ ఓపెన్ జిమ్ ల బాధ్యత గుత్తేదారులకు అప్పగించడం... వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రస్తుతం అవి వ్యాయామం చేసుకోవడానికి వీలు లేకుండా తయారయ్యాయని ఆరోపణలు వస్తున్నాయి. వ్యాయామ పరికరాలు కొన్ని విరిగిపోయాయి. ఏ ఆశయంతో ఈ ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారో వారి లక్ష్యం నెరవేరకముందే తుప్పు పట్టి పోయాయి. ఓపెన్ జిమ్ లు ఇలా ఉంటే వ్యాయాయం సాగేది ఎట్లా అంటూ పట్టణ ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి తుప్పు పట్టి పోయిన పరికరాలను మార్చి కొత్త పరికరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

### కమిషనర్ పట్టించుకోవాలి : కుండ భానుచందర్



ప్రజల ఆరోగ్యవంతమైన జీవితం గడపటం కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ములు శిథిలావస్థకు చేరుతున్నాయని గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు విరిగిపోతున్నాయని తెలిపారు. పర్యవేక్షణ లోపం వల్ల ఓపెన్ జిమ్‌లు దేనికి పనికి రాకుండా పోతున్నాయని, వీటి నిర్వహణను గుత్తేదారులకి అప్పగించగా వారి నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దీంతో లక్షల రూపాయలతో వెచ్చించి ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌ల ఆశయాలు నీరు కారుతున్నాయని చెప్పారు. కమిషనర్ స్వామి నాయక్ పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి







## కాలనీల మధ్యలో సబ్ స్టేషన్ వద్దు..



- హెల్త్ ప్రైమరీ సెంటర్ నిర్మించండి
- సబ్ స్టేషన్ పనులను అడ్డుకున్న కాలనీల వాసులు

**నవతెలంగాణ-బోడుప్పల్**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని పి.ఎన్ నగర్, బి.ఎల్ నగర్ కాలనీల నివాస గహాల మధ్యలో నిర్మిస్తున్న సబ్ స్టేషన్ పనులు ఆపాలని కాలనీల వాసులు ధర్నా నిర్వహించారు. మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి పాల్గొని పనులపై విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పి.ఎన్.ఆర్,బి.ఎల్.నగర్ పూర్తిగా నివాస గహాలతో కూడుకున్న ప్రాంతమని, అలాంటి స్థలంలో 33/11 కెపాసిటి గల సబ్ స్టేషన్ నిర్మించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇదే స్థలంలో రెండు సార్లు ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి మాజీ మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారని, కాలనీ ప్రజల అవసరాలకు హెల్త్ సెంటర్ నిర్మించకుండా సబ్ స్టేషన్ నిర్మించడం కాలనీ వాసులను ప్రమాదానికి గురిచేయడమేనన్నారు. వర్షాకాలం వచ్చిందంటే సుమారు ఇరవై కాలనీల నీరు తమ రెండు కాలనీలు దగ్గరకు వచ్చి ఇండ్లలోకి నీరు చేరి గహాణపకారాలు వస్తువులు మునిగిపోయి భారీగా ఆస్తి నష్టం సంభవించిన విషయం మరువక ముందే కాలనీ మద్యలో సబ్ స్టేషన్ నిర్మించడం ప్రజలను తీవ్ర అందోళనకు గురిచేస్తుందన్నారు. దీనిని కలెక్టర్ తో పాటు సంబంధిత విద్యుత్ అధికారులు పునర్ ఆలోచించి నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని కోరారు. 3 రోజులుగా కాలని వాసులు పనులను అడ్డుకున్న లెక్కచేయకుండా బోర్ వేయడం నిర్మాణాల పనులు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రజల అవసరాల తగ్గట్టు వ్యవహరించాల్సిన అధికారులు విరుద్ధంగా నడవడం ఏంటని, ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు భాద్యత తీసుకుంటారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శంకర్, వెంకటేషమ్, హేమలత్, తిరుపతి, వీరేషమ్, మధు, అశోక్, సురేష్, బుచ్చయ్య, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### లో ఓల్టేజీ కారణంతోనే బీఎల్ నగర్ సబ్ స్టేషన్ నిర్మాణం

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గృహ నిర్మాణాల సంఖ్య పెరిగి విద్యుత్ సమస్య ఏర్పడడం వలనే మరో సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నాం. నగరాలలో సబ్ స్టేషన్‌లు కాలనీల మధ్యలోనే ఉంటాయని ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండానే నిర్మాణం చేపడుతాం. హెల్త్ సెంటర్ నిర్మాణం అనుమతులను జిల్లా కలెక్టర్ రద్దు చేసి సబ్ స్టేషన్ అనుమతులు మంజూరు చేశారని ఇట్టి స్థలాన్ని ఎస్.ఈ.,డీ.ఈ పరిశీలించిన అనంతరమే పనులను ప్రారంభించాం. - బోడుప్పల్ ఏఈ

## ఓయో రూమ్‌ను తీసెయ్యండి



- ఓయో రూమ్ వద్ద షిరిడీ సాయి కాలనీ వాసుల ఆందోళన

**నవతెలంగాణ-కీసర**

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన ఓయో రూమ్‌ను తీసేయాలని కోరుతూ ఆదివారం నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి గ్రామం షిరిడి సాయి కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో ఇటీవల ఓయో రూమ్‌ను కొందరు ఏర్పాటు చేయడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా యని ఆరోపించారు. దాంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ మధ్యలో ఓయో రూమ్ ఉండటంతో ఈ రోడ్డు మార్గం గుండా ప్రధాన దారికి వెళ్లే మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న ఓయో రూమ్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని, ఓయో రూమ్‌ను ఇక్కడి నుంచి తీసివేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ,పోలీస్ అధికారులకు ఓయో రూమ్ పై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ నరేష్ కుమార్, సభ్యులు జగన్ రెడ్డి , గొంగళ్ల కష్ణ, చంద్రశేఖర్ , జయపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఆంజనేయులు, సాయికుమార్, వెంకన్న,వెంకటేష్, దేవేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం సహకరిస్తే వికలాంగులకు ప్రత్యేక శిక్షణా తరగతులు



- హెలెన్ కెల్లర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫౌండర్ చైర్మెన్ లయన్ పఠాన్ ఉమర్ ఖాన్

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

ప్రభుత్వం సహకారం అందిస్తే వికలాంగ పిల్లలకు విద్యా, వైద్య, ఉపాధి, సాంఘిక ఆర్థిక అభివృద్ధిలో ముందుండేలా ప్రతి ఒక్కరికీ సహాయం అందిస్తామని, వికలాంగులకు అన్ని ప్రాంతాలలో ప్రత్యేకమైన శిక్షణా తరగతులు ఏర్పాటు చేసేలా తమ యు వార్డు పనిచేస్తుందని హెలెన్ కెల్లర్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ ఫౌండర్, వార్డ్ చైర్మెన్ లయన్ పఠాన్ ఉమర్ ఖాన్ అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ ఆర్ కె పురంలోని హెలెన్ కెల్లర్స్ కళాశాలలోని వార్డ్ సెక్రటేరియట్ వద్ద సెక్రటేరియట్ స్టాప్‌తో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా చార్టెడ్ అకౌంటెంట్ విద్యా బజార్, ప్రత్యేక అతిధిగా హైకోర్టు లాయర్ నిరంజన్ ప్రసాద్, అడ్వకేట్ నటరాజ్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశానికి లయన్ పఠాన్ ఉమర్ ఖాన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. యు వార్డు సర్వీస్ ఆక్టివిటీస్‌ను 2002లో ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో కేవలం 14 జిల్లాలు మాత్రమే ప్రత్యేక పాస్టర్ చాలు స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్నాయని, మిగిలిన 19 జిల్లాలకు స్వచ్ఛంద సంస్థలు లేక ఆ జిల్లాలలో నివసిస్తున్న వికలాంగ పిల్లలకు సరియైన పాఠశాలలు లేక ఇబ్బందులు పాలవుతున్నారని వారికి వారి వారి ప్రాంతంలోనే ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేసేలా తమ యువార్డు పనిచేస్తుందనితెలిపారు. దానికి ప్రణాళికలను ముందుకు తీసుకోవడం ఈ సమావేశం ఉద్యేశమన్నారు. అనంతరం మిర్జా మాట్లాడుతూ భారత ప్రభుత్వం అందించే సేవలను సిఎస్ఆర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా కార్పొరేట్ సంస్థలు అందించే ఆర్థిక ప్రోత్సాహలను ఒక పద్ధతి ప్రకారం అందిపుచ్చుకోవాలన్నారు. ఎక్కువ మంది నిరుపేదలైన వికలాంగులకు సేవలు అందించాలని, విద్య ఆర్థిక సామాజిక సమానమైన అవకాశాలను వికలాంగులకు అందించేలా ఈ వార్డ్ తమ ఎన్జీవో సంస్థలను కలిపి ముందుకు సాగాలని అభిప్రాయ పడ్డారు. అడ్వకేట్ నిరంజన్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పాలసీలను మార్చే విధంగా పాలసీ మేకర్స్‌లకు తమ ప్రాబ్లమ్స్‌ను తెలిపి కావాల్సిన పాలసీ చేంజ్ చేస్తున్న పార్లమెంటు ద్వారా ఇంప్లిమెంట్ చేసేలా ముందడుగు వేయాలనిన్నారు. ఆర్‌పీడబ్ల్యుడీ యాక్ట్ 2016 ఉద్దేశించి అందులోని అంశాలు సరిగ్గా మన రాష్ట్రంలో ఇంప్లిమెంట్ అయ్యేలా ప్రభుత్వానికి అదేలా స్వచ్ఛంద సంస్థలు కలిసి కట్టుగా తమ విన్నపాలను ప్రభుత్వానికి ప్రజలకు తెలియజేస్తూ చైతన్యాన్ని తీసుకొని రావాలన్నారు. రాజ్ కుమార్ మాట్లాడుతూ ధోని ఫౌండేషన్ బెంగళూరు వారు తమ సంస్థకు ఏ విధంగా సహాయ సహకారాలను అందిస్తున్నారు. ఒక ప్రణాళిక నిబద్ధతలను పాటించుకుంటూ మేనేజ్ మెంట్ స్కిల్స్‌ను సస్టైనబులిటీ దిశగా ప్రతి ఎన్జీవో సంస్థ ముందు అడుగు వేయాలని, వారికి కావలసినటువంటి నైపుణ్యాలను ట్రెనింగ్ ద్వారా కౌన్సిలింగ్ ద్వారా అందజేయడం తమకు అందించిన సహకారమని తెలిపారు. తద్వారా వార్డ్‌లో ఉన్న 65 స్వచ్ఛంద సంస్థలకు చేయూత అందించే దిశగా ప్రయాణం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెలెన్ కెల్లర్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాశివ జెండా మహెూత్సవం



- పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నవతెలంగాణ-కాప్రా**

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని బ్రహ్మకుమారీస్ రాజయోగ ధ్యాన కేంద్రం ఆధ్వర్యం లో నిర్వహించిన మహా శివ జెండా మహెూత్సవంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజాపిత బ్రమ్మకుమారిస్ ఈశ్వర విశ్వ విద్యాలయాన్ని స్థాపించి 90 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ మహెూత్సవం నిర్వహి ంచారు. పరమ శివుని సత్య జ్ఞానాన్ని రాజయోగ జ్ఞానం, ధ్యానం రూపంలో ప్రపంచానికి పంచి అందరి కీ ప్రశాంతతను ఆరోగ్యాన్ని అందించేందుకు ఈ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. సామూహిక ధ్యానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పరమశివుని జెండా ఆవిష్క రణ చేశారు. ధ్యానంతో మానసిక ప్రశాంతతను పెంచుకుంటే స్వతహాగా సమాజం శాంతియుతంగా మారుతుందని ఎమ్మెల్యే అన్నారు. అన్ని మతాల్లో భగవం తుని విశ్వశక్తిగా అంగీకరిస్తారని, ఆశక్తిని ధ్యానించడం వల్ల మనశ్శాంతితో పాటు సమాజంలో, ప్రపంచంలో శాంతి నెలకొంటుందని ప్రభుదాస్ అన్నారు. జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలం టే మెడిటేషన్ ఏకైక మార్గమని ఈ మెడిటేషన్‌ను బ్రహ్మకుమారిస్ వారు అందరికీ ఉచితంగా నేర్పించడం అభినందనీయమన్నారు. 90 వసంతాల ఈశ్వరియ సేవలకు గుర్తుగా కేక్ కటింగ్ చేసి విశ్వ శాంతి కోసం అందరూ కషి చేయాలని ప్రతిజ్ఞ కార్యక్ర మం నిర్వహించారు. విశ్వశాంతి కోసం కషి చేస్తామని కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ నిర్వాహకులు మీర్పేట్ మౌలాలి ఇంచార్జి బీకే సునీత, ఏ.ఎస్.రావునగర్ బ్రమ్మకుమారిస్ ఇన్‌చార్జిబీకే రాజకుమార. పాల్గొన్నారు.



బెండకాయలకున్న తొడిమెలు, తోక తీసి ప్లాస్టిక్ కవర్లో వేసి ఫ్రిజ్‌లో పెడితే తాజాగా ఉంటాయి.

బాదం ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే నిల్వ ఉంచిన డబ్బాలో టేబుల్ స్పూన్ పంచదార వేయాలి.







# అమ్మాయిల కోసం ఓ స్వరం

**మొదట చూసినపుడు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోని కల్మేశ్వర్ కూడా దేశంలోని మిగిలిన గ్రామీణ ప్రాంతంలాగా కనిపిస్తుంది. గ్రామానికి చుట్టూ అనేక పారిశ్రామిక కేంద్రాలు ఉన్నాయి. అయితే ఒక అంశం మాత్రం ఈ గ్రామాన్ని ప్రత్యేకంగా చూపుతుంది. ఈ ప్రాంతంలోని 18 గ్రామాలలో ప్రతి ఇంటి తలుపుపై కుటుంబంలోని కుమార్తెల పేరు ఉంటుంది. 2023లో జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్‌తో పాటు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రారంభించిన నేమ్స్ ఆన్ డోర్స్ అనే ప్రత్యేక చొరవకు ఇది నిదర్శనం. గ్రామీణ బాలికలకు పేరు, స్వరాన్ని ఇస్తున్న ఆ కార్యక్రమం గురించి మరిన్ని వివరాలు...**

కల్మేశ్వర్ నగరం 108 గ్రామాలతో చుట్టుముట్టబడి ఉంది. ఆ గ్రామీణ ప్రజలకు శాశ్వత ఆదాయ వనరులు లేవు. ఎక్కువ మంది కార్మికులుగా ఉన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారు. అయితే గైర్హాజరు, డ్రాపౌట్లు ఎక్కువ. 'వెనుకబడిన ఈ ప్రాంతంలో యువతులకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో చూస్తే ఆశ్చర్యపోతారు' అని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రోగ్రామ్స్ చీఫ్ ధనశ్రీ బ్రహ్మే ఓ వెబ్‌సైట్‌తో పంచుకున్నారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ 1999లో పేద గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు మద్దతు ఇచ్చే లక్ష్యంతో స్థాపించబడింది. ఇది యువతకు జీవన నైపుణ్యాలు, విద్యా, తోటివారికి మద్దతును అందించడం వంటివి చేస్తుంది. ఇప్పటి వరకు దాదాపు 35 లక్షల మందికి మద్దతు ఇచ్చింది. ఈ సంస్థ నేపాల్, బంగ్లాదేశ్‌తో పాటు భారతదేశంలోని 23 రాష్ట్రాల్లోని 80 కంటే ఎక్కువ జిల్లాల్లో పనిచేస్తోంది.

## బాలికలకు గుర్తింపు

బ్రహ్మే 30 ఏండ్లుగా అభివృద్ధి రంగంలో పనిచేస్తున్నారు. ఆమె ఐక్యరాజ్యసమితి జనాభా నిధిలో భాగంగా ఉన్నారు. లింగ సమస్యలపై విస్తృతంగా పనిచేస్తున్నారు. ఐక్యరాజ్యసమితిలో చేరిన తర్వాత ఆమె లింగ వివక్షకు వ్యతిరేకంగా అట్టడుగు స్థాయి నుండి పని కొనసాగించాలని భావించారు. భారతదేశంలోని అనేక గ్రామీణ ప్రాంతాలలో లింగ అసమానతలు ఇప్పటికీ ప్రబలంగా ఉన్నాయి. కల్మేశ్వర్ వంటి ప్రదేశాలలో ఇప్పటికీ బాలికలకు బాల్య వివాహాలు జరుగుతున్నాయి. 'భౌగోళికంగా అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరు అవకాశాలు, అవసరాలు ఉంటాయి. కానీ అమ్మాయిలు కొన్ని ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం ముఖ్యం' అని ఆమె చెబుతున్నారు.

## అలల ప్రభావం

అమ్మాయిల్లో పోరాడే ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ఒక మార్గంగా ఇంటి తలుపులపై వారి పేర్లు ఉండాలనే ఆలోచన ఆమెలో పుట్టింది. ఈ ప్రాంతంలోని 12 నుండి 16 ఏండ్ల వయసు గల కౌమార బాలికలను ఈ కార్యక్రమం కోసం పరిగణించారు. ఈ కార్యక్రమం కలంబి, బోర్గావ్, అడసా, వరోడా వంటి 18 గ్రామాలలో చురుకుగా ఉంది. 'ఇది ఒక అలల ప్రభావం. ఇంట్లో అమ్మాయిలకు గుర్తింపును ఇవ్వడం వల్ల వారు జీవితంలో మరింత ఆత్మవిశ్వాసంతో ఉంటారు. తాము ఉన్న స్థలాన్ని తమ హక్కుగా ఆక్రమించగలరు' అని బ్రహ్మే వివరించారు. ఈ కార్యక్రమ ప్రభావం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. మాండ్వి, గోండ్ఖైరి గ్రామాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులైన అసవారీ పాటిల్, సంబోధి వాల్కేలకు తమ ఇంటి తలుపులపై తమ పేర్లు చూడటం ఆశ, గర్వానికి చిహ్నంగా భావిస్తున్నారు. 'అమ్మాయిలుగా మనకు ఇంట్లో బాధ్యతలు ఉంటాయి. కానీ మనకు కలలు కూడా ఉంటాయి' అని వాల్కే అన్నది.

## క్రమంగా అంగీకారం

మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ బృందం ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినప్పుడు ప్రతిఘటనను ముందే ఊహించింది. 'మనం ఇలా ఎందుకు చేయాలి?' అనేది బ్రహ్మే బృందం ఎదుర్కొన్న అత్యంత సాధారణ ప్రశ్న. ఎందుకంటే ఇళ్ళు పురుషుడి ఆస్తిగా పరిగణించబడతాయి. 'సాధారణంగా భర్త తర్వాత ఇంటికి భార్యలకు హక్కు ఉంటుంది. అయితే మేము ఒక అడుగు ముందుకేసి కుమార్తెలపై దృష్టి సారించాము' అని బ్రహ్మే చెప్పారు. స్థానిక ప్రభుత్వాలు, పాఠశాలలు, గ్రామ పెద్దలతో ఈ బృందం సంప్రదించింది. 'సమాజంలో వారు గౌరవించబడుతున్నందున ప్రజలు వారి మాట వింటారు. వారితో పనిచేయడం వల్ల ప్రతిఘటనను ఎదుర్కోగలిగాం" అని ఆమె వివరించారు. మొదట జిల్లాలోని 24 పాఠశాలల్లో 9 మాత్రమే ప్రారంభంలో కార్యక్రమంలో భాగం కావడానికి అంగీకరించాయి. ఈ కార్యక్రమానికి బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, పంచాయతీల నుండి గుర్తింపు లభించింది. 'నా తల్లిదండ్రులు మొదట్లో నిరాకరించారు. కానీ మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, నా పాఠశాల నుండి వచ్చిన వ్యక్తులు బాలికల సామర్థ్యాలు, బాధ్యతల గురించి వారితో మాట్లాడారు. అమ్మాయిలకు కూడా వారికంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలి' అని వాల్కే పంచుకుంది.

## అన్ని స్థాయిల్లో మార్పు అవసరం

నేమ్స్ ఆన్ డోర్స్ చొరవ క్రమంగా ఎక్కువ మందిని మాట్లాడేలా చేస్తుంది. ఈ ప్రాంతంలోని బాలికల పట్ల మనస్తత్వాలలో మార్పును ప్రారంభిస్తోంది. 'ఎవరైనా నా ఇంటి తలుపుపై నా పేరు చూసినప్పుడు, వారు కూడా దీన్ని అనుసరించాలా వద్దా అని ఆలోచిస్తారు' అని పాటిల్ అంటుంది. అయితే నిజమైన ప్రభావం చూపడానికి సాంస్కృతిక, సంస్థాగత స్థాయిలో కూడా మార్పును పెంపొందించాల్సిన అవసరం ఉంది. 'బాలికలు కేవలం పాఠశాలకు వెళ్లడం, అక్షరాస్యులుగా మారడం ద్వారా మాత్రమే ఆత్మవిశ్వాసం పెరగదు' అని బ్రహ్మే అంటున్నారు. ఈ కార్యక్రమ విస్తరణ ఆమె బృందం ఊహించిన దానికంటే పెద్దది. పిల్లల గొంతులను సూచించే బాల్ పంచాయతీతో బృందం పనిచేసింది. వారి తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు, గ్రామ పెద్దలు, పాఠశాల, గ్రామ సర్పంచ్ మాట వింటారని కూడా వారు విశ్వసించారు. నేడు కల్మేశ్వర్ చుట్టూ ఉన్న 18 గ్రామాలలో ఇటువంటి 2,100 నేమ్‌ప్లేట్లు ఉన్నాయి. ఫలితంగా బాలికలు తమ కుటుంబం, సమాజంలో తాము ఒక ముఖ్యమైన భాగమని నమ్మకంగా భావించారు.

## రోల్ మోడల్స్‌గా...

మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఈ చొరవను కల్మేశ్వర్‌లోని ఇతర గ్రామాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 'ప్రతి ప్రాంతం ఒక కార్యక్రమానికి భిన్నంగా స్పందిస్తుంది. కల్మేశ్వర్‌లో తల్లిదండ్రులు, పాఠశాలలు, వృద్ధులు ఈ చొరవ గురించి వినడానికి సిద్ధంగా ఉన్నారు. ఎందుకంటే వారు తమ కుమార్తెలు బాగా చదువుకోవాలని కోరుకుంటారు. ఈ కార్యక్రమం ఇక్కడ బాగా పనిచేస్తుంది. అయితే రాష్ట్రంలోని, దేశంలోని ఇతర ప్రాంతాలకు మనం వేరే విధానాన్ని ప్లాన్ చేసుకోవాలి. లింగ పక్షపాతం వంటి సమస్యలను పరిష్కరించడానికి, కమ్యూనిటీలు, సంస్థలతో కలిసి పనిచేయాలి. వేలాది మంది ప్రముఖులు, క్రీడాకారులు మాకు తోడుగా ఉన్నారు. కానీ స్థానిక రోల్ మోడల్స్ అవసరం' అని ఆమె బ్రహ్మే అంటున్నారు. ఆసావరి పాటిల్, సంబోధి వాల్కే, వారి స్నేహితులు ఆ ప్రాంతంలోని ఇతర అమ్మాయిలు ఇప్పుడు ఆ రోల్ మోడల్స్‌గా మారారు.





# కారులో తీసుకొచ్చి మత్తు ఇచ్చి...

నవతెలంగాణ-ధర్పల్లి

మాయమాటలు చెప్పి ఇద్దరు మహిళలను కారులో తీసుకొచ్చి మత్తు మందు ఇచ్చి నలుగురు కలిసి సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం దుబ్బాక, డీబీ తండా శివారులోని నల్లగుట్ట లక్ష్మి నర్సింహస్వామి ఆలయ సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం.. సురేశ్ అనే వ్యక్తి జిల్లా కేంద్రం నుంచి ఇద్దరు మహిళలను కారులో తీసుకొచ్చినట్టు సమాచారం. అనంతరం ఆయన మిత్రులైన డీబీ తండా వాసులు మహేశ్వర్, రమేష్, సీతారాం ముగ్గురు అక్కడికి చేరుకొని మహిళలకు మద్యం, డ్రగ్స్ అందించి వారు మత్తులోకి జారిపోయాక సామూహికంగా లైంగికదాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఇద్దరు బాధిత మహిళల్లో ఒకరు మత్తులో పడిపోగా.. మరొకరికి మెలకువ వచ్చి అక్కడి నుంచి పారిపోతూ కేకలు వేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి ఇద్దరు మహిళలను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించినట్టు తెలిసింది. వారి మత్తు దిగిన తర్వాత వారు ఇచ్చే వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్టు సమాచారం. కాగా మహిళలను తీసుకువచ్చిన సురేశ్‌ను రాత్రి సమయంలో అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఇద్దరికి మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారని, అలాంటి వ్యక్తులు ఇలాంటి ఘటనల్లో నిందితులుగా పట్టుబడటంతో తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కేసు నమోదు కాకుండా చూసే యత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. బాధితులకు నయానో బయానో నచ్చజెప్పి కేసు లేకుండా చూసేందుకు ఓ యువనాయకుడు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

# బర్డ్‌ఫ్లూ అంటే భయం..! ఉచితమైతే ఓకే..!!

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'నిజం గడప దాటేలోగా.. అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తుంది' అంటుంటారు. అచ్చు అలాగే బర్డ్‌ఫ్లూ వదంతులు వ్యాప్తి చెందుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాలో పౌల్ట్రీఫామ్‌లోని కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించడంతో గత రెండువారాలుగా చికెన్, గుడ్ల అమ్మకాలు మందగించాయి. అప్పటి వరకు కిలో రూ.260కి పైగా ఉన్న చికెన్ ధరలు ఒక్కసారిగా దిగివచ్చాయి. ప్రస్తుతం కిలో చికెన్ రూ.160 పలుకుతోంది. స్కిన్‌లెస్‌కు రూ.20 అదనంగా అంటే రూ.180 తీసుకుంటున్నారు. ఈ ఘటనతోనే బర్డ్‌ఫ్లూ వదంతులు వ్యాప్తించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదని పశుసంవర్ధకశాఖ ప్రకటిస్తున్నా.. అక్కడ కోళ్లు చనిపోయాయి.. ఇక్కడ చనిపోయాయి అనే దుష్ప్రచారం సోషల్‌మీడియాలో బలంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చాలా చోట్ల వివిధ పౌల్ట్రీ కంపెనీలు, చికెన్ అండ్ ఎగ్ సప్లయర్స్, చికెన్ దుకాణదారుల సంఘాలు కోడిమాంసం, గుడ్లు, వాటితో వండిన పదార్థాల ఉచిత పంపిణీకి తెరదీశారు. ఈ ఉచిత పంపిణీ కేంద్రాల వద్ద జనం బారులు దీరుతున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని పోస్టాఫీస్ సెంటర్‌లో శనివారం రాత్రి చికెన్ ఫ్రై, బిర్యానీని వెంకోబ్ కంపెనీ వారు ఉచితంగా పంపిణీ చేయగా వందలాది మంది ఎగబడ్డారు. వెనుకవచ్చిన వారికి అందకపోయే సరికి నిర్వాహకులతో వాదనకు దిగారు. ఖమ్మంలో బాబూరావు అనే కోళ్ల సరఫరాదారు ప్రకాశ్‌నగర్‌లో ఆదివారం క్వింటా చికెన్ బిర్యానీ, అరక్వింటా చికెన్ ఫ్రై ఉచితంగా పంపిణీ చేయగా అక్కడా ఇలాగే బారులుదీరారు. సత్తుపల్లి మండలం కిష్టారంలో పశుసంవర్ధకశాఖ వైద్యుల సమక్షంలో 500 కేజీల చికెన్‌ను ఉచితంగా పంపిణీ చేయగా జనం ఎగబడ్డారు. కానీ ఈ ఆదివారం కూడా ఏ చికెన్ దుకాణంలోనూ 5శాతం వ్యాపారం కూడా జరగలేదు. ఖమ్మం ఎన్టీఎస్టీ రోడ్డులోని రహమాన్ అనే చికెన్‌షాప్ యజమాని బేరాలు లేవని నాలుగు రోజులుగా షాప్ తీయటం లేదు. ఆదివారం కొంటారనే ఉద్దేశంతో దుకాణం తెరిస్తే రోజంతా వేచివున్నా ఐదుగురికి మించి కొనుగోలు చేయలేదు. ఉచితమంటే బర్డ్‌ఫ్లూ భయంలేని జనాలు.. చికెన్ కొనేందుకు ఆసక్తి చూపకపోవడం విస్తుగొల్పుతోందనే చర్చ సాగుతోంది.

# అప్పుల కుప్పలు !

(మొదటిపేజీ తరువాయి)

సేకరిస్తున్నాయి. ఇవి ప్రభుత్వ పుస్తకాలలో కన్పించవు. ఏటా పెరిగిపోతున్న రుణాల పద్దులు రాష్ట్ర బడ్జెట్లలో అధికారికంగా కన్పించవు కానీ తీసుకున్న రుణాన్ని ఎప్పటికైనా చెల్లించాల్సిందే కదా? ఉదాహరణకు 2021-22లో బడ్జెట్‌లో చూపించకుండా తమిళనాడు చేసిన అప్పులు జీఎస్డీపీలో 1.55 శాతం. తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ, తమిళనాడు పౌర సరఫరాల కార్పొరేషన్ వంటి

ప్రభుత్వ సంస్థల ద్వారా రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకునే రుణాలకు రాష్ట్ర ప్రభుత్వమే హామీగా ఉంటుంది. ఒకవేళ ఆ సంస్థ చేతులెత్తేస్తే పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో ప్రభుత్వం ఆ అప్పును తీరుస్తుంది. ఇందుకు పంజాబ్, రాజస్థాన్, బీహార్ రాష్ట్రాలకు చెందిన విద్యుత్ పంపిణీ కంపెనీలు, రవాణా సంస్థలే ఉదాహరణ.

**మూలధనపు వ్యయంపై దృష్టి ఏది?**

అనేక రాష్ట్రాలు మూలధనపు పెట్టుబడులను పట్టించుకోకుండా అడ్డగోలుగా ఖర్చు చేశాయి. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు మౌలిక సదుపాయాల కోసం నిధులు అవసరమే అయినప్పటికీ మూలధనపు వ్యయానికి తమ బడ్జెట్లలో చాలా తక్కువ మొత్తాన్ని కేటాయించాయి. నిధులను చాలా వరకూ పరిపాలనా సంబంధమైన ఖర్చులకు మళ్లించాయి. మరో దారుణమైన విషయమేమంటే అనేక రాష్ట్రాలు పాత అప్పులు తీర్చడానికి కొత్తగా రుణాలు తీసుకుంటున్నాయి. ఇది ఓ సైకిల్ చక్రం వంటిది. ద్రవ్య నిర్వహణ అంటే ఇది కాదు. అది ఆర్థిక మనుగడ కోసం చేసే ప్రయత్నం మాత్రమే.

**రాష్ట్రాల పనితీరు ఇలా...**

ప్రాథమికమైన సామాజిక, ఆర్థిక సేవలు అందించే విషయంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పోలిస్తే కేరళ, ఢిల్లీ, గోవా, సిక్కిం వంటివి మెరుగైన పనితీరు కనబరిచాయని సెంటర్ ఫర్ న్యూ ఎకనమిక్ స్టడీస్ (సీఎన్ఈఎస్) గత సంవత్సరం తెలిపింది. ప్రజలకు విద్య, వైద్యం, సామాజిక భద్రత, ఆర్థిక భద్రత, మౌలిక సదుపాయాలు వంటి సేవలు అందించడంలో ఆ రాష్ట్రాలు ముందున్నాయని చెప్పింది. ఈ సేవల కల్పనలో ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, అస్సాం, ఒడిషా, మధ్యప్రదేశ్ బాగా వెనుకబడి పోయాయి. మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, త్రిపుర, పశ్చిమ బెంగాల్, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాల పనితీరు ఇంకా మెరుగుపడాలి. తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, మిజోరం, కర్నాటక రాష్ట్రాలు తమ ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రయత్నం చేస్తున్నాయి. కేరళ, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలు అధిక రుణ భారంతో ఇబ్బంది పడుతున్నప్పటికీ ప్రజలకు ప్రాథమిక సామాజిక, ఆర్థిక సేవలు అందజేయగలుగుతున్నాయి. అందుకే ఆ రాష్ట్రాలు అధిక ఉత్పాదకతను సాధిస్తున్నాయి. అదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, జార్ఖండ్ (వీటిలో నాలుగు బీజేపీ పాలిత రాష్ట్రాలే) పేలవమైన పనితీరు కనబరిచాయి. బీజేపీ యేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాల విషయంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఏ విధంగా వివక్ష ప్రదర్శిస్తున్నదో కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పలు సందర్భాలలో ప్రస్తావించారు.

# కేంద్రం కరుణిస్తేనే రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై రాష్ట్రంలోని అన్ని వర్గాల నుంచి ఒత్తిడి పెంచేందుకు రేవంత్ సర్కార్ సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో శనివారం హైదరాబాద్‌లో బీసీ సంఘాలతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము చేసేదంతా చేస్తున్నామనీ, చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. ఈ దిశగా రాష్ట్రంలోని బీసీ సంఘాలు తమ వంతు కృషి చేయాలని కోరారు.

**స్థానిక సంస్థలు...**

అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టబద్ధతతో సంబంధం లేకుండానే రిర్వేషన్లను అమలు పరచవచ్చని బీసీ సంఘాలు అంటున్నాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించితే పార్లమెంట్ ఆమోదం తప్పనిసరని సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు విద్య, ఉద్యోగాలకే పరిమితమని వారంటున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 242 ప్రకారం స్థానిక సంస్థలకు ఈ తీర్పు వర్తించదని వారి వాదన. అయితే ఎవరైనా దీనిపై కోర్టును ఆశ్రయిస్తే మాత్రం ఎన్నికలకు ఆటంకం తప్పదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలా ముందుకెళుతుందనే విషయంపై సందిగ్ధత నెలకొంది.

**తమిళనాడులో 69 శాతం...**

దేశంలో 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తమిళనాడు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జనాభా ఆధారంగా 1993లో తమిళనాడు ప్రభుత్వం వారికి 69 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించి, అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. రిజర్వేషన్లను 50 శాతం కంటే ఎక్కువ అమలు చేయరాదంటూ 1992లో సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ క్రమంలో కొంతమంది తమిళనాడు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మద్రాస్ హైకోర్టుకు వెళ్లగా రిజర్వేషన్లను 50 శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దాంతో అప్పుడు అధికారంలో ఉన్న ఏఐడీఎంకే ప్రభుత్వం అఖిల పక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంతో చర్చలు జరిపి వాటికి చట్టబద్ధతను సాధించింది. అప్పటి నుంచి ఆ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

# మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించానని చెప్పారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో పాటు గిరిజన, కేజీబీవీ, మోడల్ తదితర స్కూళ్ల సమస్యలపైనా కృషి చేసినట్టు తెలిపారు. జూనియర్ లెక్చరర్స్ బదిలీలు, కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్, గెస్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారంలోనూ తానున్నానని చెప్పారు. సీపీఎస్ రద్దు కోసం శాసన మండలిలో మాట్లాడినట్టు తెలిపారు. నల్లగొండ నుంచి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం (ప్రగతిభవన్) వరకు నాలుగురోజులు నడకయాత్ర, శాసనమండలి జరిగే సమయంలో ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి శాసనమండలి వరకు సమస్యల బ్యానర్‌తో నడుచుకుంటూ వెళ్ళి, నిరసన వ్యక్తం చేశానని చెప్పారు. కాగా తనను మరోసారి ఎమ్మెల్సీగా గెలిపిస్తే 2023 డీఎస్సీ ఉపాధ్యాయులతో సహ సెప్టెంబర్ 2004 నుంచి ఉద్యోగాల్లోకి వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేయించి ఓపీఎస్ అమలు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 010 ద్వారా జీతాల చెల్లింపు సమస్యల పరిష్కారం కోసం కషి చేస్తానని తెలిపారు.

జూనియర్ కళాశాలలకు నిర్వహణ గ్రాంటు మంజూరు, ఇతర సమస్యల పరిష్కారంతో పాటు డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ అధ్యాపకులకు 7వ కేంద్ర ప్రభుత్వ పీఆర్సీ, ఏరియర్స్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. అలాగే, ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పీఎఫ్ అమలు, హెల్త్ స్కీం, రిటైర్మెంటు సందర్భంలో ఎక్స్‌గ్రేషియో చెల్లింపు, అర్హులైన వారికి ప్రభుత్వ గృహనిర్మాణంలో అవకాశం తదితర సమస్యలపై వారికి అండగా ఉంటానని అన్నారు. ఎమ్మెల్సీ బాధ్యతను ప్రస్తుతం ఎలా ఉపయోగించానో, అదే పద్ధతిలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి వినియోగిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.రామనరసయ్య, పుప్పాల వీరన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సీహెచ్ భిక్షం, టీజీజేఎల్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పూర్ణచంద్రరావు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎస్.సోమయ్య, ఎస్.అనిల్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కోశాధికారి జి. వెంకటయ్య, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో స్వర్ణ విమాన గోపురం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద దిగి, రోడ్డు మార్గంలో కొండ పైకి చేరుకుంటారని ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా పోలీసులు హెలిప్యాడ్ వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. చివరి క్షణంలో రద్దయినట్టు తెలిసిం ది. కాగా, స్వర్ణ విమాన గోపురం శిఖరం ఆవిష్కరణ నేపథ్యంలో ఆదివారం భక్తులు యాదాద్రికి భారీగా చేరుకున్నారు. ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత భక్తులను అక్కడికి వెళ్ళడానికి పోలీసులు అనుమతించారు. యాదగిరిగుట్టకు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చిన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు ఐదంచెల రక్షణ వలయం ఏర్పాటు చేశారు. స్థానిక నూతన బస్టాండు, చెక్‌పో స్టు, దేవాలయ ప్రాంగణం మార్గం వద్ద తనిఖీలు నిర్వహించారు. యాదగిరి గుట్టపై రక్షణ కోసం ఇతర పనుల కోసం ఏర్పాటుచేసిన వాకీటాకీలు పనిచే యకపోవడంతో దేవాలయ పోలీస్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# రాష్ట్రంలో కొత్త లిక్కర్ బ్రాండ్లకు గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించింది. ఇందుకు సంబంధించి విధివిధానాలను ప్రకటించింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో లేని విదేశీ, దేశీయ లిక్కర్, బీర్ కంపెనీలకు అవకాశం ఇవ్వనున్నారు నాణ్యత, ప్రమాణాలపై సెల్ సర్టిఫికేషన్ సమర్పించాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి ఆరోపణలు లేవని తెలుపుతూ దరఖాస్తుతో పాటు సేల్ సర్టిఫికేషన్ జతపరచాలని టీజీబీసీఎల్ తెలిపింది. కొత్త కంపెనీల నుంచి వచ్చిన దరఖాస్తులను పది రోజులపాటు ఆన్‌లైన్‌లో పెట్టనున్నారు. వాటిపై వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపి అనుమతులపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే రిజిస్టర్ కాబడి సరఫరా చేస్తున్న కంపెనీలు మాత్రం ప్రస్తుతం ఉన్న పద్ధతిలోనే కొత్త బ్రాండ్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణలో పలు కొత్త కంపెనీలు తమ ఉత్పత్తుల ను అమ్ముకోవడానికి గతంలోనే టీజీబీసీఎల్ కొందరికి అనుమతులు ఇవ్వడం జరిగింది. కానీ వాటిపై పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన కొత్త బ్రాండ్లను నిలిపివేసిన విషయం విధితమే.

# ట్రంప్ ఫైర్

**వాషింగ్టన్ :** భారత్‌కు అమెరికా సాయం (యూఎస్ఏఐడీ)పై అధ్యక్షులు ట్రంప్ ఆదివారం మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా సాయాన్ని భారత్ అవకాశంగా తీసుకుంటోందనీ, అసలు భారత్‌కు అమెరికా ఎందుకు సాయం అందిస్తోందని ఆయన ప్రశ్నించారు. అమెరికా వస్తువులపై విధించిన అధిక సుంకాలతో భారత్ ఇప్పటికే ప్రయోజనం పొందుతోందని ఆరోపించారు. భారత్‌లో ఎన్నికల కోసం సాయం ఎందుకు చేయాలని ప్రశ్నించారు. ఎన్నికల కోసం భారత్‌కు డబ్బు ఇస్తున్నామనీ, భారత్‌కు సాయం అవసరం లేదని శనివారం వాషింగ్టన్‌లోని కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫరెన్స్ (సీపీఏసీ)ని ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు. "మనం పాత పేపర్ బ్యాలెట్‌లకు తిరిగి వెళ్లి, మన ఎన్నికలలో మనకు సహాయం చేయడానికి ఆ దేశాలను ఎందుకు అనుమతించకూడదు. వారికి డబ్బు అవసరం లేదు. మనం ఎన్నికల కోసం భారత్‌కు డబ్బు ఇస్తున్నాం. వారికి డబ్బు అవసరం లేదు. వారు మన సాయాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. ప్రపంచంలో అధిక సుంకాలు విధించే దేశాలలో భారత్ కూడా ఒకటి. వారికి 200 శాతం టారిఫ్ ఉంది. మనం ఎన్నికల కోసం వారికి చాలా డబ్బు ఇచ్చాం" అని ట్రంప్ అన్నారు.

# కార్మికులను రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్ఎస్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. సహాయక చర్యలకు వాటర్ ఫ్లోటింగ్ ఆటంకంగా మారిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీటిని నిరంతరం బయటకు తోడేయటంతోపాటు సొరంగంలోనికి ఆక్సిజన్ అందించే ఏర్పాట్లు చేసినట్టు అధికారులకు వివరించారు. టన్నెల్‌లో కూలిన మట్టి దిబ్బలను తొలగించి ప్రమాదం జరిగిన చోటికి చేరుకునే ప్రత్నామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి పలుమార్లు మాట్లాడారు. సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను కాపాడేందుకు రెండోరోజు నిర్విరామంగా సహాయక చర్యలను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పర్యవేక్షించారు. ఇండియన్ ఆర్మీతోపాటు ఇండియన్ నేవీ కూడా రంగంలోకి దిగాయి. ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ ఏజెన్సీలు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.



## స్టేడియంలో సెలబ్రిటీలు

దాయాదుల మ్యాచ్‌కు తరలిన తారలు

**దుబాయ్ :** భారత్, పాకిస్థాన్ మ్యాచ్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇరు జట్ల అభిమానులతో పాటు ప్రపంచ క్రికెట్ ప్రియులు సైతం దాయాదుల ఢీ కోసం ఎదురు చూస్తారు. ఈసారి దాయాదుల పోరుకు వేదిక దుబాయ్ కావటంతో సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు స్టేడియానికి తరలి వెళ్లారు. సినీ నటులు మెగాస్టార్ చిరంజీవి, ప్రముఖ దర్శకుడు సుకుమార్, యువ క్రికెటర్ తిలక్ వర్మ, అభిషేక్ శర్మ ఓ స్టాండ్‌లో నుంచి మ్యాచ్‌ను తిలకించారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోశ్ కుమార్, బాలీవుడ్ హీరో వివేక్ ఒబేరాయ్, ప్రభుత్వ క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌లు మ్యాచ్‌ను తిలకించారు. ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తోడుగా ఎంపీ, ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు కేశినేని చిన్ని మ్యాచ్‌ను వీక్షించారు.



# కోహ్లి శతకం.. పాక్ ఖేల్ ఖతం

- 6 వికెట్లతో పాక్‌పై భారత్ ఘన విజయం
- ఛేదనలో విరాట్ కోహ్లి అజేయ సెంచరీ
- రాణించిన శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్

**ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లి (100 నాటౌట్) చెలరేగాడు. చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య జట్టు పాకిస్థాన్ కథ ముగిసింది. పాకిస్థాన్‌కు చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా అదరగొట్టింది. బ్యాట్‌తో, బంతితో దుమ్మురేపిన భారత్.. 2017 చాంపియన్స్ ఫైనల్ పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది. ఈ ఓటమితో చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ నాకౌట్ ఆశలు ఆవిరయ్యాయి.**

**స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/40), హార్దిక్ పాండ్య (2/31)తో విజృంభించగా తొలుత పాకిస్థాన్ 241 పరుగులకే కుప్పకూలింది. కఠిన పిచ్‌పై ఛేదనలో విరాట్ కోహ్లి అజేయ సెంచరీతో కదం తొక్కగా, శ్రేయస్ అయ్యర్ (56) అర్ధ సెంచరీతో రాణించాడు. మరో 45 బంతులు ఉండగానే భారత్ లాంఛనం ముగించింది. గ్రూప్-ఏ నుంచి భారత్ సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోగా.. పాకిస్థాన్ మరో మ్యాచ్ ఉండగానే ఇంటిబాట పట్టింది.**

నవతెలంగాణ-దుబాయ్

చిరకాల ప్రత్యర్థి, దాయాది పాకిస్థాన్‌పై ఛేదనలో విరాట్ కోహ్లి (100 నాటౌట్, 111 బంతుల్లో 7 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. సవాల్‌తో కూడిన పిచ్‌పై సమయోచిత ఇన్నింగ్స్‌తో కదం తొక్కిన విరాట్ కోహ్లి వన్డేల్లో రికార్డు 51వ శతకం నమోదు చేశాడు. 242 పరుగుల లక్ష్యాన్ని 42.3 ఓవర్లలోనే పూర్తి చేసిన టీమ్ ఇండియా మరో 45 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. ఈ ఓటమితో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ రేసు నుంచి ఆతిథ్య జట్టు, డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్ నిష్క్రమించింది. గ్రూప్-ఏలో వరుసగా రెండో విజయంతో టీమ్ ఇండియా సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ (56, 67 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (46, 52 బంతుల్లో 7 ఫోర్లు) రాణించారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు కుప్పకూలింది. సయీద్ షకీల్ (62, 76 బంతుల్లో 5 ఫోర్లు), కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ (46, 77 బంతుల్లో 3 ఫోర్లు), ఖుష్దిల్ షా (38, 39 బంతుల్లో 2 సిక్సులు) రాణించారు. భారత బౌలర్లు కుల్దీప్ యాదవ్ (3/40), హార్దిక్ పాండ్య (2/31) బంతితో అద్భుత ప్రదర్శన చేశారు. ఛేదనలో సూపర్ సెంచరీ సాధించిన విరాట్ కోహ్లి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో చివరి మ్యాచ్‌లో మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత్ ఆడనుంది.

**ఛేదనలో విరాట పర్వం :**

242 పరుగుల ఛేదనలో భారత్‌కు మంచి ఆరంభం లభించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (20) సహజశైలిలో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ధనాధన్ షో చేశాడు. శుభ్‌మన్ గిల్ (46) సూపర్ ఫామ్‌ను కొనసాగించాడు. షహీన్ షా అఫ్రిది బంతికి పవర్‌ప్లేలోనే రోహిత్ నిష్క్రమించినా.. యువ ఓపెనర్ శుభ్‌మన్‌తో కలిసి విరాట్ కోహ్లి (100 నాటౌట్) ఛేదనను ముందుండి నడిపించాడు. పవర్‌ప్లేలో పదునైన పేస్‌ను ఎదుర్కొన్న కోహ్లి.. మిడిల్ ఓవర్లలో స్పిన్‌తో పాక్ కవ్వించినా సహనంతో బ్యాటింగ్ చేశాడు. దూకుడుగా ఆడే ప్రయత్నం చేయకుండా పరుగుల వేటపై దృష్టి నిలిపాడు. ఒక్కో పరుగు జోడిస్తూ స్కోరు బోర్డును కదిలించాడు. కోహ్లి, గిల్ జోడీ రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించి భారత్‌ను మూడంకెల స్కోరుకు చేర్చింది.

శ్రేయస్ అయ్యర్ (56)తో జతకట్టిన విరాట్ కోహ్లి మూడో వికెట్‌కు ఏకంగా 114 పరుగులు జోడించాడు. అయ్యర్, విరాట్ భాగస్వామ్యం మ్యాచ్‌ను టీమ్ ఇండియా వశం చేసింది. అయ్యర్ కాస్త దూకుడుగా ఆడినా.. విరాట్ కోహ్లి సహనం కోల్పోలేదు. నాలుగు ఫోర్లతో 62 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన కోహ్లి.. మరో మూడు ఫోర్లతో 111 బంతుల్లో కెరీర్ 51వ వన్డే సెంచరీ సాధించాడు. శ్రేయస్ అయ్యర్ నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 63 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్నాడు. ఇమామ్ ఉల్ హక్ సూపర్ క్యాచ్‌తో శ్రేయస్ అవుటైనా.. అక్షర్ పటేల్ (3 నాటౌట్) తోడుగా కోహ్లి లాంఛనం ముగించాడు. హార్దిక్ పాండ్య (8) ఓ బౌండరీతో మెరిశాడు. ఖుష్దిల్ షా ఓవర్లో బౌండరీ బాదిన కోహ్లి భారత్‌కు గెలుపుతో పాటు శతకం సైతం అందుకున్నాడు. పాక్ బౌలర్లలో అఫ్రిది (2/74), అబ్రార్ (1/28) రాణించారు.



**మెరిసిన బౌలర్లు :**

బౌలర్లు సమిష్టి ప్రదర్శనతో పాక్‌ను ఆలౌట్ చేశారు. ఇమామ్ ఉల్ హక్ (10), బాబర్ (23)లు త్వరగా అవుటైనా.. సయీద్ షకీల్ (62), మహ్మద్ రిజ్వాన్ (46)లు మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి పాక్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. కానీ ఈ ఇద్దరు నిష్క్రమణతో కథ మొదటికొచ్చింది. సల్మాన్ ఆఘా (19), ఖుష్దిల్ షా (38) చివర్లో మెరవటంతో పాకిస్థాన్ 241 పరుగులైనా చేయగలిగింది. కుల్దీప్ మూడు వికెట్లు పడగొట్టగా.. హార్దిక్ రెండు వికెట్లు తీసుకున్నాడు. మహ్మద్ షమికి వికెట్లు దక్కలేదు.

**స్కోరు వివరాలు :**

**పాకిస్థాన్ ఇన్నింగ్స్ :** ఇమామ్ ఉల్ హక్ (రనౌట్) 10, బాబర్ ఆజామ్ (సి) రాహుల్ (బి) హార్దిక్ పాండ్య 23, సయీద్ షకీల్ (సి) అక్షర్ పటేల్ (బి) హార్దిక్ పాండ్య 62, మహ్మద్ రిజ్వాన్ (బి) అక్షర్ పటేల్ 46, సల్మాన్ ఆఘా (సి) జడేజా (బి) కుల్దీప్ యాదవ్ 19, తయ్యబ్ తాహిర్ (బి) జడేజా 4, ఖుష్దిల్ షా (బి) కోహ్లి (బి) హర్షిత్ రానా 38, షహీన్ షా అఫ్రిది (ఎల్బీ) కుల్దీప్ యాదవ్ 0, నసీం షా (సి) కోహ్లి (బి) కుల్దీప్ యాదవ్ 14, హరీశ్ రవూఫ్ (రనౌట్) 8, అబ్రార్ అహ్మద్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 17, **మొత్తం : (49.4 ఓవర్లలో ఆలౌట్) 241.**

**వికెట్ల పతనం :** 1-41, 2-47, 3-151, 4-159, 5-165, 6-200, 7-200, 8-222, 9-241, 10-241.

**బౌలింగ్ :** మహ్మద్ షమి 8-0-43-0, హర్షిత్ రానా 7.4-0-30-1, హార్దిక్ పాండ్య 8-0-31-2, అక్షర్ పటేల్ 10-0-49-1, కుల్దీప్ యాదవ్ 9-0-40-3, రవీంద్ర జడేజా 7-0-40-1.

**భారత్ ఇన్నింగ్స్ :** రోహిత్ శర్మ (బి) షహీన్ షా అఫ్రిది 20, శుభ్‌మన్ గిల్ (బి) అబ్రార్ అహ్మద్ 46, విరాట్ కోహ్లి నాటౌట్ 100, శ్రేయస్ అయ్యర్ (సి) ఇమామ్ ఉల్ హక్ (బి) ఖుష్దిల్ షా 56, హార్దిక్ పాండ్య (సి) రిజ్వాన్ (బి) షహీన్ షా అఫ్రిది 8, అక్షర్ పటేల్ నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (42.3 ఓవర్లలో 4 వికెట్లకు) 244.**

**వికెట్ల పతనం :** 1-31, 2-100, 3-214, 4-223.

**బౌలింగ్ :** షహీన్ షా అఫ్రిది 8-0-74-2, నసీం షా 8-0-37-0, హరీశ్ రవూఫ్ 7--0-52-0, అబ్రార్ అహ్మద్ 10-0-28-1, ఖుష్దిల్ షా 7.3-0-43-1, సల్మాన్ ఆఘా 2-0-10-0.

# ఐసీసీకి పీసీబీ మళ్లీ ఫిర్యాదు

ఈసారి భారత జాతీయ గీతంపై..




**దుబాయ్ :** ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ మొదలైనా ఆతిథ్య దేశం పాకిస్థాన్‌కు కష్టాలు తప్పటం లేదు. టీమ్ ఇండియా పాకిస్థాన్‌లో పర్యటించేందుకు నిరాకరించటంతో టోర్నమెంట్‌ను హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆరంభ మ్యాచ్‌కు ముందు రోజు కరాచి స్టేడియంలో భారత జాతీయ జెండా ఎగురవేయలేదని వివాదం రేగగా.. భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ ప్రసారదారు భారత్‌లో టెలివిజన్ తెరపై ఆతిథ్య దేశం పేరు ప్రదర్శించలేదని మరో వివాదం రేగింది. ఈ విషయంపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఇప్పటికే ఐసీసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది. తాజాగా, కరాచిలో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మ్యాచ్ ముంగిట జాతీయ గీతాల ఆలపించిన సమయంలో పాకిస్థాన్ అభిమానులను ఇబ్బందిపెట్టే మరో సన్నివేశం చోటుచేసుకుంది. ఇంగ్లాండ్ జాతీయ గీతం వినిపించిన అనంతరం.. ఆస్ట్రేలియా జాతీయ గీతం ప్లే చేయాలి. కానీ అందుకు బదులుగా కొన్ని క్షణాల పాటు భారత జాతీయ గీతం వినిపించింది. పొరపాటు సరిదిద్దుకుని వెంటనే ఆసీస్ జాతీయ గీతం వేసినా.. అప్పటికే పీసీబీ అసంతృప్తి తారాస్థాయికి చేరింది. పాకిస్థాన్‌లో భారత మ్యాచులు లేకపోయినా.. ఆ జట్టు జాతీయ గీతం రికార్డింగ్‌లో ఎలా ఉంటుందని పీసీబీ ప్రశ్నిస్తోంది. దీనిపై వివరణ కోరుతూ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి మరో లేఖ రాసింది. 'చాంపియన్స్ ట్రోఫీ ఐసీసీ టోర్నమెంట్. మ్యాచుకు ముందు జాతీయ గీతాలు వినిపించటం సైతం ఐసీసీ బాధ్యత. ముందుగానే జాతీయ గీతాల బాధ్యులకు రికార్డింగ్‌లు వినిపిస్తారు. అయినా, భారత జాతీయ గీతం ఎందుకు ప్లే చేశారనే అంశంపై విచారణ జరిపాలి' అని పీసీబీ అధికారి ఒకరు తెలిపారు. ఐసీసీ మాత్రం సాంకేతిక తప్పిదంతోనే అలా జరిగిందని, అంతకుమించి ఏమీ లేదని చెబుతోంది.



# బుమ్రాకు ఐసీసీ అవార్డులు

ప్రదానం చేసిన ఐసీసీ అధ్యక్షుడు జై షా

**దుబాయ్ :** భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ పురస్కారాలు అందుకున్నాడు. దుబాయ్‌లో ఆదివారం భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు జరిగిన కార్యక్రమంలో ఐసీసీ అధ్యక్షుడు జై షా అవార్డులను బుమ్రాకు అందజేశాడు. ఐసీసీ మెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌తో పాటు ఐసీసీ మెన్స్ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాలను బుమ్రా దక్కించుకున్నాడు. ఐసీసీ టెస్టు, టీ20 జట్లలోనూ చోటు దక్కించుకున్నాడు. క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారంతో పాటు సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ అవార్డును బుమ్రా సొంతం చేసుకున్నాడు. ఐసీసీ టెస్టు, టీ20 జట్లలో నిలిచినందుకు ప్రత్యేకంగా రూపొందించిన క్యాప్‌లను ప్రదానం చేశారు. సతీమణి సంజన గణేశన్‌తో కలిసి అవార్డు వేడుకకు హాజరైన బుమ్రా.. అంతకుముందు ప్రాక్టీస్ చేస్తున్న భారత క్రికెటర్లతో కలిసి ముచ్చటించాడు. కుటుంబ సభ్యులతో కలిసి భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ను వీక్షించాడు.



# భిన్న సైకలాజికల్ థ్రిల్లర్..

పలు భాషలలో 34 చిత్రాలకు డీవోపీగా పని చేసిన సినిమాటోగ్రాఫర్ ఆండ్రూ బాబు 'బూమరాంగ్' సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని బిగ్ మూవీ మేకర్స్ లిమిటెడ్, మై3 ఆర్ట్స్ బ్యానర్‌లపై లండన్ గణేష్, డా.ప్రవీణ్ రెడ్డి వూట్ల నిర్మిస్తున్నారు. సితార ఫిల్మ్స్ లిమిటెడ్ లైన్ ప్రొడక్షన్‌ని నిర్వహిస్తోంది. ఆదివారం మేకర్స్ ఈ చిత్ర గ్లింప్స్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో శివ కందుకూరి మాట్లాడుతూ,'ఈ సినిమా చేయడానికి మెయిన్ రీజన్ ఆండ్రూ. ఈ సినిమాలో ఒక డార్క్ సైడ్ కూడా ఉంది. అలాగే ఈ సినిమాలో అండర్ కరెంట్ ఎమోషన్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ఖచ్చితంగా ఇది డిఫరెంట్ మూవీ అవుతుంది' అని తెలిపారు.

'నేను కెమెరామెన్‌గా ఎన్నో సినిమాలు చేశాను. డైరెక్షన్ చేయాలని కోరిక ఎప్పటినుంచో ఉండేది. కరోనా సమయంలో చాలా కథలు రాశాను. అందులో ఫస్ట్ సెలెక్ట్ చేసిన కథ 'బూమరాంగ్'. ఈ కథ చెప్పినప్పుడు నిర్మాత ప్రవీణ్ వెంటనే అంగీకరించారు. ఈ స్క్రిప్ట్ చాలా బాగా వచ్చింది. ఇది మెసేజ్ ఓరియెంటెడ్ సైకలాజికల్ థ్రిల్లర్' అని డైరెక్టర్ ఆండ్రూ బాబు చెప్పారు.

నిర్మాత డా. ప్రవీణ్ రెడ్డి వూట్ల మాట్లాడుతూ,'ఈ సినిమా కర్మ సిద్ధాంతం ఆధారంగా తీశాం. ఆండ్రూ సీనియారిటీ బాగా కలిసొచ్చింది. శివ చాలా సపోర్ట్ చేశారు. అనూప్ రూబెన్స్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. అందరి సహకారంతో అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ,' ఆండ్రూ, నేను కలిసి చాలా సినిమాలకి వర్క్ చేశాం. తను చాలా ప్యాషనేట్ టెక్నీషియన్. ఈ సినిమాని అద్భుతమైన టేకింగ్‌తో తీశారు. శివ, అను చాలా చక్కగా నటించారు. ఇది చాలా మంచి థ్రిల్లర్' అని తెలిపారు.

## నవచిత్రం

# కుల వివక్షపై ఎక్కుపెట్టిన అస్త్రం



హరిప్రసాద్, సింధూర

ప్రేమ.. లవ్.. ఇష్క్. రెండక్షరాల ఈ పదం యువతను ఎలా మెస్మరైజ్ చేస్తుందో తెలుసు కదా.

ఎవరు, ఎప్పుడు, ఎలా, ఎవరితో లవ్‌లో పడతారో తెలీదు. ప్రేమకు కులం-మతం అడ్డుకావని నిరూపించిన ఘటనలెన్నో. కుల వివక్షకు, పరువు కోసం బలైన ప్రాణాలు -ప్రేమలెన్నెన్నో. ముఖ్యంగా కుల దురహంకారానికి బలైన యువ జంటలు చాలానే. అలాంటి కుల వివక్ష, పరువు హత్యలపై ఎక్కు పెట్టిన సినిమా 'ఓ ప్రేమ కథ'. రాజ్ కుమార్ మండల డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా వాలెంటైన్స్ డే రోజున రవీంద్ర భారతి పైడి జయరాజ్ ఆడిటోరి యంలో సీనియర్ డైరెక్టర్ వి.సముద్ర ఆధ్వర్యంలో రిలీజైంది.

హరి ప్రసాద్-సింధూర లీడ్ రోల్ చేశారు. బీటెక్ చదివి క్యాంపస్ సెలెక్షన్స్‌లో జాబ్ వచ్చినా తాత కోసం ఉన్న ఊర్లోనే వ్యవసాయం చేస్తుంటాడు హరి. ఉన్నతమైన భావాలు గల హరి తన ఊరి ప్రెసిడెంట్ కూతురు సింధూరను ప్రేమిస్తాడు. కులాంతర వివాహం చేసుకున్నందుకు తన తల్లిదండ్రులిద్దరినీ పెత్తందారులు హతమారుస్తారు. తన మనవడు కూడా అలాగే పరువు హత్యకు బలవుతాడా అని హరి తాత మదనపడుతూ ఉంటాడు. తమ ప్రేమను అంగీకరించరని, లేచిపోయి పెళ్లి చేసుకుందామని ప్రపోజల్ పెడుతుంది సింధూర. దానికి ఒప్పుకోని హరి పెద్దల్ని ఒప్పించే పెళ్లి చేసుకుందాం అంటాడు. ఓ దశలో సింధూర తండ్రి, అన్నలు హరిని చంపే ప్రయత్నం కూడా చేస్తారు. ఇంతకీ హరి-సింధూర ఒక్కటవుతారా?, పెద్దలను ఎదురించి ఏకమవుతారా?, లేక కులరక్కసికి బలవుతారా అన్నది క్లైమాక్స్. తమాడ మీడియా సమర్పించిన ఈ సినిమా రన్‌వే రీల్ యూట్యూబ్ ఛానల్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. రైటర్ బాలు రాసిన డైలాగ్స్ అద్భుతంగా ఉన్నాయని, ఈ సినిమా యువతని, తల్లితండ్రులను ఆలోచింపజేసేలా ఉందని వీక్షకులు ప్రశంసిస్తున్నారు.

## బ్యూటీలో ప్రయోగాత్మక శిక్షణ



ముమైత్ ఖాన్

బ్యూటీ ఎడ్యుకేషన్, ట్రైనింగ్‌లో కొత్త శకానికి నాంది పలుకుతూ యూసుఫ్‌గూడలోని వీలైక్ మేకప్ అండ్ హెయిర్ అకాడమీ బ్రైడల్, మేకప్, హెయిర్ స్టైలింగ్, కాస్మోటాలజీ, స్కిన్‌కేర్, వెల్‌నెస్‌లో నైపుణ్యం పై సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వీలైక్ అకాడమీ డైరెక్టర్ ముమైత్ ఖాన్‌తో పాటు కో ఫౌండర్స్ కెయిత్, జావేద్, ఆర్టిస్టులు జ్యోతి, అక్సా ఖాన్, సింగర్ రోల్ రైడా, డ్యాన్స్ మాస్టర్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

వీలైక్ మేకప్, హెయిర్ అకాడమీ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ ముమైత్ ఖాన్ , 'ఇప్పటి తరంతో పాటు తదుపరి తరం నిపుణులను ప్రోత్సహించడానికి సమగ్ర పాఠ్య ప్రణాళిక, అత్యాధునిక సౌకర్యాలు, పరిశ్రమ, ప్రముఖ బోధకుల బృందంతో పాటు వీలైక్ సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మక విశ్వాసంతో విద్యార్థులను శక్తివంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. బ్యూటీ పరిశ్రమపై మక్కువ ఉన్న వ్యక్తులను ప్రేరేపించడం, వారికి అవగాహన కల్పించడం బ్రైడల్ అండ్ హెయిర్ మేకప్ ట్రైనింగ్ ప్రాధాన్యంగా, ప్రపంచం స్థాయిలో ట్రెయిన్డ్ స్పెషలిస్ట్‌గా తయారు చేయడం మా లక్ష్యం' అని అన్నారు.

'ప్రయోగాత్మక శిక్షణ, వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వం, తాజా పరిశ్రమ పోకడలను బహిర్గతం చేయడం ద్వారా మా విద్యార్థులు వారి అభిరుచిని, అభివృద్ధి చెందుతున్న కెరీర్‌లుగా మార్చడంలో మేము సహాయపడగలమని విశ్వసిస్తున్నాం. వాస్తవ-ప్రపంచ సెలూన్ అనుభవాలను అనుకరిస్తూ, పోటీ మార్కెట్‌లో రాణించడానికి, వారిని సిద్ధం చేసే అభ్యాస వాతావరణం ఇక్కడ ఉంటుంది' అని వీలైక్ కో ఫౌండర్స్ కెయిత్, జావేద్ తెలిపారు.





# 40 నిమిషాల్లో ఎయిర్‌పోర్ట్ టూ ఫ్యూచర్ సిటీ..

ఎయిర్‌పోర్ట్ నుంచి మొదలై రావిర్యాల మీదుగా గ్రీన్ కారిడార్ మెట్రో రైల్ :


ఎయిర్ పోర్ట్ మెట్రో కారిడార్‌లో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫ్యూచర్ సిటీకి అనువుగా గ్రీన్ కారిడార్‌ను అభివృద్ధి చేసి, అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి త్వరితగతిన సులభంగా ఫ్యూచర్ సిటీకి చేరుకునే ప్రణాళిక ఉండాలన్నది ముఖ్యమంత్రి అభిమతం. ఈ ఆలోచనలు వాస్తవరూపం దాల్చేందుకు కసరత్తు చేస్తున్నామని, దాదాపు 15వేల ఎకరాల్లో విస్తరించనున్న భవిష్య నగరిని కాలుష్యరహిత నగరంగా రూపొందించడంలో, దానికి అంతర్జాతీయ స్థాయి ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో మెట్రో రైలుతో కూడిన ఈ గ్రీన్ కారిడార్ ప్రముఖ పాత్ర వహిస్తుందని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఎయిర్ పోర్ట్ నుంచి మీర్ ఖాన్ పేట్‌లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారీకి జరుగుతున్న సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో పరిశీలించి అనేక సూచనలు చేశారు. కొంగరకలాన్ దాటిన తర్వాత ప్రస్తుతం రోడ్డు లేకపోవడం వల్ల కాలినడకన కొండలు, గుట్టలు దాటుకొని ఆయన ఈ క్షేత్ర పర్యటన జరిపారు.

**అత్యంత ఆకర్షణీయంగా మెట్రో స్టేషన్ల అభివృద్ధి**

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుందని, అది ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుంచి మొదలై కొత్తగా ఏర్పాటు చేయబోయే మెట్రో రైల్ డిపో పక్క నుంచి ఎయిర్ పోర్ట్ సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా మన్సాన్‌పల్లి రోడ్డు గుండా 5 కిలోమీటర్లు ముందుకు సాగాక పెద్ద గొల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్‌కి చేరుతుందని మెట్రో ఎండీ తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా బహదూర్‌గూడలో ఉన్న దాదాపు 1000 నుంచి 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండల్లో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల్ ఎగ్జిట్ వరకు దాదాపు 14 కిలోమీటర్ల పొడవున ఈ మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్ మెట్రో మార్గంగా ఓఆర్ఆర్‌లో మెట్రో రైల్‌కి కేటాయించిన భాగంలో తక్కువ ఎత్తులో నిర్మిస్తామని తెలిపారు.



**ఆకర్షణీయమైన చెట్లను, గ్రీనరీని అభివృద్ధి చేస్తాం..**

రావిర్యాల్ ఎగ్జిట్ నుంచి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగుడా, మీర్‌ఖాన్ పేట్ వరకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో 100 మీటర్లు (328 అడుగులు) వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 22మీటర్ల(72 అడుగులు) మెట్రోరైల్‌కి కేటాయించడమైందని, ఈ కేటాయించిన రోడ్డు మధ్య స్థలంలో మెట్రో రైల్ కారిడార్ 'ఎట్ గ్రేడ్' (భూ తలంపై) మెట్రోగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ విశాలమైన రోడ్డు మధ్యలో అదే లెవెల్‌లో మెట్రో రైల్ ఉంటే దానికి ఇరువైపులా మూడు లైన్ల ప్రధాన రహదారి ఉంటుందని, మెట్రోను, ప్రధాన రహదారిని విభజిస్తూ ఆకర్షణీయమైన చెట్లను, గ్రీనరీని అభివృద్ధి చేస్తామని, ప్రధాన రహదారికి ఇరువైపులా మరల రెండు సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## మార్చి చివరినాటికి మూడు కారిడార్ల డీపీఆర్‌లు..

తన గత అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, డాక్టర్ వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఓఆర్ఆర్ నిర్మిస్తున్నప్పుడు.. అందులో అంతర్భాగంగా భవిష్యత్తులో నిర్మించబోయే మెట్రోకి తగినంత స్థలాన్ని కేటాయించాలన్న అప్పటి తన ప్రతిపాదనను వైఎస్ఆర్ అంగీకరించి ఓఆర్ఆర్‌లో 20మీటర్లు మెట్రోకి కేటాయించారని మెట్రో ఎండీ తెలిపారు. అప్పట్లో అనేక మంది ఓఆర్ఆర్, మెట్రో వంటి బృహత్ ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితమవుతాయని, అవి ఆచరణ సాధ్యం కాదని అపహాస్యం చేసినా ఈ రోజు ఓఆర్ఆర్, మెట్రో రెండూ కార్యరూపం దాల్చాయని చెప్పారు.

వీటివల్ల హైదరాబాద్ ఒక అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెంది, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పెద్దఎత్తున అమలు చేస్తున్న మౌలిక వసతుల ప్రాజెక్టులతో హైదరాబాద్‌కు మరింత ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఏవిధంగా అయితే ప్రపంచంలో ప్రప్రథమంగా రూ.22వేల కోట్లతో మెట్రో మొదటి దశను 69 కిలోమీటర్ల మేర పీపీపీ పద్ధతిన విజయవంతంగా పూర్తి చేశామో, అదే విధంగా ఈ ప్రణాళికలనూ సీఎం రేవంత్ రెడ్డి దార్శనికతతో కార్యరూపం దాల్చేలా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, మెట్రో రైల్ సంస్థలు సంయుక్తంగా కృషి చేస్తాయన్నారు. నార్త్ సిటీలోని మేడ్చల్, శామీర్ పేట్ కారిడార్లతో పాటు ఈ ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్ కూడా ఈ మార్చి నెలాఖరుకు పూర్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ క్షేత్ర పరిశీలనలో సంబంధిత ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.